ఆంధ్రప్రదేశ్ శాసన సభ కార్యకలాపాలు

ANDHRA PRADESH LEGISLATIVE ASSEMBLY DEBATES

అధికార నివేదిక

OFFICIAL REPORT

మంగళవారం, సెప్టెంబర్ 2, 2014

TUESDAY, THE 2nd SEPTEMBER, 2014

14వ శా.స. 2 వ సమావేశం, వాల్యూం–3 నంబరు–5

14TH L.A. II – SESSION, VOL-3 NO.-5

శక సంవత్సరం–1936, భాద్ర –11

11- Bhadra, 1936 – S.E.

శాసన సభ సచివాలయం
పబ్లిక్ గార్డెన్స్
హైదరాబాదు– 500 004.

LEGISLATURE SECRETARIAT
PUBLIC GARDENS, NAMPALLY
HYDERABAD - 500 004.

ఆంధ్రప్రదేశ్ శాసన సభ
ప్రధాన అధికారులు

సభాపతి	ః	డా. కోడెల శివప్రసాదరావు
ఉప సభాపతి	ః	శ్రీ మండలి బుద్ధప్రసాద్
కార్యదర్శి(ఇంచార్జ్)	ః	శ్రీ కె.సత్యనారాయణ రావు
ఉప కార్యదర్శులు	ః	శ్రీ పి.బాలకృష్ణమాచార్యులు శ్రీ ఎం. విజయరాజు
సహాయ కార్యదర్శులు	ః	శ్రీ పి.వి.సుబ్బారెడ్డి శ్రీ కె.రాజకుమార్ శ్రీమతి ఆర్.వనితారాణి శ్రీ పి.నరసింహ శ్రీ బి.కమలాకర్ డా. వై.కామేశ్వరి శ్రీ ఇ. సంజీవరావు శ్రీ కె.వెంకటేశ్వరరావు శ్రీ డి.జగన్‌మోహన్‌రావు శ్రీ బి.ప్రభాకర్‌రావు
చీఫ్ రిపోర్టర్	ః	శ్రీ శ్రీనివాస్ అల్లాడి

– – –

ఆంధ్రప్రదేశ్ శాసనసభ చర్చలు

అధికార నివేదిక

(14వ శాసన సభ)
(రెండవ సమావేశము : పదకొండవ రోజు)

మంగళవారం, సెప్టెంబర్ **2, 2014**
సభ ఉ.గం**.09.00.**లకు ప్రారంభమైనది
(గౌ. సభాపతి అధ్యక్ష స్థానములో ఉన్నారు)

విషయ సూచిక

			పుట సంఖ్య
1.	వాయిదా తీర్మానం – తిరస్కరణ (రాష్ట్ర రాజధానిపై శివరామకృష్ణన్ కమిటీ సమర్పించిన నివేదిక గురించి)	....	5–6
2.	నక్షత్రపు గుర్తు ప్రశ్నలు మరియు సమాధానాలు	.....	7–42
3.	జీరో అవర్	.....	42–54
4.	ఆర్థిక ప్రతిపాదనలు (డిమాండ్లు) సభకు సమర్పణ మరియు చర్చ	.....	54–102
6.	సభ వాయిదా	.....	102

ఆంధ్రప్రదేశ్ శాసన సభ

14వ శాసనసభ, 2వ సమావేశం

మంగళవారం, 2వ తేది సెప్టెంబరు, సం.2014.

*** ****

(సభ ఉదయం సమయం గం.09.00లకు సమావేశమైనది. గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు.)

* * *

వాయిదా తీర్మానం

MR. SPEAKER: First, let me read out the notice given for an Adjournment Motion.

రాష్ట్ర రాజధానిపై శివరామకృష్ణణ్ కమిటీ సమర్పించిన నివేదిక గురించి శ్రీ ఎన్. అమరనాథరెడ్డి మరియు ఇతరులు ఇచ్చిన వాయిదా తీర్మానం తిరస్కరించడమైనది.

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు శ్రీ జ్యోతుల నెహ్రూ మాట్లాడటానికి అవకాశమివ్వాలని గౌరవ సభాపతిని కోరారు)

మిస్టర్ స్పీకర్ఃమీరు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని చదివాను. కంటెంట్స్‌ను నోట్ చేసుకున్నాను. ఇదే సబ్జెక్ట్ మీద ఈరోజు ముఖ్యమంత్రిగారు ఒక స్టేట్‌మెంట్‌ను ఇవ్వబోతున్నారు. అదేవిధంగా Bifurcation of the State and its impact పైన షార్ట్ డిస్కషన్ జరగబోతోంది. Therefore, going into discussion on this point now, is not correct. The Adjournment Motion has already been disallowed and rejected. So, let us now go to the Question Hour.

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు శ్రీ జ్యోతుల నెహ్రూ మాట్లాడటానికి అవకాశమివ్వాలని గౌరవ సభాపతిని కోరారు)

Yes. What do you want? Anyhow, they are going to discussion on the subject.

(గౌరవ ఆర్థిక శాఖ మరియు శాసనసభా వ్యవహారాల శాఖా మంత్రి శ్రీ యనమల రామకృష్ణుడు మాట్లాడటానికి అవకాశమివ్వాలని గౌరవ సభాపతిని కోరారు)

మిస్టర్ స్పీకర్ఃమినిస్టరు గారు.

శ్రీ యనమల రామకృష్ణుడు(ఆర్థిక శాఖా మంత్రి)ఃఅధ్యక్షా, నిన్న నేను ఒక పాయింట్ ఆఫ్ ఆర్డరును రెయిజ్ చేశాను. ఆ పాయింట్ ఆఫ్ ఆర్డరు ప్రకారం మీరు ఏదైనా ఒక డైరెక్షన్ ఇవ్వాలి. ఎందుచేతనంటే (ప్రతిపక్ష సభ్యులు శ్రీ జ్యోతుల నెహ్రూను ఉద్దేశించి) వాళ్లు మాట్లాడేటప్పుడు వాళ్ల సీట్లలోంచే మాట్లాడటం బెటర్. ఒకవేళ లేదు అంటే సీటు మార్చుకొని కూర్చోమనండి, మాకేం అభ్యంతరం లేదు.

MR. SPEAKER: They have changed their seats. Q. No. 84.

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు శ్రీ జ్యోతుల నెహ్రూ గారు ఒక్క నిమిషం, చాలా ప్రాధాన్యత కలిగిన విషయం, మాట్లాడటానికి అవకాశమివ్వాలని గౌరవ సభాపతిని కోరారు)

The subject is going to be taken up in the House. It is not correct. When it is disallowed, there is no point in going for discussion now.

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు శ్రీ జ్యోతుల నెహ్రూ గారు ఒక్క నిమిషం, చాలా ప్రాధాన్యత కలిగిన విషయం, మాట్లాడటానికి అవకాశమివ్వాలని గౌరవ సభాపతిని కోరారు)

One minute or half minute is not the question here. If you do not want to go into discussion, then it is Okay. What do you want to tell then?

శ్రీ జ్యోతుల నెహ్రు (జగ్గంపేట)ఃఅధ్యక్షా, ఈరోజు మేం ఇచ్చిన వాయిదా తీర్మానం చాలా ప్రాధాన్యత కలిగిన అంశం. ఈ రాష్ట్ర ప్రజానీకానికి భవిష్యత్‌ను తీర్చిదిద్దే అంశం. దీనిమీద గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రకటన చేస్తారని చెప్పారు. దానిని స్వాగతిస్తున్నాం. ఏదైనా ప్రకటన చేసే ముందు, చాలా ప్రాధాన్యత అంశం కాబట్టి, ఈ శాసనసభలో సుదీర్ఘంగా చర్చించి, అందరి సభ్యుల అభిప్రాయాలను తెలుసుకుని, వాటిని క్రోడీకరిస్తూ ఒక ప్రకటన ఇస్తే, ఉభయత్రా శ్రేయస్సుకరంగా ఉంటుంది. రాష్ట్ర శ్రేయస్సుకు మంచిది అవుతుంది. ఆ రకమైన విధానంతో మనం దీనిని చర్చకు తీసుకుంటే బాగుంటుంది. దీనిని ఒక ప్రత్యేక చర్చగా భావిస్తూ, దీనిపై చర్చకు ఒక రోజు మొత్తాన్ని కేటాయించాలని, సభను, మిమ్మల్ని ప్రత్యేకంగా కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్ఃఅవసరమైన మేరకు టైం తీసుకోవడం జరుగుతుంది.

MR SPEAKER: Now, Question Hour.

Question No.84 (91) Deputy Chief Minister & Minister for Revenue.

సర్వశ్రీ శ్రీ గొల్లపల్లి సూర్యారావు, ఎం.ఎల్.ఎ.

అ) ఆంధ్రప్రదేశ్‌లో జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా తూర్పు గోదావరి జిల్లా డెల్టా ప్రాంతం మరియు కోనసీమ ప్రాంతాలలో కొంత భాగాన్ని విడదీసి కొత్త జిల్లా ఏర్పాటు చేసి, ఆ జిల్లాకు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌గా నామకరణం చేసే ప్రతిపాదన ఏదైనా ఉందా?

ఆ) అయితే, ఈ విషయంలో ప్రభుత్వం తీసుకొంటున్న చర్యల వివరాలు ఏమిటి?

ఉప ముఖ్యమంత్రి (రెవెన్యూ), స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖా మంత్రి శ్రీ కె. ఇ.కృష్ణమూర్తి :

అ) లేదండీ.
ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

మిస్టర్ స్పీకర్: సూర్యారావుగారు.

శ్రీ గొల్లపల్లి సూర్యారావు (రాజోలు): అధ్యక్షా నమస్కారం. సహజంగా ఏ రాష్ట్రం అయినా ఏర్పడినప్పుడు, ఆ రాష్ట్రంలో ఉన్న జిల్లాలను పెంపుదల చేసుకోవడం అనేది ఆవశ్యకత, రాజ్యాంగబద్ధమైన ఒక ప్రక్రియ. నేను అడిగింది కోనసీమ ప్రాంతం గురించి. తూర్పు గోదావరి జిల్లాలో మరొక జిల్లాను ఏర్పాటు చేసే ఆలోచన ఏమైనా ఉందా అని అడిగితే గౌరవ మంత్రిగారు లేదని చెప్పారు. సహజంగా కోనసీమ ప్రాంతం ఐదు నియోజకవర్గాల పరిధిలో ఉంది. పురాతనంగా ఒక ప్రత్యేక ప్రాంతంగా గుర్తింపుపొందిన ప్రాంతం ఇది. ఈ కోనసీమ ప్రాంతం పూర్తిగా వ్యవసాయాధారిత ప్రాంతం. ఒక్క పరిశ్రమ కూడా అక్కడ లేదు. అక్కన జీవన విధానంలో ఏవైనా మెరుగైన పద్ధతులు తీసుకురావడానికి, అక్కడ ప్రాంత ప్రజలకు వ్యవసాయం తప్ప వేరే ఏదీ లేదు. అక్కడ రెండు నదులున్నాయి. ఆ రెండు నదుల మధ్య సుమారుగా ఏడు ఉపనదులతో కూడుకొని ఉన్న ప్రాంతం కోనసీమ ప్రాంతం. ప్రస్తుతం మన రాష్ట్రం 13 జిల్లాలుగా ఉంది. సహజంగా యూరోపియన్ దేశం వాళ్లు 13 అనే అంకెను పెద్దగా ఇష్టపడే సంఖ్య కూడా కాదు. మనం ఎంత త్వరగా ఈ రాష్ట్రంలో జిల్లాలను విభజన చేసుకోగలిగితే, అంత అభివృద్ధి పంథాలో మనం ముందుకువెళ్తామనే ఒక మాటను తమరికి సవినయంగా మనవిచేస్తున్నాను. అమలాపురంను కేంద్రంగా చేసుకుని, ముమ్మిడివరం, తాళ్లరేవు, కొత్తపేట,

గన్నవరం, రాజోలు ఈ ప్రాంతం అంతా కలిపి సుమారు 25 లక్షల జనాభా కలిగిన ప్రాంతం. ఇది చాలా పురాతనమైన డెల్టా ప్రాంతం. బహుశా అత్యధికమైన విద్యావంతులు కలిగిన ప్రాంతం ఈ కోనసీమ ప్రాంతం. బహుశా భారతదేశంలో లేక ఆంధ్రప్రదేశ్‌లో డా.బి.ఆర్. అంబేద్కర్‌గారిని దైవంగా కొలుచుకొనే, ప్రత్యేకతకలిగిన ప్రాంతం కోనసీమ. మీరు కూడా చాలాసార్లు కోనసీమ ప్రాంతానికి వచ్చారు. ప్రతీ రెండు కిలోమీటర్లకు నాలుగు, మూడు అంబేద్కర్ విగ్రహాలను, గౌతమబుద్ధ విగ్రహాలను పెట్టుకుని వారిని ఒక దైవంగా పూజించి, మంచి సంప్రదాయం కలిగిన ప్రాంతం ఈ కోనసీమ ప్రాంతం. తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని మరియు గౌరవ ముఖ్యమంత్రిగారిని కూడా కోరుతున్నాను. ఒకవేళ భవిష్యత్‌లో కొన్ని జిల్లాలను పెంచాలని అనుకున్నప్పుడు ఈ కోనసీమ ప్రాంతానికి కూడా కాస్త ప్రాధాన్యత ఇచ్చి, ప్రాధాన్యత ఇచ్చిన జిల్లాకు డా.బి.ఆర్. అంబేద్కర్ గారి జిల్లాగా నామకరణం చేయాలని గౌరవ మంత్రిగారిని మీద్వారా ప్రార్థిస్తున్నాను.

మిస్టర్ స్పీకర్: మినిస్టరు గారు.

శ్రీ కె.ఇ.కృష్ణమూర్తి (పత్తికొండ): కొత్త జిల్లాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నప్పుడు ప్రజాభిప్రాయాల్ని కోరడం జరుగుతుంది. అదేవిధంగా సభ్యులు శ్రీ గొల్లపల్లి సూర్యారావుగారు చెప్పిన అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకొంటాం. ఏ ప్రాంతాన్ని అయినా విడగొట్టడానికి గాని, కలపటానికి గాని, సరిహద్దులు మార్చటానికి గాని ప్రజల అభిప్రాయం కోరవలసి ఉంటుంది.

అదేవిధంగా ఒక జిల్లా పేరును గాని, రెవిన్యూ డివిజను పేరును, మండలం పేరును మార్చవలసినప్పుడు కూడా ఇదే పద్ధతిని అవలంబిస్తుంటాం. ప్రస్తుతం కొత్త జిల్లాల ఏర్పాటుకు ఏవిధమైన విజ్ఞప్తులు ప్రభుత్వానికి రాలేదు.

ఇదే గాకుండా, కొత్త జిల్లాల ఏర్పాటు చట్టం 15.02.1974వ సంవత్సరం నుంచి అమలులోకి వచ్చింది. కొత్త జిల్లాల ఏర్పాటుకు మరియు జిల్లాల సరిహద్దుల ఏర్పాటుకు, ప్రాంతాల సుపరిపాలన కోసం మార్పులు చేయడానికి అవకాశం ఉంది. ఈ చట్టం రాకముందు 02.02.1970వ సంవత్సరంలో ప్రకాశం జిల్లాను ఏర్పాటుచేయడం జరిగింది. నెల్లూరు, గుంటూరు, కర్నూలు జిల్లాలోని కొన్ని ప్రాంతాలను కలిపి ప్రకాశం జిల్లాను ఏర్పాటుచేయడం జరిగింది. అదేవిధంగా 1979వ సంవత్సరంలో విశాఖపట్టణం, శ్రీకాకుళం జిల్లాలలోని కొన్ని ప్రాంతాలను కలిపి విజయనగరం జిల్లాను ఏర్పాటుచేయడం జరిగింది. సభ్యులు శ్రీ గొల్లపల్లి సూర్యారావుగారు చెప్పిన అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకొని, ఎప్పుడైనా సరే భవిష్యత్‌లో జిల్లాలను ఏర్పాటుచేసినప్పుడు, తప్పనిసరిగా వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొంటాం.

మిస్టర్ స్పీకర్: సూర్యారావుగారు.

శ్రీ గొల్లపల్లి సూర్యారావు (రాజోలు)ః చాలా సంతోషం అధ్యక్షా, మంచి శుభకరమైన మాటను గౌరవ మంత్రిగారు చెప్పారు. భవిష్యత్‌లో అటువంటి ఆలోచన కనుక ఉంటే సభ్యుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామని అన్నారు. కోస్తా ప్రాంత ప్రజల చిరకాల కోరిక. మంచి విద్యావంతులు, చక్కటి వాతావరణం కలిగినటువంటి ప్రాంతం. తప్పకుండా మీద్వారా గౌరవ మంత్రిగారిని, గౌరవ ముఖ్యమంత్రిగారిని నా హృదయపూర్వకంగా కోరుతున్నాను, వారిని ప్రార్థిస్తున్నాను. ఈ తెలుగుదేశం పార్టీ మరియు ప్రభుత్వం త్యాగమూర్తులను గుర్తించి, గౌరవించి, సంప్రదాయాలు కలిగిన పార్టీ. డా.బి.ఆర్.అంబేద్కర్‌గారి పేరును తప్పకుండా పరిశీలనలోకి తీసుకోవాలని మిమ్మల్ని ప్రార్థిస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ఃకోన రఘుపతి గారు.

శ్రీ కోన రఘుపతి (బాపట్ల)ః ధన్యవాదాలు అధ్యక్షా. గౌరవ మంత్రిగారిని మీద్వారా కోరుతున్నాను. 1982వ సంవత్సరంలో గుంటూరు జిల్లాను కూడా చీరాలను ప్రకాశం జిల్లాలో కలిపిన తర్వాత తాలుకాలుగా ఉన్న బాపట్ల, చీరాల, పొన్నూరు, చిలకలూరిపేట వరకు కూడా వాటిని ఒక బాపుపూర్ జిల్లాగా మార్చాలనే ఒక ప్రతిపాదనను స్వర్గీయ కోన ప్రభాకరరావుగారు తీసుకురావడం జరిగింది. దానిని కూడా పరిగణలోకి తీసుకుని బాపట్లను జిల్లా హెడ్ క్వార్టరు కింద బాపుపూర్ జిల్లాను ఏర్పాటుచేయవలసిందిగా మీద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

...

మిస్టర్ స్పీకర్ఃరెవిన్యూ మినిస్టర్ గారు.

శ్రీ కె.ఈ.కృష్ణమూర్తి (పత్తికొండ)ః అధ్యక్షా, రాష్ట్ర విభజన జరిగినప్పుడు ఇరుప్రాంతాల నుంచి జిల్లాల పెంపుదల చేయాలని సూచనలు వస్తున్నాయి. గౌరవ సభ్యులు చెప్పినట్లు ఇంతకుముందు ప్రతిపాదన ఏదైనా ఉన్నా, లేక శ్రీ గొల్లపల్లి సూర్యారావు గారు చెప్పినట్లు కొత్తగా కోరినా, ఆయా ప్రాంతాల ప్రజల అభిప్రాయాలను కూడా తీసుకుని తప్పనిసరిగా భవిష్యత్తులో ఈ కార్యక్రమం నిర్వహిస్తాము.

మిస్టర్ స్పీకర్ఃప్రశ్న నెం.191 (92). మినిస్టర్ ఫర్ మెడికల్ అండ్ హెల్త్.

ప్రశ్న నెం. 191 (92)

సర్వశ్రీ... కిడారి సర్వేశ్వర రావు, శ్రీమతి ఈశ్వరి గిడ్డి, – ఎం.ఎల్.ఏ.లు

ఎ) గిరిజన ప్రాంతాలలో సరైన వైద్య సౌకర్యాలు లేక అనేకమంది గిరిజనులు మరణించిన విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా;

బి) అయితే, ఆ గ్రామంలో సదరు సమస్యను నివారించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఏమిటి;

సి) ఆసుపత్రుల వారీగా పి.హెచ్.సి.లు, సి.హెచ్.సిలలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది వివరాలు, ఆయా ఆసుపత్రుల్లో భర్తీ చేయనున్న పదవుల సంఖ్య ఎంత?

ఆరోగ్య, వైద్య విద్యా శాఖ మంత్రి (డా.కామినేని శ్రీనివాస్) :

ఎ) లేదండీ.

బి) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

సి) పట్టికను సభ సమక్షంలో ఉంచడమయింది.

శ్రీ కిడారి సర్వేశ్వరరావు & శ్రీమతి ఈశ్వరి గిడ్డి, శాసనసభ్యులు అడిగిన
శాసనసభ ప్రశ్న నెం. 191లోని (ఎస్ (సి) ప్రశ్నకు సమాధానం

ఆసుపత్రుల వారీగా పి.హెచ్.సిలను, సి.హెచ్.సి.లలో పనిచేస్తున్న వైద్యుల సిబ్బంది వివరాలు, ప్రజా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టరు ద్వారా భర్తీ చేయనున్న పదవుల సంఖ్య ?

వరుస సంఖ్య	పి.హెచ్.సి. పేరు	సిఎహెచ్ఎస్		నర్సింగ్ సిబ్బంది		పారా మెడికల్ ఇతర సిబ్బంది	
		మంజూరయినవి	భర్తీ చేయనున్నవి	మంజూరయినవి	భర్తీ చేయనున్నవి	మంజూరయినవి	భర్తీ చేయనున్నవి
	శ్రీకాకుళం						
1	పి.హెచ్.సి. గుట్టవల్లి	2	0	1	0	22	0
2	పి.హెచ్.సి. ఎమ్.ఎస్.పల్లి	2	0	2	0	21	6
3	పి.హెచ్.సి. కంచిలి	1	0	1	0	22	2
4	పి.హెచ్.సి. సర్వకోట	1	0	3	0	37	4
5	పి.హెచ్.సి. బాలేరు	1	0	1	0	17	1
6	పి.హెచ్.సి. భామిని	3	0	4	0	20	2
7	పి.హెచ్.సి. బట్టలి	1	0	0	0	14	1
8	పి.హెచ్.సి.మర్రిపాడు	1	0	1	0	22	3
9	పి.హెచ్.సి.అన్నవరం	1	0	1	0	27	2
10	పి.హెచ్.సి. బిటివాడ	2	0	1	0	24	0
11	పి.హెచ్.సి. ఎమ్.సింగపురం	2	0	2	1	20	1
12	పి.హెచ్.సి. వీరఘట్టం	2	0	3	0	27	3
13	పి.హెచ్.సి. దోనుబాయ్	1	0	2	2	26	5
14	పి.హెచ్.సి. కుసిమి	1	0	1	0	22	5
15	పి.హెచ్.సి. మందస	1	0	1	0	16	4
16	పి.హెచ్.సి. సిరిపురం	1	0	3	1	11	3
17	పి.హెచ్.సి. బి.బి.కాలనీ	2	1	1	0	14	1
18	పి.హెచ్.సి. కురిగమ్	2	0	1	0	20	4
19	పి.హెచ్.సి. మెలియపుట్టి	1	0	3	1	25	4
20	పి.హెచ్.సి. హీరమండలం	2	0	3	0	31	5
21	పి.హెచ్.సి. చోర్లంగి	2	0	1	0	13	0
22	పి.హెచ్.సి. చాపా	1	0	1	0	15	3
23	పి.హెచ్.సి.గంగువాడ	2	0	4	1	25	2
24	పి.హెచ్.సి. బైదలాపురం	1	0	3	0	28	1
25	పి.హెచ్.సి. కారజడ	2	0	3	0	14	3
26	పి.హెచ్.సి. ఎల్.ఎన్.పేట	2	0	1	0	23	5
27	పి.హెచ్.సి. నందిగామ్	1	0	3	1	32	3
	విజయనగరం						
1	పి.హెచ్.సి. బండలుప్పి	1	0	2	0	20	4
2	పి.హెచ్.సి. దోకిసిల	2	0	1	0	16	3
3	పి.హెచ్.సి. పెదబొండపల్లి	1	0	0	0	3	0

4	పి.హెచ్.సి. కొమరాడ	2	1	1	0	29	10
5	పి.హెచ్.సి. కె.ఆర్.బి.పురం	2	0	2	0	22	8
6	పి.హెచ్.సి. బాగువలస	1	1	0	0	3	2
7	పి.హెచ్.సి. మక్కువ	1	0	1	0	24	8
8	పి.హెచ్.సి. సంబరా	1	0	1	1	17	7
9	పి.హెచ్.సి. పాచిపెంట	1	0	1	0	23	4
10	పి.హెచ్.సి. జిఎన్.పేట	2	0	1	0	23	6
11	పి.హెచ్.సి. మామిడిపల్లి	1	0	1	0	28	10
12	పి.హెచ్.సి. తోనం	2	1	2	0	23	12
13	పి.హెచ్.సి. మదలింగి	1	0	1	0	4	3
14	పి.హెచ్.సి. మెండెంఖల్లు	2	1	1	0	34	9
15	పి.హెచ్.సి. ఎన్.కె.పురం	1	0	0	0	5	0
16	పి.హెచ్.సి. దుడ్డిఖల్లు	1	0	0	0	3	3
17	పి.హెచ్.సి. తాడికొండ	2	2	1	0	35	19
18	పి.హెచ్.సి. రెగిడి	1	0	1	0	20	10
19	పి.హెచ్.సి. జియ్యమ్మవలస	2	1	1	0	28	7
20	పి.హెచ్.సి. ఆర్.ఆర్.బి.పురం	1	0	1	0	10	4
21	సి.హెచ్.సి. చినమెరంగి	4	2	1	1	9	4
22	సి.హెచ్.సి. కురుపమ్	6	3	7	1	37	18
23	సి.హెచ్.సి. భద్రగిరి	3	3	1	0	8	6
	విశాఖపట్నం						
1	పి.హెచ్.సి. అనంతగిరి	1	0	1	0	19	2
2	పి.హెచ్.సి. భీమవరం	1	0	1	0	16	2
3	పి.హెచ్.సి. దుంపీరిగూడ	1	1	2	0	19	8
4	పి.హెచ్.సి. గన్నెల	2	2	3	2	24	4
5	పి.హెచ్.సి. కిల్లోగూడ	1	1	1	0	19	3
6	పి.హెచ్.సి. లొంగపర్తి	1	0	1	1	17	6
7	పి.హెచ్.సి. మాదగడ	1	0	1	0	23	2
8	పి.హెచ్.సి. సుంకరమెట్ట	0	0	0	0	1	1
9	పి.హెచ్.సి. దరకొండ	1	0	1	1	15	6
10	పి.హెచ్.సి. జి.కె.వీధి	1	0	1	0	19	4
11	సి.హెచ్.సి. చింతపల్లి	6	3	10	3	2	1
12	పి.హెచ్.సి. జెర్రెల	2	2	3	0	13	5
13	పి.హెచ్.సి. కోరుకొండ	1	1	1	0	7	2
14	పి.హెచ్.సి. లంబసింగి	1	0	1	0	19	2
15	పి.హెచ్.సి. లూటుగడ్డ	2	1	3	1	25	6
16	పి.హెచ్.సి. పెద్దవలస	1	0	1	0	9	1
17	పి.హెచ్.సి. ఆర్.వి.నగర్	1	0	0	0	1	1
18	పి.హెచ్.సి. సప్పరాల	1	0	1	0	13	5
19	పి.హెచ్.సి. సీలేరు	1	1	0	0	0	0
20	పి.హెచ్.సి. తాజెంగి	1	0	1	0	8	0
21	పి.హెచ్.సి. చౌడువేల	0	0	0	0	2	0
22	పి.హెచ్.సి. పెనకోట	1	0	1	0	14	4

23	పి.హెచ్.సి. గోమంగి	1	1	0	0	12	4
24	పి.హెచ్.సి. లబ్బమ్	1	1	1	0	16	8
25	పి.హెచ్.సి. ముంచింగిపేట్	2	0	3	1	34	12
26	పి.హెచ్.సి. కొలగడ	0	0	0	0	1	1
27	పి.హెచ్.సి. పెద్దబాయలు	1	1	1	0	27	14
28	పి.హెచ్.సి. రుద్రకోట	1	1	0	0	18	19
29	పి.హెచ్.సి. దొనర్రు	1	0	1	0	9	0
30	పి.హెచ్.సి. కెడి పేట	1	0	1	0	14	5
31	పి.హెచ్.సి. ఉప్పు	2	1	1	0	24	11
32	పి.హెచ్.సి. మినుములూరు	1	0	1	0	33	10
33	పి.హెచ్.సి. హకింపేట	6	2	5	0	28	11
34	పి.హెచ్.సి. జెమ్మిలి	1	1	1	0	23	16
35	పి.హెచ్.సి. జి.మాడుగుల	1	1	2	0	19	8
36	పి.హెచ్.సి. ఈదులపాలెం	1	0	1	1	17	8
37	పి.హెచ్.సి. ఆర్ జె పాలెం	1	0	3	0	19	2
38	పి.హెచ్.సి. కోటారం	1	0	1	1	11	1
	తూర్పుగోదావరి						
1	సి.హెచ్.సి. అడ్డతీగల	5	3	9	0	14	13
2	చవిటిదిబ్బల	1	1	1	0	21	10
3	దుబ్బలపాలెం	1	1	1	0	22	9
4	గంగవరం	2	1	1	0	17	8
5	రాజఒమంగి	2	1	1	0	27	10
6	ఎల్లావరం	1	0	2	0	22	6
7	బోడులూరు	2	2	1	0	24	15
8	దేవీపట్నం	1	1	0	0	27	9
9	గుర్తేడు	2	1	1	0	16	10
10	కొండమొదుల	2	1	1	0	12	7
11	మంగంపాడు	2	2	1	0	12	8
12	మారేడుమిల్లి	3	2	1	0	27	17
13	నర్సాపురం	2	0	1	0	20	7
14	పి.గెద్దన్న	1	0	1	0	21	7
15	వాడపల్లి	2	0	1	0	17	8
	పశ్చిమ గోదావరి						
1	సి.హెచ్.సి పోలవరం	4	1	2	0	17	8
2	సి.హెచ్.సి బుట్టయ్యగూడెం	3	0	1	0	7	4
3	పి.హెచ్.సి అంతర్వేదిగూడెం	2	0	1	0	8	3
4	పి.హెచ్.సి దోరమామిడి	2	0	2	0	15	8
5	పి.హెచ్.సి జీలుగుమిల్లి	1	1	0	0	13	6
6	పి.హెచ్.సి కామయ్యపాలెం	2	0	1	0	8	3
7	పి.హెచ్.సి కొండ్రుకోట	1	0	1	0	8	4
8	పి.హెచ్.సి ఎల్ ఎన్ డి పేట	2	1	1	0	15	7
9	పి.హెచ్.సి నందాపురం	1	0	1	0	7	1
10	పి.హెచ్.సి పి ఆర్ గూడెం	1	0	1	0	8	1

11	పి.హెచ్.సి వింజామరం	2	1	1	0	10	3
12	పి.హెచ్.సి కె ఆర్ పురం	1	0	1	0	6	0
	గుంటూరు						
1	పి.హెచ్.సి మాచర్ల (టి)	2	1	1	0	12	2
2	పి.హెచ్.సి కొప్పనూరు	1	0	1	0	11	6
3	పి.హెచ్.సి సిరిగిరిపాడు	2	1	1	0	12	4
4	పి.హెచ్.సి ఉప్పలపాడు	2	1	1	0	24	6
5	పి.హెచ్.సి కంభంపాడు	2	1	1	0	10	2
	ప్రకాశం						
1	పి.హెచ్.సి చింతల	2	1	1	1	8	0
2	పి.హెచ్.సి కొర్రప్రోలు	2	1	1	0	6	0
3	పి.హెచ్.సి పాలుట్ల	2	1	1	1	8	1
4	పి.హెచ్.సి వెంకటాద్రిపాలెం	2	1	1	0	10	4
	కర్నూలు						
1	సి.హెచ్.సి వెలుగోడు	2	2	1	0	8	4
2	సి.హెచ్.సి పాణ్యం	2	0	1	0	12	4
3	పి.హెచ్.సి అహోబిలం	1	0	1	0	30	6
4	పి.హెచ్.సి రుద్రవరం	2	0	1	0	15	5
5	సి.హెచ్.సి చాగల్ మర్రి	2	0	1	0	26	6
6	పి.హెచ్.సి గాజులపల్లి	2	0	1	0	9	3
7	పి.హెచ్.సి కోటపల్లి	1	0	1	0	12	2
8	పి.హెచ్.సి గోకవరం	1	0	1	0	8	1
9	పి.హెచ్.సి పాములపాడు	1	0	1	0	21	5
10	పి.హెచ్.సి బండిఆత్మకూరు	2	0	1	0	14	4
11	పి.హెచ్.సి తిమ్మాపురం	2	0	1	0	12	0
12	పి.హెచ్.సి బెర్లుటి	0	0	1	0	15	1
13	పి.హెచ్.సి కొట్టల చెరువు	2	0	1	0	8	3
14	పి.హెచ్.సి ఎర్రగ్ మాతమ్	2	0	1	0	7	2
15	పి.హెచ్.సి ఆలమూరు	1	0	2	0	11	5
16	పి.హెచ్.సి శ్రీశైలం	1	0	2	0	11	5
17	పి.హెచ్.సి నారాయణపురం	2	0	2	1	9	0
18	పి.హెచ్.సి వెలుగోడు (టి)	2	0	1	0	2	0



ఆసుపత్రుల వారీగా పి.హెచ్.సి.లు, సి.హెచ్.సి.లలో పనిచేస్తున్న వైద్యుల, సిబ్బంది వివరాలు మరియు వైద్య విధాన పరిషత్తు ద్వారా భర్తీ చేయనున్న పదవుల సంఖ్య

వరుస సంఖ్య	పి.హెచ్.సి. పేరు	సిఎఎస్		నర్సింగ్ సిబ్బంది		పారామెడికల్ మరియు ఇతర సిబ్బంది	
		మంజూరయినవి	భర్తీ చేయనున్నవి	మంజూరయినవి	భర్తీ చేయనున్నవి	మంజూరయినవి	భర్తీచేయనున్నవి
1.	ఏరియా హాస్పిటల్, రంపచోడవరం, (తూర్పు గోదావరి జిల్లా)	8	7	22	1	2	1
2.	ఏరియా హాస్పిటల్, అరకు (విశాఖపట్నం జిల్లా)	7	6	9	3	3	2
3.	ఏరియా హాస్పిటల్, పాడేరు (విశాఖపట్నం జిల్లా)	7	6	10	5	3	0
4.	ఏరియా హాస్పిటల్, పార్వతీపురం (విజయనగరం జిల్లా)	15	1	23	1	5	1
5.	ఏరియా హాస్పిటల్, జంగారెడ్డి గూడెం (పశ్చిమ గోదావరి జిల్లా)	12	4	7	0	3	1
6.	కమ్యూనిటీ హెల్త్ సెంటర్, వై. రామవరం (తూర్పు గోదావరి జిల్లా)	7	7	6	0	3	1

డా॥ కామినేని శ్రీనివాస్,
ఆరోగ్య, వైద్య & కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి.

మిస్టర్ స్పీకర్: సర్వేశ్వరరావు గారు.

శ్రీ కిడారి సర్వేశ్వరరావు (అరకువ్యాలీ): అధ్యక్షా, గౌరవ మంత్రిగారు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాలలో సరైన వైద్యసౌకర్యాలు లేక అనేకమంది గిరిజనులు మరణిస్తున్నారా? అని

అడిగిన ప్రశ్నకు సమాధానంగా, లేదు అని చెప్పడం చాలా అన్యాయం. ఈ రాష్ట్రంలో ప్రభుత్వాలు, నాయకులు మారుతున్నారు. కానీ, ఈరోజు గిరిజన ప్రాంతాల ప్రజల ఆరోగ్య స్థితిగతులు మారడంలేదు. చాలా అన్యాయంగా ప్రతీ సంవత్సరం కూడా, ఎపిడమిక్ సీజన్‌గా పిలువబడే జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వేలాదిమంది చనిపోతున్న పరిస్థితులు నేడు నెలకొన్నాయి. మలేరియా, డెంగ్యూ, ఆంత్రాక్స్, టైఫాయిడ్, ఎనీమియా వంటి రకరకాల వ్యాధుల బారిన పడడం జరుగుతోంది. ప్రభుత్వాలు కొన్ని రకాలైన వ్యాధులను గుర్తించలేక పోతున్నాయి. కొత్తరకాల వ్యాధులు పుట్టుకు వస్తున్నాయి. గిరిజనుల ప్రాణాలు, ప్రాణాలు కాదేమో అనే రకంగా ప్రభుత్వాలు, అధికారులు ప్రవర్తించే తీరు చూస్తే, చాలా బాధాకరమైన పరిస్థితి.

ఒకప్రక్క తినడానికి తిండి లేకపోగా, మరొకప్రక్క వాళ్ళ పిల్లలను కాపాడుకోలేని పరిస్థితి. చాలా అన్యాయంగా వాళ్ళు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వస్తోంది. వైద్యం చేయించుకోవడానికి, మండల హెడ్‌క్వార్టర్స్‌కి అయినా పోదామనుకుంటే, అక్కడ కూడా వైద్యం అందని పరిస్థితి. పంటి నొప్పి వచ్చినా కూడా, విశాఖపట్నం కె.జి.హెచ్.కు రావాల్సిన పరిస్థితి ఉంది. అధ్యక్షా, గిరిజన ప్రాంతాల్లో ఏరకమైన వ్యాధులు ఉత్పన్నమౌతున్నాయి, సీజనల్‌గా వచ్చే వ్యాధులేమిటి అనే విషయాలు ఒక డాక్టరుగా మీకు కూడా తెలుసు. ప్రతీ సంవత్సరం రాష్ట్ర జనాభా పెరుగుతుండగా, గిరిజన జనాభా మాత్రం పెరిగే పరిస్థితి లేదు. అంటే పుట్టుకతో సమానంగా చనిపోయే వారి సంఖ్య కూడా ఉంటోంది. గిరిజన ప్రాంతాలకు, ఎస్టీ ప్రజలకూ, ఎస్సీ ప్రజలకూ ప్రభుత్వాలు ఏవేవో చేస్తున్నామని చెప్తున్నాయే గానీ,

మిస్టర్ స్పీకర్: ప్రశ్న గురించి అడగండి.

శ్రీ కిడారి సర్వేశ్వరరావు (అరకువ్యాలీ): అధ్యక్షా, అడుగుతున్నాను. గిరిజనులకు ఈవిధమైన సమస్యలున్నప్పటికీ, ప్రభుత్వాలు ముందుకు రావడంలేదు. గిరిజన ప్రాంతాల్లో డాక్టర్ల కొరత, ఏఎన్ఎంలకు కొరత, ఆసుపత్రుల్లో సిబ్బందికి కొరత, వైద్య సదుపాయాలకు కొరత ఉన్నాయి. మనం అన్నిరకాలుగా సాంకేతికంగా ముందుకుపోతున్నప్పటికీ, గిరిజన ప్రాంతాల్లో బ్లడ్‌శాంపిల్స్ కూడా తీయలేని పరిస్థితి ఉంది. గిరిజన ప్రాంతాల్లో మొత్తం 4128 డాక్టర్లు పోస్టులుండగా, దానిలో సుమారు 300 ఖాళీలు ఉన్నాయి. అధ్యక్షా, 52 మంది డాక్టర్లు ఉండాల్సి ఉండగా, 27 మంది డాక్టర్ల పోస్టులు ఖాలీగా ఉన్నాయి.

ఎపిడమిక్ సీజన్‌లోనే **(బెల్)** డాక్టర్లను డిప్యుటేషన్‌పై నియమించి, ఆ సీజన్ పూర్తికాగానే వారిని వెనకకు పంపించివేస్తున్నారు. కాబట్టి, ప్రస్తుత ప్రభుత్వమైనా, ఈరకమైన తాత్కాలిక చర్యలకు బదులుగా, శాశ్వత చర్యలు ఏమైనా తీసుకోగలమా అనే దిశగా ఆలోచన చేయాలని కోరుతున్నాను. గిరిజన ప్రాంతాల్లో అమ్మానాన్నలకు చదువు లేకపోయినా, వాళ్ళ

పిల్లలు ఇప్పుడిప్పుడే బయటకు వచ్చి చదువుకుంటున్నారు. అలా చదువుకున్న ఒక గిరిజన విద్యార్థి, మొన్ననే ఇంజనీరింగ్ కంప్లీట్ చేసుకుని, అతని కుటుంబానికి అండగా నిలబడతాడు అనుకున్న సందర్భంలో..,

MR. SPEAKER: What do you want? You have to conclude.

శ్రీ కిడారి సర్వేశ్వరరావు (అరకువ్యాలీ)ః అధ్యక్షా, తేది.25.08.2014న ఆ విద్యార్థి చనిపోయాడు. ఆ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ఇచ్చే ఆలోచన ప్రభుత్వానికేమైనా ఉందా? (మైకు ఆపు చేయబడింది.)

(తమ గిరిజన సభ్యులకు మరొక్క నిముషం మాట్లాడే అవకాశం ఇవ్వవలసిందిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు తమ తమ స్థానాల్లోనుండే గౌరవ సభాపతిగారిని కోరసాగారు.)

MR. SPEAKER: We know the problems. Problems are there. We do not deny that. But, if you take so much of time for every question, then it is difficult.

(Interruptions)

You put your supplementary now.

(Interruptions)

Please resume your seat, (తమ స్థానమును వదిలి ముందుకు వచ్చి, తమ వెంట తెచ్చుకున్న సమాచారపు పత్రాలను గౌరవ సభాపతిగారికి చూపిస్తూ, ఇంకా చాలా విషయాలు చెప్పాలనీ, తనకు అవకాశం ఇవ్వాలనీ కోరుతున్న శ్రీ కిడారి సర్వేశ్వర రావు నుద్దేశిస్తూ) Please resume your seat. ఈశ్వరి గారు మాట్లాడిన తరువాత మళ్ళీ అవకాశం ఇస్తాను. Please listen. Do not interrupt. ఈశ్వరి గారు.

శ్రీమతి గిడ్డి ఈశ్వరి (పాడేరు)ః అధ్యక్షా, మా గిరిజనుల దురదృష్టమేమో గానీ, ఆరు ఋతువులు, మూడు కాలాలున్నట్లుగా, మా గిరిజనులకు మరో కాలం వచ్చి చేరింది. దాని పేరే 'ఎపిడమిక్ సీజన్'. మా గిరిజనులు చేసుకున్న పాపమో, లేక వారికి శాపమో గానీ, వర్షాకాలం వచ్చిదంటే చాలు, ఎక్కడా లేని రోగాలు వచ్చి, గిరిజనులు ఎక్కువ శాతం చనిపోయే పరిస్థితులు ఉన్నాయి. మా గిరిజన ప్రాంతాల్లో వైద్యం అనేది అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది. విశాఖ ఏజెన్సీలో 36 పి.హెచ్.సి.లు, 2 సి.హెచ్.సి.లు, 194 సబ్ సెంటర్లు ఉన్నప్పటికీ, వైద్య సిబ్బంది చాలినంతగా లేకపోవడం, శాశ్వత సిబ్బంది లేకపోగా, ఎపిడమిక్ సీజన్‌లో, అప్పటికి అవసరమైన సిబ్బందిని దిగువ ప్రాంతాలనుండి డిప్యుటేషన్‌లో తీసుకుని, సీజన్ ముగియగానే, వెనక్కి వారివారి పోస్టులకు పంపడం వంటివే మా గిరిజన ప్రాంతాలకు వైద్య సదుపాయాలు అందక పోవడానికి కారణాలు. మా గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా రక్తహీనత ఉంటుంది. గర్భిణీ స్త్రీలు,

ఆశ్రమ పాఠశాలల్లో చదువుకునే ఆడపిల్లలు రక్తహీనత, సిఫిలిస్ వంటి వాటితో బాధపడుతున్నారు. మా ప్రాంతాల్లో 13, 15 సంవత్సరాలకే పెళ్ళిళ్ళు చేసుకుని, 30 సంవత్సరాలకే ముసలివాళ్ళలా అవుతున్నారంటే, ఆ పరిస్థితులకి, ఈ సమస్యలే కారణం. ఆశ్రమ పాఠశాలల్లో మెడికల్ చెక్‌అప్స్ పెడుతున్నప్పటికీ, ఇంతకు ముందు హెల్త్‌వర్కర్స్ అక్కడే ఉండేవారు. ప్రస్తుతానికి వారిని తీసివేయడం జరిగింది. మళ్ళీ హెల్త్‌వర్కర్స్‌ను ఆశ్రమ పాఠశాలల్లో కొనసాగిస్తారా? లేదా కనీసం ఔట్‌సోర్సింగ్ పద్ధతిలోనైనా కొనసాగిస్తారా? అని గౌరవ మంత్రివర్యులను కోరుతున్నాను.

...

'ఆశ' వర్కర్లకు ఇప్పటివరకు జీతభత్యాలు లేవు. ఏజెన్సీ ప్రాంతాలలో వారికి గౌరవ వేతనం ఇస్తున్నారు. వారి పరిస్థితి ఇప్పుడు కూడా అగమ్యగోచరంగా ఉంది. వారికి జీతభత్యాలను పెంచాల్సిందిగా కోరుతున్నాను. ఏజెన్సీ ప్రాంతాలలో వైద్యసౌకర్యాలను, మౌలిక సదుపాయాలను కల్పించాలని, డాక్టర్ల కొరతను, మందుల కొరతను తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. పీహెచ్‌సీలకు వచ్చే మందులు అక్రమ మార్గాలలో బయట మెడికల్ షాపులకు వెళుతున్నాయి. ఉదాహరణకు పీహెచ్‌సీలో మందులను బయటికి పంపించి, అదే మందులను డాక్టర్ రాయడంతో రోగులు డబ్బులు లేకపోయినా గతిలేని పరిస్థితులో ఆ మందులనే బయటి మెడికల్ షాప్స్‌లలో కొనుక్కోవడం జరుగుతుంది. ప్రభుత్వం దీనిపై తగిన చర్యలు తీసుకోవలసిందిగా కోరుతున్నాను.

శ్రీమతి మీసాల గీత (విజయనగరం)ః అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పినట్లుగా గత 10 సంవత్సరాలలో పాలకులు గిరిజన ప్రాంతాలను నిర్లక్ష్యం చేశారు. కనుక గిరిజనులు అనేక రకాల వ్యాధులతో బాధపడుతున్నారు. మా ప్రభుత్వం గిరిజనులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుంది. గిరిజనులు అనుభవిస్తున్న నరకాన్ని తప్పించడానికి, వారికి మంచి వైద్య, ఆరోగ్య సదుపాయాలు కల్పించాలని, గతంలో శ్రీ నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రస్తుతం కూడా రోడ్లు, మురుగు కాలువలు నిర్మించి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అభివృద్ధి చేయాలని, పీహెచ్‌సీ, సీహెచ్‌సీలలో వైద్యుల కొరతను తగ్గించాలని, గిరిజనులను ఇబ్బందుల నుంచి త్వరగా విముక్తి చేయాలని మంత్రివర్యులను కోరుతున్నాను.

శ్రీ కె.సర్వేశ్వరరావు (అరకువ్యాలీ)ః అధ్యక్షా, గిరిజన ప్రాంతాలలో సూపర్ స్పెషాలిటీ వైద్యశాలను ఏర్పాటు చేసే ఆలోచన ప్రభుత్వానికి ఉందా? ఉంటే ఎప్పటిలోగా ఏర్పాటు చేయగలరు? విశాఖ గిరిజన ప్రాంతానికి సంబంధించి అరకు, పాడేరు ఏరియా ఆసుపత్రులను 30 పడకల నుంచి 100 పడకల వైద్యశాలగా అప్‌గ్రేడ్ చేశారు. కాని అది అమలులోకి రాలేదు. జాప్యం ఎందుకు జరుగుతుంది? ఆ వైద్యశాలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తారా? గిరిజన ప్రాంతాలలో ఉన్న వైద్యశాలలో గైనిక్, ఈఎన్‌టీ, గుండె, న్యూరో స్పెషలిస్టులను ఏర్పాటు చేసే ఆలోచన ఉందా? ఎంబీబీఎస్ డాక్టర్లనే కొనసాగిస్తారా?

MR.SPEAKER: Ask one question only. Not many pertaining to the question.

శ్రీ కె.సర్వేశ్వర రావు (అరకువ్యాలీ)ః అధ్యక్షా, ప్రశ్నలు మాత్రమే అడుతుగుతున్నాను. గిరిజన ప్రాంతాలలో డెంగీ, టైఫాయిడ్, మలేరియా వ్యాధులకు తాత్కాలిక చర్యలతో కొనసాగిస్తున్నారు. దీనికి గాను శాశ్వత నివారణ చర్యలు ఏమైనా తీసుకుంటున్నారా? గిరిజన ప్రాంతాలలో టీబీ, గొంతు వ్యాధి ఎక్కువ. ప్రభుత్వం దగ్గర ఆ వివరాలు ఏమైనా ఉన్నాయా? ఆయుష్ వైద్య విధానం గిరిజన ప్రాంతాలలో అభివృద్ధి చేసే ఆలోచన ఏమైనా ఉందా?

MR.SPEAKER: Please be seated.

శ్రీ కె.సర్వేశ్వర్ రావు (అరకువ్యాలీ)ః అధ్యక్షా, గౌరవసభ్యులు మాట్లాడుతూ 2,300 మంది 'ఆశ' వర్కర్లు పనిచేస్తున్నారన్నారు.

(మైకు ఆపు చేయబడింది)

MR.SPEAKER: Don't repeat it. Please be seated. Raise the supplementary, Minister garu please.

డా.కామినేని శ్రీనివాస్ (కైకలూరు)ః అధ్యక్షా, ఈ ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి, వైద్య, ఆరోగ్య సేవలు అందించడంలో మొదటి ప్రాధాన్యత ఇస్తుంది.

(వైఎస్సార్ కాంగ్రెస్ సభ్యులు శ్రీ కె.సర్వేశ్వరరావు గారు మాట్లాడడానికి మైక్ ఇవ్వాలని సభాపతిని కోరసాగారు)

MR.SPEAKER: Be seated please.

డా.కామినేని శ్రీనివాస్ (కైకలూరు)ః అధ్యక్షా, వర్షాకాలానికి ముందే పంచాయితీరాజ్, వైద్యశాఖ అధికారులతో వీడియో సంభాషణ పెట్టి అక్కడ తీసుకోవల్సిన చర్యలను వివరించాను. (వైఎస్సార్ కాంగ్రెస్ సభ్యుల నుంచి సభకు అంతరాయం) గిరిజన ప్రాంతాలున్న జిల్లాలకు నేను పర్సనల్‌గా వెళ్ళి సమీక్షించాను. (అంతరాయం కొనసాగింపు) 284 డాక్టర్ల పోస్టులకు గాను 98 ఖాళీలు, 278 నర్సుల పోస్టులకు 34 ఖాళీలు, పారామెడికల్ 2,373కు గాను 704 ఖాళీలున్నాయి. అంటు వ్యాధులు ప్రబలే కాలం కనుక 'వాక్ ఇన్ ఇంటర్వ్యూ' చేసి కొన్ని పోస్టులను భర్తీ చేశాం. రాబోయే రోజుల్లో ప్రాధాన్యత ఇచ్చి డాక్టర్ల పోస్టులను భర్తీ చేస్తాం. అంటువ్యాధులు ప్రబలకుండా కొన్ని చర్యలు తీసుకున్నాం. ఒక రౌండ్ స్ప్రేయింగ్ అయ్యింది. రెండవ రౌండ్ కొనసాగుతుంది. శ్రీకాకుళంలో 4, విజయనగరంలో 5, విశాఖపట్నంలో 3,

తూర్పు గోదావరిలో 3, పశ్చిమ గోదావరిలో 1, కర్నూలులో 5, మొత్తం 21 ఎంసీహెచ్ ఎపిడమిక్ టీమ్‌లను ఏర్పాటు చేశాం. ఇందులో ఒక మెడికల్ ఆఫీసర్, ఒక స్టాఫ్‌నర్స్ ప్రభుత్వ వాహనంలో వెళ్ళి చూస్తుంటారు. We have established 5 Special New Born Units (SNBU). మందులు, వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉండేటట్లు చూస్తాం. We have conducted 26 Multi Speciality Camps through Arogyasri. గిరిజన ప్రాంతాల నుంచి ప్రసవానికి ముందు వైద్యశాలకు వచ్చి ఉండడానికి వీలుగా పీహెచ్‌సీలలో కొత్తగా బర్త్ వెయిటింగ్ రూముల సౌకర్యం కల్పిస్తున్నాం. మా ప్రభుత్వం గిరిజనులకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంది.

ప్రశ్న నెం.162(94)

సర్వశ్రీ/శ్రీమతి కాకాని గోవర్ధనరెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, పీడిక రాజన్నదొర, ఉప్పులేటి కల్పన, గడికోట శ్రీకాంత్ రెడ్డి – ఎమ్మెల్యేలు.

గౌరవనీయులైన ఉప ముఖ్యమంత్రి (రెవెన్యూ) గారు దయచేసి ఈ క్రింది సమాచార తెలియజేస్తారా.

అ) అసైన్డ్ భూములు, బంజరు భూములు, గ్రామకంఠం భూములలో శాశ్వత గృహాలను నిర్మించుకొన్నట్టి పేద ప్రజలకు ఇళ్ళ పట్టాలను మంజూరు చేసిన విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, వాటి వివరాలు, ఇళ్ళ పట్టాలను జారీ చేయని ప్రజల సంఖ్య మరియు ఎప్పటి లోగా వారికి మంజూరు చేయడమవుతుంది?

ఉప ముఖ్యమంత్రి (రెవెన్యూ) (శ్రీ కె.ఈ.కృష్ణమూర్తి)ః

అ) కృష్ణా జిల్లాలో 13 పట్టాలను గ్రామకంఠం భూముల నుంచి, విశాఖపట్నంలో 26 పట్టాలను బంజారు భూముల నుంచి జారీ చేయడం జరిగింది. అసైన్డ్ భూముల నుంచి ఇళ్ల పట్టాలను ఇవ్వడానికి అవకాశం లేదు.

ఆ) పట్టాల మంజూరు కొరకు ఇప్పటివరకు ఎటువంటి దరఖాస్తులు పెండింగులో లేవు.

శ్రీ కాకాని గోవర్ధనరెడ్డి (సర్వేపల్లి)ః అధ్యక్షా, మంత్రి గారు సమాధానమిస్తూ, అసైన్డ్, బంజరు, గ్రామకంఠం భూములలో శాశ్వత గృహాలను నిర్మించుకొన్నట్టి పేద ప్రజలకు ఇళ్ళ పట్టాలను మంజూరు చేసిన విషయం వాస్తవమా అంటే కృష్ణా జిల్లాలో 13 పట్టాలు, విశాఖపట్నం జిల్లాలో 26 పట్టాలు జారీచేశామన్నారు.

అయితే, వాటి వివరాలు, ఇళ్ళ పట్టాలను జారీ చేయమని ప్రజల నుంచి ప్రభుత్వం దగ్గర ఉన్న అర్జీలు ఎప్పటిలోగా మంజూరు చేయబడుతుంది అంటే పట్టాల మంజూరు కొరకు ఎటువంటి దరఖాస్తులు పెండింగులో లేవని మంత్రి గారు చెప్పారు. మండల స్థాయిలో గ్రీవెన్స్ సెల్‌కు వెళితే వేల మంది వచ్చి ప్రభుత్వ భూములలో, గ్రామకంఠం భూములలో ఇళ్ళను ఏర్పాటు చేసుకున్నాం, కరెంట్ కనెక్షన్లు తీసుకున్నాం, ఇంటి పన్ను కడుతున్నాం, దానికి గాను మాకు పట్టాలు ఇస్తారా అని గత 25 సంవత్సరాల నుంచి తిరుగుతున్న వారు కనిపిస్తారు.

...

శాసనసభ్యులుగా మేము నియోజకవర్గాలలో తిరుగుతున్నప్పుడు అలాంటి ఇళ్లను రెగ్యులరైజ్ చేయాలని, వాటికి సంబంధించిన పట్టాలను మంజూరు చెయ్యాలని పేద ప్రజలు అర్జీలు మాకిస్తున్నారు. అలాంటి అర్జీలు శాసన సభ్యులుగా వేలకు వేలు మా దగ్గరకొస్తుంటే ప్రభుత్వ స్థాయిలో అవి లక్షలుగా వుంటాయి. అయితే ప్రభుత్వం వద్ద అలాంటి అర్జీలు పెండింగులో లేవంటే మండల స్థాయిలోని తాసీల్దారులు ఆ అర్జీలను పక్కన పారేశారా? లేక ప్రభుత్వానికి నివేదించలేదా? దేనివల్ల ప్రభుత్వం వద్ద అసలు పెండింగులో లేవన్న విషయం వచ్చింది? దీనికి సంబంధించి ప్రధాన సమస్య ఏమిటంటే స్థానిక నాయకులు కాని ప్రభుత్వ అధికారులు కాని గ్రామకంఠం, ప్రభుత్వ భూముల్లో పది ఇళ్లు కట్టివుంటే వాటిని పిక్ అండ్ చూస్ పద్ధతిలో రెండింటిని తొలగిస్తున్నారు. రెండింటిని వుంచుతున్నారు. అందుకే దరఖాస్తులు పెండింగులో లేవన్న సమాచారమిచ్చి బహుశా అధికారులు ప్రభుత్వాన్ని తప్పదోవ పట్టించివుండవచ్చునని నేను భావిస్తున్నాను. దరఖాస్తులు పెండింగులో లేవన్న విషయం వాస్తవం కాదు కాబట్టి ప్రభుత్వం ఇప్పటికైనా వీటి గురించి పారదర్శకంగా ఒక ఆలోచన చేసి శాశ్వత పరిష్కారం కనుగొనాల్సిన అవసరముంది. నియోజకవర్గస్థాయిలోనే అలాంటి అర్జీలు వేల సంఖ్యలో వుంటాయి కాబట్టి రాష్ట్ర స్థాయిలో అవి లక్షల సంఖ్యలో వుండవచ్చు. అందువల్ల ప్రభుత్వం ఇప్పటికైనా వాటిని పరిశీలించి ఎటువంటి చర్యలు తీసుకుంటారు? ఎవరైతే గ్రామకంఠాల్లో, ప్రభుత్వ బంజరు భూముల్లో ఇళ్లు కట్టుకొని విద్యుత్ ఛార్జీలు, ఇంటి పన్ను కడుతున్నారో, ఎవరైతే వాటిని రెగ్యులరైజ్ చెయ్యాలని చాలా కాలం నుంచి కోరుతున్నారో, వేటినైతే రెగ్యులరైజ్ చెయ్యడానికి ప్రభుత్వానికి ఇబ్బంది లేకుండా వుంటుందో అలాంటి వాటిని రెగ్యులరైజ్ చేసే ఆలోచన ఏమైనా వుందా? ఉంటే ఎప్పటిలోగా దానికి సంబంధించిన విధివిధానాలను రూపొందించి రెగ్యులరైజ్ చేస్తారో చెప్పాలని గౌరవ ఉప ముఖ్యమంత్రి గారిని మీ ద్వారా కోరుతున్నాను.

శ్రీమతి ఉప్పులేటి కల్పన (పామర్రు)ః అధ్యక్షా నమస్కారం. ఇందాక గౌరవ సభ్యులు గోవర్ధన్ రెడ్డి గారు చెప్పినట్లు అలాంటి దరఖాస్తులు వందల సంఖ్యలో పెండింగులో వున్నట్లు మా దృష్టికి వచ్చింది. అనేక మంది గ్రామకంఠాల్లో, ప్రభుత్వ బంజరు భూముల్లో ఇళ్లు కట్టుకొని గత 30 సంవత్సరాల నుంచి పట్టాల కోసం ఎదురు చూస్తున్న పరిస్థితి మా దృష్టికి వచ్చింది. దాని గురించి ఉప ముఖ్యమంత్రిగారికి అధికారులు సరియైన ఇన్‌ఫర్మేషన్ ఇవ్వలేదేమో

అనుకుంటున్నాము. ఇలాంటి పరిస్థితుల్లో క్రిష్ణా జిల్లాలో 13 చోట్ల పట్టాలు జారీ చేయడం జరిగిందని ఉప ముఖ్యమంత్రిగారు చెప్పడం జరిగింది. అవి ఏయే మండలాలలో, గ్రామాలలో జారీ అయ్యాయో తెలియజెయ్యాలని వారిని కోరుతున్నాను. 30 సంవత్సరాలుగా ఆ ఇళ్లల్లో వున్న పేదలు వాటికి సంబంధించిన పట్టాలు తమకు అందక చాలా ఇబ్బందులుపడుతున్నారు. ఎందుకంటే అవి ప్రభుత్వానికి చెందిన గ్రామ కంఠాలు, బంజరు భూములు అయి వున్నందున పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చెయ్యడంలో ప్రభుత్వానికి ఇబ్బంది ఏమిటో మాకైతే అర్థం కావడం లేదు. కాబట్టి నేను ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి గారిని కోరేదేమంటే పెండింగులో వున్న అలాంటి దరఖాస్తులపై అధికారులతో సమీక్ష చేసి అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేసేవిధంగా అధికారులకు ఆదేశాలు జారీ చెయ్యాల్సిన అవసరముందని మనవి చేస్తున్నాను.

శ్రీ చింతల రామచంద్రా రెడ్డి (పీలేరు)ః అధ్యక్షా, మా చిత్తూరు జిల్లాలోని పీలేరు నియోజకవర్గంలో బలహీన వర్గాల ప్రజలు తమ ఇళ్ల పట్టాల కోసం పెట్టుకున్న అనేక దరఖాస్తులు పెండింగులో వున్నాయి. ముఖ్యంగా మా పీలేరు పట్టణం నియోజకవర్గం యొక్క హెడ్‌క్వార్టర్. కాబట్టి అక్కడ భూముల ధరలు చాలా ఎక్కువగా వున్నాయి. అందువల్ల నియోజకవర్గంలోని ఎనిమిది కిలో మీటర్ల పరిధిలోని వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు యథేచ్ఛగా అన్యాక్రాంతమయ్యాయి. దానిపై మేము ప్రభుత్వానికి, లోకాయుక్తకు కంప్లెయింట్ చేయడం జరిగింది. ముఖ్యంగా ఒక పక్క ఎస్సీ, ఎస్టీ, బలహీనవర్గాలు, బీసీలు, మైనారిటీలు మొదలైన వారి ఇళ్ల పట్టాల మంజూరుకు సంబంధించిన దరఖాస్తులు పెండింగులో వుంటే మరో పక్క భూఆక్రమణదారులు ప్రభుత్వ భూములను పట్టపగలే జేసీబీలతో చదును చేసి ఆక్రమించుకోవడమే కాకుండా దొంగ స్టాంపులతో రిటైరైన, చనిపోయిన వారి భూములను కూడా నకిలీ పత్రాలను సృష్టించడం ద్వారా ఆక్రమించుకొని వాటిని అమ్ముకోవడం జరుగుతున్నది. ఈ రోజు పీలేరు పట్టణ పరిధిలో ప్రభుత్వానికి సంబంధించిన కార్యాలయాలు కట్టాలన్నా, ఎక్కడా సెంటు భూమి కూడా లేని పరిస్థితి వుంది. ఈ విషయాన్ని సబ్ కలెక్టర్‌కు, జిల్లా కలెక్టర్‌కు, రెవిన్యూ యంత్రాంగానికి అనేకసార్లు తెలియజేయడం జరిగినా ఏమాత్రం స్పందన లేదు. అందువలన దయచేసి మేము మీ ద్వారా గౌరవ మంత్రి గారిని అడిగేదేమంటే 1989కి ముందు అప్పటి శాసనసభ్యులు దాదాపు ఐదు వేల మందికి ఇళ్ల పట్టాలివ్వడం జరిగింది. కిరణ్ కుమార్ రెడ్డి గారు గతంలో ప్రాతినిధ్యం వహించారు. ఆయన హయాములో ల్యాండ్ గ్రాబర్స్ ఆయన అనుచరులు, ఆయన మనుషులు ఆయన పేరు చెప్పి విచ్చలవిడిగా ప్రభుత్వభూములను ఆక్రమించుకున్నారు. అందువల్ల అక్కడ ఒక్క సెంటు జాగా కూడా లేకుండా పోయింది. కాబట్టి నేను కోరేదేమంటే ఏవైతే ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారో భూ ఆక్రమణదారుల నుంచి వాటిని తక్షణమే ఖాళీ చేయించి ఆ భూములను బలహీన వర్గాల ప్రజలకు ఇళ్ల పట్టాలుగా మంజూరు చెయ్యాలని నేను విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ పీడిక రాజన్న దొర (సాలూరు)ః అధ్యక్షా, గౌరవ మంత్రి గారు ఇళ్ల పట్టాలకు సంబంధించిన దరఖాస్తులు పెండింగులో లేవన్నారు. నిన్ననే మా జిల్లా కలెక్టర్‌గారు నా నియోజకవర్గ హెడ్‌క్వార్టర్‌లో జిల్లా అధికారులందరితో కలిసి గ్రీవెన్స్ డే నిర్వహించిన సందర్భంగా వందలాదిగా ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అందుకే మీ ద్వారా నేను మనవి చేసుకునేదేమంటే ఇందాక మా గౌరవ సభ్యులు చెప్పినట్లు ఇప్పటికే అసైన్డ్ భూములు, ప్రభుత్వ బంజరు భూములలో చాలా మంది నిరుపేదలైన బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఇప్పటికే ఇళ్లు కట్టుకొని వున్నారు. వారికి పట్టాలివ్వకపోతే వారేమౌతారో ఒకసారి ఆలోచించాలి. అదేవిధంగా విజయనగరం జిల్లా సాలూరు నియోజకవర్గంలో నాయుడు చెరువు అని ఒకటుంది. సుప్రీమ్ కోర్టు ఆదేశాల ప్రకారం చెరువు కాబట్టి ఇవ్వకూడదని వుంది. అయితే దానిని పేదలందరూ ఆక్రమించుకొని ఇళ్లు కట్టుకున్నారు. ఇప్పుడు వాళ్లను ఎట్లా తొలగిస్తారు, ఆ చెరువును ఎట్లా కాపాడతారో చెప్పాలని నేను తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ కె.ఈ.కృష్ణ మూర్తి (పత్తికొండ)ః అధ్యక్షా, 2012లో అప్పటి రెవిన్యూ మంత్రి గారు దాదాపు 60 రోజుల పాటు రెవిన్యూ సదస్సులు నిర్వహించారు. ఆ తరువాత మళ్లీ ఒక 30 రోజులు రెవిన్యూ సదస్సులు పెట్టారు. ఆ సదస్సులలో చాలా మంది ఇళ్ల పట్టాలు కావాలని కోరడం జరిగింది. అది వాస్తవమే. అందువల్ల 1957 నుంచి ఇప్పటివరకు జారీ చేసిన ఇళ్లపట్టాల వివరాలున్నాయి. వాటిని టేబుల్ పైన పెట్టడానికి అనుమతించాలని కోరుతున్నాను. అదేవిధంగా గౌరవ సభ్యులు కొంతమంది గత ప్రభుత్వంలో అక్రమ ఆక్రమణలు జరిగాయని చెప్పారు. చిత్తూరు జిల్లాలోని పీలేరులో జరిగిన అక్రమ నిర్మాణాల గురించి, భూ ఆక్రమణల గురించి గౌరవ సభ్యులు రామచంద్రా రెడ్డి గారు చెప్పారు. వారు చెప్పిన విధంగా అక్రమ నిర్మాణాలకు, భూ ఆక్రమణలకు సంబంధించిన వివరాలను సేకరించి వాటిపై తగిన చర్యలు తీసుకుంటాము. బాధ్యులైన వారిపై కూడా తగిన చర్యలు తీసుకుంటాము. ఇదే కాకుండా దరఖాస్తులు చాలా పెండింగులో వున్నా పెండింగులో లేవని అధికారులు తప్పుడు సమాచారమిచ్చారని సభ్యులు చెప్పారు. నేను త్వరలోనే, అంటే వచ్చే నెలలో రెవిన్యూ సదస్సులు పెట్టి ఏవైతే పెండింగులో వున్నాయో వాటిని పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటామని మనవి చేస్తున్నాను.

ప్రశ్న నెం.95(4 సి)
శ్రీ జి.వి.ఆంజనేయులు, ఎమ్మెల్యే

గౌరవనీయులైన దేవాదాయశాఖ మంత్రి గారు దయచేసి ఈక్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) గుంటూరు జిల్లాలోని కోటప్పకొండ దేవాలయంలో ఆదాయం క్షీణించిందన్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా?

ఆ) అయితే, దానికి గల కారణాలు ఏమిటి?

ఇ) కోటప్పకొండ దేవాలయం లోపల, దాని చుట్టుప్రక్కల ప్రాంతంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా

ఈ) దానిని నివారించడానికి, ఆదాయాన్ని పెంచడానికి ప్రభుత్వం తీసుకొనబోయే చర్యలు ఏమిటి?

దేవాదాయ శాఖ మంత్రి (శ్రీ పైడికొండల మాణిక్యాల రావు):

అ) లేదండి

ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు

లేదండి. గౌరవ స్పీకర్‌గారైన మీతో కలిసి అధికారులతో సమీక్ష చేసి సంప్రదింపులు జరిపిన అనంతరం తగిన చర్యలు తీసుకునే విధంగా నిర్ణయించడం జరిగింది.

ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు. అయితే టూరిజం, అటవీ, దేవాదాయ శాఖ అధికారులతో, మీతో కలిసి సమీక్షించి కోటప్పకొండను టెంపుల్ టూరిజం పర్యాటక కేంద్రంగా కూడా అభివృది చెయ్యాలనే నిర్ణయం తీసుకోవడం జరిగింది. ...

శ్రీ జి.వి.ఆంజనేయులు(ఉంగుటూరు): అధ్యక్షా, నరసరావుపేట సమీపంలోని కోటప్పకొండ దేవాలయం 1999-2004 మధ్య చాలా బ్రహ్మాండంగా అభివృద్ధి చెందింది. అప్పుడు తమరు మంత్రిగా ఉన్నారు. ఆ రోజు దేవాలయం మూడు పువ్వులు, ఆరు కాయలుగా బాగా అభివృద్ధి చెందింది. భక్తులు కూడా వేలాదిగా పెరిగారు. ఆ విధంగానే దేవాలయ ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. ఈ మధ్య బాధాకరమేమంటే అక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. అక్కడ భక్తుల బస కోసం ఏర్పాటుచేసిన సత్రాలు, రూములలో ఈ మధ్య మద్యం సీసాలు కనబడుతున్నందున ఆలయానికి వచ్చే భక్తులకు చాలా మనోవేదన కలిగిస్తుంది. అలాంటి అసాంఘిక కార్యకలాపాలు ఇక ముందు జరగకుండా తగిన కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రిగారిని కోరుతున్నాను. అదే విధంగా భక్తులకు ఒక్కొక్కసారి తాగునీరు కూడా అందని సందర్భాలున్నాయి. అక్కడ తాగునీరు కొరత రాకుండా, భక్తులకు తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలి. దెబ్బతిన్న పార్కులను

పునరుద్ధరించాలి. ఈ మధ్య ఆ దేవాలయ వైభవం కొంత తగ్గింది కాబట్టి తిరిగి పూర్వ వైభవం తీసుకొచ్చి దేవాలయ ఆదాయం పెరిగే విధంగా చూసి, భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా భక్తులకు మంచి సౌకర్యాలు కల్పించాలని మంత్రిగారిని మీ ద్వారా కోరుతున్నాను.

డా. గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి (నరసరావుపేట)ః అధ్యక్షా, కోటి వేల్పుల అండ కోటప్పకొండ దేవాలయం. దేవాలయ ఆదాయం 2009-10లో దాదాపు రూ.2.40కోట్ల రూపాయల నుంచి 2013-14కు రూ.4.34కోట్లకు ఆదాయం పెరిగింది. అట్లాగే భక్తులకు పూర్తి సౌకర్యాలు లేకపోవడంవలన భక్తులు ఇప్పుడు చాలా ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా కోటప్పకొండకు వెళ్లడానికి కింది నుంచి బస్సు సౌకర్యం ఇంతవరకు లేదు కాబట్టి తక్షణమే బస్సు సౌకర్యం ఏర్పాటుచేయవలసిందిగా కోరుతున్నాను. అట్లాగే రోప్‌వే కూడా నిర్మించి మంచి పర్యాటక కేంద్రంగా కోటప్పకొండను అభివృద్ధి చేయవలసిందిగా మంత్రిగారిని కోరుతున్నాను. అలాగే రెండో ఘాట్ రోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలి. కొండపైకి నడక ద్వారా వెళ్లే భక్తులు ఎండా కాలంలో, వానాకాలంలో చాలా ఇబ్బందులు పడుతున్నందున నడక దారిలో షైకప్పు ఏర్పాటుచేయవలసిందిగా కోరుతున్నాను. అక్కడ కోతుల బెడద చాలా తీవ్రంగా ఉండడంతో భక్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. దానిమీద తక్షణమే చర్యలు తీసుకొని కోతులను పట్టి నాలుగైదు వందల కిలోమీటర్ల దూరంలో వదలిపెట్టాలి. దగ్గరలో వదలిపెడితే అవి మరలా కొండకు వస్తాయి. భక్తులకు మంచి సౌకర్యాలు కల్పించి కోటప్పకొండ పేరుప్రతిష్టలు తిరిగి పెంపొందించాల్సిందిగా మీ ద్వారా కోరుతున్నాను.

శ్రీ పోలంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి (కోవూరు)ః అధ్యక్షా, ధన్యవాదాలు. కోటప్పకొండ దేవాలయం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో లక్షలాది మంది భక్తులకు తెలియడానికి కారణం గౌరవ సభాపతిగా ఉన్న మీరు గతంలో శాసనసభ్యుడిగా, మంత్రిగా ఉన్నప్పుడు ఆ దేవాలయం పట్ల ఎంతో శ్రద్ధ తీసుకొని అభివృద్ధి చేశారు. అందుకు మీకు ప్రత్యేకమైన ధన్యవాదాలు. 1988లో మొట్టమొదటిసారిగా నేను కోటప్పకొండకు వెళ్లినపుడు అక్కడ చిన్న గుడి మాత్రమే ఉంది. కోటప్పకొండకు వెళ్లి దర్శనం చేసుకోవాలంటే మహిళలు, పిల్లలు, వృద్ధులు మెట్లు ఎక్కి వెళ్లలేని పరిస్థితి ఉంది. మీరు ప్రత్యేక దృష్టి పెట్టి కొండను తొలచి రోడ్డు మార్గం ఏర్పాటుచేసినందుకు ధన్యవాదాలు. మహాశివరాత్రి పర్వదినం రోజున వేలాది మంది భక్తులు దర్శనానికి వస్తున్నా అక్కడ సరైన కాటేజీ సౌకర్యం లేదు. తిరుమల తిరుపతి దేవస్థానం కొన్ని కాటేజీలు నిర్మించినా, మహాశివరాత్రి పర్వదినం రోజున పోలీసు అధికారులు ఆ కాటేజీలు తీసుకుంటున్నందున సామాన్య భక్తులకు వసతి దొరకడంలేదని మీ ద్వారా గౌరవ మంత్రిగారి దృష్టికి తీసుకొస్తున్నాను. కేంద్ర ప్రభుత్వం వద్ద కోట్లాది రూపాయలు నిధులు పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ఉన్నందున కేంద్ర ప్రభుత్వం నుంచి ఆ నిధులు పొంది పర్యాటక కేంద్రంగా కోటప్పకొండను మరింత చక్కగా తీర్చిదిద్దడానికి తప్పకుండా కృషి చేయాల్సిన అవసరముంది. కాటేజీల నిర్మాణానికి దాతలు చాలా మంది ముందుకు వస్తారు కాబట్టి వారి సహాయంతో కాటేజీలు నిర్మించాలి.

అంచెలంచెలుగా ఇప్పటికే దేవాలయాన్ని బ్రహ్మాండంగా అభివృద్ధి చేశారు. గత దశాబ్ద కాలంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైనది కాబట్టి మరలా ఈ దేవస్థానానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు తప్పకుండా గౌరవమంత్రి గారు కృషి చేయాలని మీ ద్వారా కోరుతున్నాను.

శ్రీ పైడికొండల మాణిక్యాలరావు (తాడేపల్లిగూడెం)ః అధ్యక్షా, కోటప్పకొండలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఇప్పటికే సమీక్ష జరిపి పోలీసు శాఖకు బాధ్యతలు అప్పగించడం జరిగింది. దాని మీద ప్రత్యేక దృష్టి పెట్టమని చెప్పాం. కొండపైన భక్తులకు తాగునీరు సౌకర్యం కల్పించడం గురించి సభ్యులు సూచించిన విషయంలో సమీక్షించి ఇప్పటికే మాస్టర్ ప్లాన్‌ను రూపొందించి పర్యాటక కేంద్రంగా బాగా అభివృద్ధి చేయడంకోసం దేవాదాయశాఖ నిమగ్నమై ఉంది. కోతుల బెడద గురించి మొన్ననే అటవీ శాఖాధికారులతో మాట్లాడినపుడు కొండముచ్చులను తెచ్చినచో కోతుల బెడద నివారించవచ్చునని వారు సూచించారు. కొండముచ్చులను కోటప్పకొండకు తెచ్చేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత అక్షరాభ్యాసం విరివిగా నిర్వహించే బాసర సరస్వతీదేవి ఆలయం తెలంగాణలో ఉన్నది. జ్ఞాన దక్షిణామూర్తి దేవాలయం కోటప్పకొండలో ఉన్నందున అక్కడ అక్షరాభ్యాస కార్యక్రమాలు పెద్దయెత్తున చేపట్టవచ్చునని పెద్దలు సూచించారు. ఆ విషయంలో కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకొని అక్షరాభ్యాస కార్యక్రమాలు కోటప్పకొండలో చేపట్టాలని నిర్ణయించడం కూడా జరిగింది.

త్రికోటాద్రి పేరుతో కోటప్పకొండకు ప్రత్యేక గుర్తింపు ఉన్నందున కోటప్పకొండ గిరిప్రదర్శన చేపట్టడం ద్వారా కోటప్పకొండకు మరింత గుర్తింపు రావడంతోబాటు ప్రాధాన్యత సంతరించుకొనేందుకు కూడా నిర్ణయించడం జరిగింది. అలాగే కేంద్ర ప్రభుత్వం నుంచి పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా టెంపుల్‌కు టూరిజం కింద కొంత నిధులు వచ్చే అవకాశం ఉన్నది కాబట్టి ఆ విషయంలో కూడా తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న నెం.125 (96)

సర్వశ్రీ/శ్రీమతి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఉప్పలేటి కల్పన, కోన రఘుపతి, కిడారి సర్వేశ్వరరావు, ఎమ్మెల్యేలు.

గౌరవనీయులైన మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి గారు దయచేసి ఈ కింది సమాచారం తెలియజేస్తారాఃం-

అ) కె.జి. నుంచి పి.జి. వరకు ఉచిత విద్యను అందించేందుకు ప్రభుత్వం వద్ద ఏదేని ప్రతిపాదనలు ఉన్నాయా;

ఆ) అయితే, దీని కోసం ప్రభుత్వం ఏవేని చర్యలను తీసుకుందా అందుకు సంబంధించిన వివరాలు ఏమిటి?

మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి (శ్రీ గంటా శ్రీనివాసరావు)ఃః

అ మరియు ఆ) 2009 విద్యా హక్కు చట్టం అమలులో భాగంగా 2010 సంవత్సరం నుంచి సర్వ శిక్షా అభియాన్ కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 8వ తరగతి చదువుతున్న 6 నుంచి 14 సంవత్సరాల వయోవర్గంలోని పిల్లలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే ఉచిత, నిర్బంధ విద్యను సమకూరుస్తున్నది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 9వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు కూడా ఉచిత విద్యను సమకూరుస్తున్నది. ఇంకనూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థులకు ఎటువంటి బోధనారుసుమును వసూలు చేయడంలేదు మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నతవిద్య కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కూడా అమలుపరుస్తున్నది.

శ్రీ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి (చంద్రగిరి)ఃః అధ్యక్షా, తెలుగుదేశం పార్టీ ఎన్నికల సమయంలో విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోలో 7వ పేజీలో 7వ అంశం కింద కె.జి. నుంచి పి.జి. వరకు ఉచిత విద్య అందిస్తామని ప్రకటించారు. కె.జి. నుంచి పి.జి. వరకు ఉచిత విద్య పథకం పరిధిలోకి ఎంత మంది విద్యార్థులు వస్తారు? ఈ పథకం కింద మొత్తం ఖర్చు ఎంత అవుతుంది. అందుకోసం మీరు బడ్జెట్‌లో ఎంత మొత్తం కేటాయించారో చెప్పాలని కోరుతున్నాను. నాకు ఒక చిన్న అనుమానమేమంటే 1999 ఎన్నికల సమయంలో కూడా కె.జి. నుంచి పి.జి. వరకు మహిళలకు ఉచిత విద్య అందిస్తామని ప్రకటించారు. అది ఏమైనదో తెలియదు. ఈ పథకం కూడా అదే కోవలోకి వెళ్తుందా, లేక అమలుచేస్తారో మంత్రిగారు చెప్పాలి.

...

రెండవ విషయం ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజు రీఇంబర్స్‌మెంటు కింద రూ.32,500/- చెల్లిస్తుంటే అది సరిపోదు, పూర్తిగా ఫీజు రీఇంబర్స్‌మెంటు చెల్లించాలని గౌరవ ముఖ్యమంత్రివర్యులు గతంలో కెబిఆర్ పార్కు దగ్గర దీక్ష చేశారు. ఇప్పుడేమన్నా ఈ ప్రభుత్వం ఇంజనీరింగ్ విద్యార్థులకు ఫీజు రీఇంబర్స్‌మెంటు చెల్లిస్తుందా అనే విషయాన్ని గౌరవ మంత్రి గారు తెలియజేయాలి. మధ్యాహ్న భోజన పథకం చాలా అస్తవ్యస్తంగా తయారైంది. ఆ పథకాన్ని

ప్రభుత్వం ఏమన్నా ఇంప్రూవ్ చేస్తుందా అని అడుగుతున్నాను. ఆగష్టు 15వ తేదీన ప్రధాన మంత్రి గారు ఎంపీ ల్యాడ్స్ నిధులను బాలికల మరుగుదొడ్లకు ఉపయోగించవచ్చని ప్రకటన చేశారు. కాబట్టి ఆ రకంగా ప్రభుత్వం ప్రణాళికను తయారు చేసి ఎంపీ నిధుల ద్వారా బాలికలకు ఈ రాష్ట్రంలో మరుగుదొడ్లు నిర్మించే ప్రయత్నం చేస్తారా? విద్యార్థినీ, విద్యార్థులకు ఐప్యాడ్స్ ఇస్తారని మేనిఫెస్టోలో పెట్టారు. వారికి నిజంగా ఐప్యాడ్స్ ఇస్తారా లేదా నోప్యాడ్స్ అంటారా ప్రభుత్వం చెప్పాలి. చివరగా రైట్ టు ఎడ్యుకేషన్ యాక్టును కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చింది. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ లేదా ప్రైవేటు కాలేజీల్లో ఖచ్చితంగా ఉచితంగా విద్యను అందించాలి. రైట్ టు ఎడ్యుకేషన్ యాక్టు వచ్చిన తరువాత డొనేషన్ కట్టక్కర లేదు, బిల్డింగు ఫీజు కూడా ఉండదు కేవలం ట్యూషన్ ఫీజు మాత్రమే ఉంటుంది.

ఈ సభలో నామినేటెడ్ మంత్రి గారున్నారు. ఆయన చైనా కాలేజీలను పెట్టారు. అంటే చైతన్య, నారాయణ కాలేజీలను కలిపి చైనా కాలేజీల కింద పెట్టారు. Right to Education (RTE) Act ఈ కాలేజీలకు వర్తిస్తుందా, వర్తించదా? కనీసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిబంధనల ప్రకారం 25 శాతం ఉచిత విద్యనందించాలి. అదేమైనా చైనా కాలేజీల్లో ఇస్తారా, ఇవ్వరా ప్రభుత్వం తెలియజేయాలి. నాకు ఒక్క అనుమానం ఉంది. అవి చైనా కాలేజీలా లేక నాచా కాలేజీలా అని. అందుకేనేమో అధిక ప్రాధాన్యత చూపిస్తున్నారు. చైనా అంటే చైతన్య, నారాయణ కాలేజీలు. నాచా అంటే నారాయణ, చంద్రబాబు కాలేజీలు. అందుకనే ఎక్కువ ప్రేమ చూపించి ఈ కాలేజీలకు మినహాయింపు ఇచ్చారేమో. అక్కడ బిల్డింగులు సరిగా లేకపోయినా, ప్లే గ్రౌండ్స్ లేకపోయినా, సక్రమంగా టీచర్లు లేకపోయినా ఎడ్యుకేషన్ మాఫీగా తయారైనా ప్రభుత్వం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తోందా, లేదా దానికేమైనా స్పెషల్ స్టేటస్ ఇచ్చారా మంత్రి గారు చెప్పాలి.

శ్రీమతి ఉప్పులేటి కల్పన (పామర్రు)ః అధ్యక్షా, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య హామీ ఎంత వరకు వచ్చింది? అది ఎప్పటి నుంచి చేపడుతున్నారో మంత్రి గారిని అడుగుతున్నాను. 6 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల వరకు నిర్బంధ ఉచిత విద్య ఉంది. మొదటి తరగతి నుంచి పదవ తరగతి వరకు కేంద్ర ప్రభుత్వమే ఉచిత విద్యనందిస్తోంది. అయితే జూనియర్ కాలేజీల్లో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు కూడా ఎటువంటి బోధనా రుసుములు వసూలు చేయడం లేదని చెప్పారు. ఇది ప్రభుత్వ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకే కాకుండా ప్రైవేటు కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా వర్తిస్తుందా? ఇంజనీరింగ్, మెడిసిన్ చదివే విద్యార్థులకు కూడా ఇది వర్తిస్తుందా అని అడుగుతున్నాను. ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లు కూడా ఇంప్లిమెంట్ చేస్తున్నారా, ఫీజు రీఇంబర్స్‌మెంట్ పథకం ఎత్తేసి ఈ ఉచిత విద్యను అందిస్తారా, ఈ రెండింటినీ ఏ విధంగా సమన్వయం చేస్తారో మంత్రి గారు సమాధానం చెప్పాలని మీద్వారా కోరుతున్నాను.

శ్రీ గంటా శ్రీనివాసరావు (భీమిలి)ః అధ్యక్షా, గౌరవసభ్యులు శ్రీ భాస్కర్ రెడ్డి గారు, శ్రీమతి కల్పన గారు ప్రశ్నలు అడిగారు. అయితే గౌరవసభ్యులు శ్రీ భాస్కర్ రెడ్డి గారు ఇప్పుడున్న విద్యా వ్యవస్థ గురించి, నాణ్యమైన విద్యను గురించి రాజకీయంగా మాట్లాడాలని చూశారు. కేజీ నుంచి పీజీ వరకు పేద పిల్లలకు ఉచిత విద్య, కాలేజీ విద్యార్థులకు ఒక ఐపాడ్, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యా విధానంలో మార్పులు చేస్తామని మ్యానిఫేస్టోలో ఇచ్చాం. మా ప్రభుత్వం ఏర్పడి 85 రోజులు మాత్రమే అయ్యింది. మా ప్రభుత్వానికి ఒక విజన్, నిబద్ధత ఉంది. మ్యానిఫెస్టోలోనున్న ప్రతి లైన్‌ను తు.చ. తప్పకుండా అమలు చేస్తాం. గత ప్రభుత్వం 2008వ సంవత్సరంలో 31 కాలేజీలకు అనుమతినిచ్చింది. ఇప్పటి వరకు ఆ కాలేజీలకు భవనాలు లేని పరిస్థితి ఉంది. గత ప్రభుత్వంలో నెల్లూరు జిల్లాలో ఒక యూనివర్శిటిని ఒక క్లబ్‌లో ప్రారంభించాం. అటువంటి పరిస్థితులు రాకుండా ఒక పద్ధతి ప్రకారం చేయాలనే ఉద్దేశంతో ఈ విద్యా వ్యవస్థలో మార్పులు తేవాలని గతంలో ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత, సాంకేతిక శాఖలతో ఉన్న విద్యా శాఖను ఒకే గొడుగు క్రిందకు తీసుకొని వచ్చి దానికి 'మానవాభివృద్ధి శాఖ' అని పేరు పెట్టాం. గతంలో విద్యకు రూ.9,000 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. ఈ ప్రభుత్వంలో రూ.16,000 కోట్లు కేటాయించాం. (అధికారపక్ష సభ్యులు బల్లలు చరిచారు) ఈ ప్రభుత్వం విద్యకు ఎంత ప్రాధాన్యతనిస్తుందో బడ్జెట్ కేటాయింపులు చూస్తే అర్థమవుతుంది. ముఖ్యంగా ఈ రాష్ట్రాన్ని నాలెడ్జ్ హబ్‌గా చేయాలని, నాణ్యమైన విద్యను ఇవ్వాలని, నీతి, నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలని, ప్రతి పౌరుడూ భాద్యత గల పౌరునిగా ఉండాలని, సంస్కరణలు తీసుకురావాలని అనుకుంటున్నాం. అలాగే మధ్యాహ్న భోజనం, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వంద శాతం అమలుపరుస్తాం.

ప్రశ్న నెం.3 – సి(97)
శ్రీ వనమాడి వెంకటేశ్వరరావు, ఎం.ఎల్.ఏ.,

గౌరవనీయులైన దేవాదాయ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా :-

అ) రాష్ట్రంలో దేవాలయ పర్యాటకాన్ని అభివృద్ధి పరచడానికి ప్రభుత్వం వద్ద ఏదైనా ప్రతిపాదన ఉందా ;

ఆ) అయితే, దేవాలయ పర్యాటకం కొరకు గుర్తించిన దేవాలయాల వివరాలు ;

ఇ) ఆయా దేవాలయాలకు భక్తులను ఆకర్షించడానికి ప్రభుత్వం తీసుకొనబోయే చర్యలు ఏమిటి?

దేవాదాయ శాఖ మంత్రి (శ్రీ పి.మాణిక్యాలరావు)ః

అ) ఇది ప్రాథమిక దశలో ఉన్నది.
ఆ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.
ఇ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు

శ్రీ వనమాడి వెంకటేశ్వరరావు (కాకినాడ సిటి)ః అధ్యక్షా, మన రాష్ట్రంలో ఎన్నో ప్రాచీన దేవాలయాలు ఉన్నాయి. మన రాష్ట్రంలో తిరుపతి, అన్నవరం, సింహాద్రిఅప్పన్న, కనకదుర్గమ్మ చాలా ప్రాముఖ్యత కలిగిన దేవాలయాలు. వీటితోపాటు పంచారామాలు కూడా ఉన్నాయి. సామర్లకోటలోని కుమారారామం, రామచంద్రాపురంలోని ద్రాక్షారామం, పాలకొల్లులోని క్షీరారామం, అమరావతిలోని అమరారామం, భీమవరంలో భీమారామాలను పంచారామం అంటారు. వీటిని దర్శనం చేసుకొనేటప్పుడు కనీస సదుపాయాలు, వసతులు లేక భక్తులు అవస్థలు పడుతున్నారు. తిరుపతి, కనకదుర్గమ్మ దేవాలయాలను ఎలా అభివృద్ధి చేసుకున్నామో అదే విధంగా ఈ దేవాలయాలను కూడా అభివృద్ధి చేసుకోడానికి కొన్ని విషయాలు చెప్పదలచుకున్నాను. అంతర్వేదిలో లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఉంది. అమలాపురంలో గానీ లేదా దిండి రిసార్ట్స్‌లో ఉండి ఆ దేవాలయానికి వెళ్లి భక్తులు దర్శనం చేసుకుంటున్నారు. కాబట్టి దేవాలయ ప్రాంతంలోనే భక్తులు ఉండి దర్శించుకునే అవకాశం కల్పించాలి.

MR.SPEAK: Please be brief.

శ్రీ వనమాడి వెంకటేశ్వరరావు (కాకినాడ సిటి)ః ఆ దేవాలయానికి భక్తులు వస్తే అమలాపురం, దిండీ రిసార్ట్స్‌లో బస చేసి అక్కడి నుంచి దర్శనానికి వెళ్ళే పరిస్థితి ఉంది. దేవాలయాలతోపాటు, పర్యాటకంగా అభివృద్ధి చేయుటలో యువతకు ఉపాధి కల్పించడానికి చాలా అవకాశాలున్నాయి. విదేశాలకు వెళ్ళినపుడు నేను ప్రత్యేక్షంగా చూశాను. దేవాలయాలతో పాటు, టూరిజం అభివృద్ధి చేస్తూ, కొంతమంది యువకులకు ఆ దేవాలయాల విశిష్టతను తెలిపి, వాటి గురించి చెబుతూ టూరిజంను అభివృద్ధి చేస్తూ రెండు విధాలుగా ఆదాయం పెంచుకుంటున్నారు. పూర్వీకులు దేవాలయాలతోపాటు కొన్ని ఆస్తులు కూడా ఇచ్చారు.

...

రాష్ట్ర ప్రభుత్వం దీని విషయంలో చాలా జాగ్రత్తగా ఆలోచించాలి. ఏవైతే దేవాలయాలను పూర్వికులు మనకు ఇచ్చారో, ఆ దేవాలయాలతోబాటు కొన్ని ఆస్తులను కూడా మనకు ఇచ్చారు. ఉదాహరణకు ఇంతకు ముందు నేను శాసనసభ్యుడిగా ఉన్న రోజుల్లో, కాకినాడలో ఏదైతే ఎండోమెంటులో ఉన్న ఎంఎస్ఎన్ చారిటీస్ ఉందో, అది దేవాదాయ శాఖకు సంబంధించింది. 1276 ఎకరాలను ఒక దాత దానమిచ్చాడు, అందులో ఒక దేవాలయం, ఒక స్కూలు కూడా ఉంది. అప్పుడు ఆ శాఖను నేను పరిశీలించినప్పుడు, అక్కడ ఉన్న 1270 ఎకరాల మీద ఏమి ఆదాయం వస్తుందని పరిశీలిస్తే, ఎకరానికి కేవలం రూ.150 లేక రెండు బస్తాలో మూడు బస్తాలో

ఒడ్లు కిస్తుగా చెల్లిస్తున్నారు. దాని గురించి ఆ రోజున అక్కడి రైతులతో మాట్లాడి, దాతలు ఇచ్చిన ఆశయాలను మీరు నిర్లక్ష్యం చేస్తున్నారు, దీని ఆదాయాలను పెంచాలని చెబితే, అప్పటికి దాని ఆదాయం సంవత్సరానికి రూ.30 లక్షలు ఉండేది, ఆ రైతులతో మాట్లాడి కిస్తు పెంచమని చెప్పిన తర్వాత రూ.70 లక్షలకు అక్కడి ఆదాయం పెరిగింది. నేను ఎందుకు ఈ మాటలను చెబుతున్నానంటే, ఇలాంటి ఆస్తులు రాష్ట్ర వ్యాప్తంగా చాలా ఉన్నాయి. ఈ 10 సంవత్సరాల్లో ఈ ఆస్తులన్నీ దుర్వినియోగపరచడానికి చాలా ప్రయత్నాలు జరిగితే, వాటిని మేము అడ్డుకున్నాం. ఇటువంటివన్నీ కూడా గౌరవ మంత్రి గారు పర్యవేక్షించి ఈ ఆస్తులన్నింటినీ కాపాడుతూ దేవాలయాలను అభివృద్ధి చేస్తూ, పర్యాటక పరంగా కూడా అభివృద్ధి చేయాలని తమరి ద్వారా కోరుతున్నాను.

శ్రీ పి.మాణిక్యాలరావు (తాడేపల్లిగూడెం)ః అధ్యక్షా, గౌరవ సభ్యులు సూచించినట్లుగా పంచారామాలను, నరసింహక్షేత్రాలన్నింటినీ, అలాగే జిల్లాల వారీగా ఉన్న ప్రముఖ దేవాలయాలన్నింటినీ కలుపుతూ కొన్ని సర్క్యూట్స్‌ని ఏర్పాటు చేయడం ద్వారా టెంపుల్ టూరిజాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. అలాగే దేవాలయాలకు సంబంధించిన ఆస్తుల విషయంలో కూడా గౌరవ సభ్యులు సూచించిన విధంగా గత 10 సంవత్సరాల్లో పని చేసిన ప్రభుత్వాలు, వారి ఇష్టారాజ్యంగా దేవాలయాలను పట్టించుకోకుండా వ్యవహరించడం జరిగింది. తప్పనిసరిగా ఈ ఆస్తులను పర్యవేక్షించే విషయంలో ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఆదాయాలను పెంచే విషయంలో కూడా ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటాం. అలాగే గౌరవ సభ్యులు సూచించిన విధంగా టూరిజాన్ని డెవలప్ చేయడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్న విషయంలో టెంపుల్ టూరిజమ్ మీద ప్లాన్ చేయడం జరుగుతుంది. తప్పనిసరిగా అంతర్వేది, పంచరామాల విషయంలో గౌరవ సభ్యులు సూచించిన విధంగా అక్కడకు వచ్చే భక్తులకు అన్ని రకాల వసతి సౌకర్యాలను కల్పించే ఆలోచనను ప్రభుత్వం చేస్తోంది. అలాగే టూరిజాన్ని అభివృద్ధి చేయడం ద్వారా ఉపాధి అవకాశాలను పెంచాలనే ఆలోచనను కూడా చేస్తున్నాం, ఈ దేవాలయ వ్యవస్థ మొత్తం కూడా ఒక పవిత్రమైన వాతావరణంలో ఉండేలా చూసేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోంది.

ప్రశ్న నెం.103 (98)

సర్వశ్రీ. పీడిక రాజన్నదొర, కిడారి సర్వేశ్వరరావు, ఎం.ఎల్.ఏలు.

గౌరవనీయులైన మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారాఃా

అ) రాష్ట్రంలో గిరిజన విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పే ప్రతిపాదనలు ఉన్నాయన్న విషయం వాస్తవమేనా?

ఆ) సదరు విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించేందుకు అనువైన ప్రదేశంగా ఒడిస్సా, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు దగ్గరగా ఉన్న విజయనగరం జిల్లాను ప్రభుత్వం గుర్తించిందా?

ఇ) విజయనగరం స్వదేశీ రాజ్య గత పాలకులు అనేక సంవత్సరాల క్రితం సదరు విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పేందుకు విజయనగరం జిల్లాలో వందలాది ఎకరాలను విరాళంగా ఇచ్చేందుకు ఉదారంగా ముందుకు వచ్చారన్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా?

ఈ) సదరు విశ్వవిద్యాలయాన్ని శీఘ్రమే నెలకొల్పేందుకు రాష్ట్రప్రభుత్వం తీసుకోదలచిన చర్యల వివరాలేమిటి?

గౌరవనీయులైన మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి (శ్రీ గంటా శ్రీనివాసరావు)

అ) అవునండీ.
ఆ) అవునండీ.
ఇ) లేదండీ.

ఈ) రాష్ట్ర ప్రభుత్వం విజయనగరం జిల్లాలో భూములను ఇప్పటికే గుర్తించడమైంది. సదరు విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పేందుకు స్థలాన్ని ఖరారు చేసే క్రమంలో సదరు భూములను పరిశీలించటానికి స్థల ఎంపిక కమిటీని పంపవలసిందిగా కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖను కోరడమైనది.

శ్రీ పీడిక రాజన్నదొర (సాలూరు) : అధ్యక్షా, గౌరవ మంత్రివర్యులు అన్ని ప్రశ్నలకు అవునండీ అని సమాధానం చెప్పి ' సి' ప్రశ్నకు మాత్రం లేదండీ అని చెప్పారు. కానీ, దివంగత పీవీజే రాజుగారు మా సాలూరు నియోజకవర్గంలోని 1500 ఎకరాల భూమిని ఉదారంగా, ఉచితంగా గిరిజన విశ్వవిద్యాలయాన్ని నిర్మించడానికి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. దానికి సంబంధించిన నోట్‌ను కూడా రాయడం జరిగింది. గౌరవ కేంద్ర మంత్రివర్యులు అశోక్ గజపతి రాజు గారు కూడా, జూలై, 4వ తేదీన ఆ స్థలాన్ని పరిశీలించారు. ఆ స్థలాన్ని అన్ని విధాలుగా చదును చేయమని జిల్లా అధికారులను కూడా ఆదేశించడం జరిగింది.

గిరిజన విశ్వవిద్యాలయమంటే, గిరిజన సాంప్రదాయాలు, ఆచారాలు సంస్కృతి ప్రతిబింబించే విధంగా ఉండాలి. కాబట్టి ఆ యూనివర్శిటీని గిరిజనులు నివసించే ప్రాంతంలో నిర్మిస్తే బాగుంటుంది. అక్కడకు వచ్చి చూసే వారికి, అక్కడ పని చేసే వారికి, గిరిజనులంటే ఇలా ఉంటారా, గిరిజన ప్రాంతమంటే ఇలా ఉంటుందా అని, వాళ్లు కూడా తపించి జపించి గిరిజనుల కోసం, కూడు, గూడు, గుడ్డ లేని వారి కోసం సేవ చేయాలనే ఆలోచన చేస్తారు. అందుకే తమరి ద్వారా గౌరవ మంత్రి గారికి మనవి చేస్తున్నాను. మా విజయనగరం జిల్లాలోని గిరిజన ప్రాంతంలోని పాచిపెంట ప్రాంతంలో ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు తమరు కృషి చేస్తున్నారా? అదేవిధంగా ఎప్పటి నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఎందుకంటే గత జూలై మాసంలో పురపాలక శాఖా మంత్రి గారు వచ్చినప్పుడు, 2015-16 నుంచి అక్కడ అడ్మిషన్లు జరుగుతాయని చెప్పారు, అందుకే అడుగుతున్నాము. మా ప్రాంతంలో ప్రారంభిస్తున్నారా? అడ్మిషన్లను ఎప్పటి నుంచి ప్రారంభిస్తారని తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని అడుగుతున్నాను.

శ్రీ గంటా శ్రీనివాసరావు (భీమిలి)ః అధ్యక్షా, సోదరులు రాజన్నదొరగారు అడిగిన దానికి, యాక్చువల్‌గా నేను విజయనగరం జిల్లా కలెక్టర్‌తో కూడా స్వయంగా మాట్లాడాను. ఏపీ రీఆర్గనైజేషన్ బిల్లు 2014 యాక్ట్‌లోని 13వ షెడ్యూల్డు ప్రకారం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక గిరిజన యూనివర్శిటీ అలొకేట్ అయ్యింది. దానిని ఎక్కడ ఏర్పాటు చేస్తే బాగుంటుందనేది ముఖ్యమంత్రి గారు ఆలోచించి, విజయనగరం జిల్లాలో గిరిజనులు ఎక్కువగా ఉండటం, వెనుకబడిన జిల్లాగా ఉన్న నేపథ్యంలో అక్కడ ఏర్పాటు చేస్తే బాగుంటుందని భావించి ప్రభుత్వం విజయనగరం జిల్లాను గుర్తించడం జరిగింది. ఆ జిల్లాలో 500 ఎకరాలు సైట్ కావాలని రిక్వైర్‌మెంటు అడిగారు. ఆ 500 ఎకరాలు ఎక్కడ అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ గారి ద్వారా సమాచారాన్ని తెప్పించుకున్నాం. అందులో రెండు ప్రాంతాలను వారు చూచించారు. మన ఎమ్మెల్యే గారు అడిగిన పాచిపెంట మండలం, అలాగే గొండాపల్లి మండలంలో ల్యాండ్ ఉన్నట్లు గుర్తించారు. దానిని ఎంఏ అండ్ యుడి మంత్రి గారు కూడా వెళ్లి చూసొచ్చారు.

రెండు మండలాల్లో ఉన్న సైట్స్ ఎవైల్యబిలిటీని కేంద్ర ప్రభుత్వానికి కూడా పంపించాము. త్వరలోనే సైట్ సెలక్షన్ కమిటీ రాష్ట్రానికి వస్తుంది. ఏ సైట్ బాగుందనేది వారు చూసిన తర్వాత ఫైనల్ చేయడం జరుగుతుంది. వారు అడిగినట్లుగా ఇది ఒక full fledged University. కేంద్ర ప్రభుత్వం సుమారు వెయ్యి కోట్లతో స్థాపిస్తున్న యూనివర్శిటీ ఇది. తప్పకుండా వచ్చే సంవత్సరానికే అడ్మిషన్లు జరిగే విధంగా అన్ని ప్రయత్నాలను చేస్తున్నాము.

ప్రశ్న నెం.86 (99) శ్రీ గొల్లపల్లి సూర్యారావు, ఎం.ఎల్.ఏ.

**గౌరవనీయులైన ఆరోగ్య, వైద్య, విద్యా శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారాఃఃః

అ) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆసుపత్రులలో డాక్టర్ల కొరత ఉన్న విషయం వాస్తవమేనా?

ఆ) అయితే, ప్రభుత్వ ఆసుపత్రులలో డాక్టర్ల నియామకానికి ఏవైనా చర్యలను ప్రభుత్వం చేపడుతున్నదా?

ఇ) వారిని ఎప్పటిలోగా నియమించడమవుతుంది?

గౌరవనీయులైన ఆరోగ్య, వైద్య, విద్యా శాఖ మంత్రి (శ్రీ కామినేని శ్రీనివాస్)

అ) అవునండీ. ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్తు ఆసుపత్రులలో రెగ్యులర్ డాక్టర్ల కొరత ఉంది. కొన్ని స్పెషాలిటీలలో స్పెషలిస్టులు లేని కారణంగా డిఎంఇలో పదవులు ఖాళీగా ఉన్నాయి.

ఆ) అవునండీ. ఎపివివిపిలో ఖాళీగా ఉన్న సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులను భర్తీ చేయడానికి ప్రత్యక్ష నియామక ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది. అలాగే డిపిహెచ్ అండ్ ఎఫ్‌డబ్ల్యు మరియు ఎపివివిపి నుండి డిఎంఇకి సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులను తీసుకోవడమవుతున్నది.

ఇ) ఈ ప్రక్రియను త్వరలోనే పూర్తి చేయడమవుతుంది.

శ్రీ గొల్లపల్లి సూర్యారావు (రాజోలు)ః అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆసుపత్రులలో డాక్టర్ల కొరత ఉన్న విషయం వాస్తవమేనా అని అడిగిన ప్రశ్నకు మంత్రి గారు అవును అని సమాధానమిచ్చారు. అందుకు ధన్యవాదాలు. నిజమే, ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా మా తూర్పు గోదావరి జిల్లాలో, ఆనాడు చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏరియా ఆసుపత్రులని చాలా పెద్ద ప్రణాళికతో ఏర్పాటు చేశారు. బహుశా మేము పుట్టిన తర్వాత ప్రభుత్వ ఆసుపత్రులు ఆ మాదిరిగా డెవలప్ కావడమనేది అప్పుడే జరిగింది. పెద్ద పెద్ద బిల్డింగులను నిర్మిస్తూ చాలా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ని క్రియేట్ చేశారు. ఇక మా ప్రాంతంలో అనారోగ్య సమస్యలతో ఉన్న వారందరికీ స్వర్గదాయకమైన నిలయాలుగా అసుపత్రులు ఉంటాయనే ఆలోచనతో మేమందరం ఉండే వారము. దరిమిలా, గత పది సంవత్సరాల్లో రెండు ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయి, కనీసం డాక్టర్లను కూడా నియమించలేని పరిస్థితిలో ఉన్నాయి. రాష్ట్రానికి గొప్ప ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ని అందించారు. ఏరియా హాస్పటల్స్ అన్న పెద్ద భవంతులతోబాటు అన్ని సౌకర్యాలతో కూడుకున్న ఆసుపత్రుల నిర్మాణం చేసిన తర్వాత, ఆ ఆసుపత్రులకు గత 10 సంవత్సరాల కాలంలో గడచిన పాలకులు గానీ, అంతకు ముందు ఉన్న పాలకులు గానీ ఎక్కడా

ఒక డాక్టర్‌ని కూడా నియమించిన పరిస్థితులు లేవని మంత్రి గారి సమాధానం ద్వారా మాకు అర్థమవుతుంది. ఇకపోతే రాజోలు నియోజక వర్గంలో ఇప్పుడు డాక్టర్ల కొరత ఉన్నది. (అంతరాయం) గత 10 సంవత్సరాల నుండి డాక్టర్ల కొరత ఉన్న మాట వాస్తవం. అంతకు ముందు 10 సంవత్సరాల క్రితం చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు క్రియేట్ చేసిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తప్ప, ఆంధ్రప్రదేశ్‌లో పని చేసిన ప్రభుత్వాలన్నీ నిర్వీర్యం చేసిన పరిస్థితులు ఉన్నాయి. ఆరోగ్యశ్రీ అనే ఒక పెద్ద మాఫియా క్రింద దానిని తయారు చేసుకొని ప్రభుత్వ ఆసుపత్రులన్నింటినీ నిర్వీర్యం చేసిన మాట మనకు అర్థమవుతుంది. (అంతరాయం) ఈ విషయంలో ప్రత్యామ్నాయమైన మరొక మాట లేదు. ...

అధ్యక్షా, నేను రాజోలు నియోజకవర్గంలోని ఆసుపత్రి ఎదుర్కొంటున్న సమస్యల గురించి గౌరవ మంత్రి గారి దృష్టికి తీసుకుపోతున్నాను. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాను. (ప్రతిపక్షపార్టీ సభ్యులచేత సభకు అంతరాయం) ఆనాటి తెలుగు దేశం పార్టీ ప్రభుత్వ హయాంలో ఏరియా ఆసుపత్రులు ఒక వెలుగు వెలిగాయి. తరువాత రాష్ట్రాన్ని ఏలిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రులు నిర్లక్ష్యానికి గురైనాయి. (ప్రతిపక్షపార్టీ సభ్యులచేత సభకు అంతరాయం) ప్రభుత్వాసుపత్రులకు మళ్లీ ఆనాటి పూర్వవైభవం సత్వరమే తీసుకురావాలంటే డాక్టర్ల కొరతను తీర్చేందుకు ప్రభుత్వం కృషి చేయాల్సిన అవసరముంది. మన రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి నేటికి ఎనభై రోజులైంది. తూర్పుగోదావరి జిల్లా రాజోలు నియోజకవర్గ పరిధిలో ఐదు పి.హెచ్.సి.లున్నాయి. ఒక ఏరియా ఆసుపత్రి కూడా ఉంది. డాక్టర్ల కొరత ఉందనే విషయాన్ని గౌరవ మంత్రి గారు కూడా అంగీకరించారు కనుక డాక్టర్ల భర్తీతో పాటు కొన్ని మౌలిక సదుపాయాలను ఆయా ప్రభుత్వాసుపత్రుల్లో కల్పించాల్సిన అవసరముంది. ప్రభుత్వాసుపత్రుల చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు అవసరమైన పారిశుద్ధ్యం, త్రాగునీరు తదితర సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేయాల్సిన అవసరముంది. వర్షాకాలంలో వర్షపు నీరు ఆసుపత్రుల్లో నిలిచి శుభ్రతకు ఆటంకం కల్గుతోంది. అవసరమైనచోట్ల ఆసుపత్రుల చుట్టూ చిన్న, చిన్న రోడ్లను వేయాల్సిన అవసరముందనే విషయాన్ని తమరి ద్వారా గౌరవ మంత్రి గారి దృష్టికి తీసుకువస్తున్నాను.

అధ్యక్షా, ప్రభుత్వాసుపత్రుల నిర్వాహణ సక్రమంగా లేకపోవడం వల్ల ఆసుపత్రులకు ప్రహారీ గోడలు లేనందున ఆసుపత్రి పరిసరాల్లో పందులు, కుక్కలు తిరగడం వల్ల పరిశుభ్రతకు భంగం వాటిల్లుతోంది. ప్రభుత్వాసుపత్రులకు ఎక్కువగా గర్భిణీ స్త్రీలు వైద్యం నిమిత్తం వస్తున్నారు. కానీ ప్రభుత్వాసుపత్రుల్లో గైనకాలజిస్ట్‌ల కొరత ఎక్కువగా ఉండడం వల్ల గర్భిణీ స్త్రీలు ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి ప్రభుత్వాసుపత్రుల్లో ఖాళీగా ఉన్న గైనకాలజిస్ట్ పోస్ట్‌లను వెంటనే భర్తీ చేయాలి. అదేవిధంగా ఆసుపత్రుల్లో పడకల స్థాయిని పెంచాల్సి ఉంది. ఆసుపత్రుల్లో బెడ్స్, త్రాగునీరు వంటి కనీస సౌకర్యాలను కల్పించాలి.

అధ్యక్షా, రాజోలు నందలి ఏరియా ఆసుపత్రికి ఎప్పుడో పూర్వం ఒక చిన్న అంబులెన్స్‌ను అప్పటి ప్రభుత్వం ఏర్పాటుచేసింది. అవసరానికి ఆ అంబులెన్స్ వాడకంలో లేనందున, అత్యవసర సమయాల్లో అంబులెన్స్ లేకపోవడం వల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ ఏరియా ఆసుపత్రి పరిధిలో సుమారు ఏడెనిమిది లక్షల మంది ఉన్నారు. అంబులెన్స్ కొనుగోలుకు పెద్దగా ఖర్చు కూడా కాదు. కాబట్టి అంబులెన్స్ కొనుగోలు నిమిత్తం సంబంధిత అధికారులను ఆదేశించి, రాజోలు ఏరియా ఆసుపత్రి నందు అంబులెన్స్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయవలిసిందిగా తమరిద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

అధ్యక్షా, ఈ మధ్య కాలంలో ఏరియా ఆసుపత్రికి ఎక్కువగా గుండె జబ్బు రోగులు నిత్యం వస్తున్నారు. కానీ ఆసుపత్రి నందు ఇ.సి.జి. పరికరం అందుబాటులో లేనందున రోగులు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. కాబట్టి సత్వరమే రాజోలు నందలి ఏరియా ఆసుపత్రిలో ఇ.సి.జి. మిషన్‌ను ఏర్పాటుచేయాల్సిన అవసరముంది. ఆ విషయమై గౌరవ మంత్రిగారు దృష్టి సారించాలని తమరి ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రభుత్వాసుపత్రులంటే ప్రత్యక్ష దేవాలయాలుగా ప్రజలు భావించే పరిస్థితి, పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రభుత్వం కృషిచేయాల్సిన అవసరముందని నేను భావిస్తున్నాను. మనం కళ్లు మూసుకుని దేవుణ్ణి పూజిస్తాం. ఎప్పుడైనా రోగాలు వచ్చినప్పుడు వెంటనే మనకు కనిపించేవి కూడా ఆసుపత్రులే. కాబట్టి ఆసుపత్రి అంటే దేవాలయం అనే భావన కలిగే విధంగా ప్రభుత్వం కృషి చేయాలి. ప్రభుత్వాసుపత్రులను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత మనపైన ఉంది. ప్రభుత్వాసుపత్రుల్లో అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిశీలించి ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయవల్సిందిగా కోరుతూ, ప్రజల అవసరార్థం, ఉపయోగార్థం ప్రభుత్వాసుపత్రులకు మళ్లీ పూర్వవైభవాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేయవల్సిందిగా తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

డా. కామినేని శ్రీనివాస్ (కైకలూరు): అధ్యక్షా, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలో ఉన్న మొత్తం 445 ప్రొఫెసర్ పోస్ట్‌లకు గాను 129 పోస్ట్‌లు ఖాళీగా ఉన్నాయి. అసోషియేటెడ్ ప్రొఫెసర్ పోస్టులు 395 కు గాను 109 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అదే విధంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 1,647 లకు గాను 420 పోస్ట్‌లు ఖాళీగా ఉన్నాయి. అలాగే స్టాఫ్ నర్సులకు సంబంధించి 2,900 పోస్ట్‌లకు గాను 676 పోస్ట్‌లు ఖాళీగా ఉన్నాయి.

అలాగే డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో 1,647 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్ట్‌లకు గాను 427 పోస్ట్‌లు ఖాళీగా ఉన్నాయి. అసోషియేటెడ్ ప్రొఫెసర్ పోస్ట్‌లు 395 కు గాను 109 పోస్ట్‌లు ఖాళీగా ఉన్నాయి. ప్రొఫెసర్ పోస్ట్‌లు 445 లకు గాను 129 పోస్ట్‌లు ఖాళీగా ఉన్నాయి. అలాగే ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ పరిధిలో 836 డాక్టర్ల పోస్ట్‌లకు గాను 193 డాక్టర్ల పోస్ట్‌లు ఖాళీగా ఉన్నాయి.

అధ్యక్షా, నిజంగానే 1994-2004 మధ్య కాలంలో ప్రైమరీ హెల్త్ సెంటర్స్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్, ఏరియా ఆసుపత్రులకు చాలావరకు కొత్త భవనాలను నిర్మించడం జరిగింది. ఈ సభలో మనం కొన్ని అంశాలను చర్చించుకునేటప్పుడు ఆలోచించాల్సి ఉంటుంది. ఆరోగ్యశ్రీ పథకం క్రింద పేద ప్రజానీకం రోగాల భారీన పడినప్పుడు కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్య సదుపాయాన్ని కల్పించిన మాట వాస్తవమే గానీ తద్వారా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రులు, ప్రైమరీ హెల్త్ సెంటర్స్ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైనాయి. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వాసుపత్రులు నిర్లక్ష్యానికి గురైన మాట వాస్తవం. ప్రభుత్వాసుపత్రులకు పూర్వ వైభవాన్ని పునరుద్ధరిస్తూనే రాబోయే రోజుల్లో పి.హెచ్.సి.లు, సి.హెచ్.సి.లు మరియు ఏరియా ఆసుపత్రులను బలోపేతం చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. డాక్టర్ల కొరతను సత్వరమే తీర్చేందుకు కూడా ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. ఇప్పటికే ఆ ప్రాసెస్ కొనసాగుతోందనే విషయాన్ని తమరిద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

MR SPEAKER: Question No. 177 (100), Minister for Agriculture

ప్రశ్న నెం. 177 (100)

సర్వశ్రీ... కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, రాజన్నదొర పీడిక, బూడి ముత్యాల నాయుడు,
కాకాని గోవర్ధన రెడ్డి, ముత్తుముల అశోక్ రెడ్డి – ఎమ్మెల్యేలు.

గౌరవనీయులైన వ్యవసాయశాఖ మంత్రిగారు దయచేసి ఈక్రింది సమాచారం తెలియజేస్తారా:-

అ) రాష్ట్రంలోని కౌలురైతుల సమస్యలను తగ్గించడానికి ప్రభుత్వం ఏదేని ప్రణాళికను రూపొందించిందా;

ఆ) నష్టపరిహారాన్ని చెల్లించడంలో కౌలురైతులు నష్టపోతున్న విషయం ప్రభుత్వం దృష్టికి తేబడిందా;

ఇ) అయితే, ఈ విషయంలో ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటి?

వ్యవసాయ, వ్యవసాయ- ప్రాసెసింగ్, గిడ్డంగులు, పశు సంవర్ధన, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య పరిశ్రమల శాఖ మంత్రి (శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు):

అ) అవునండి

ఆ) లేదండి

ఇ) ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

శ్రీ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి (నెల్లూరు రూరల్): అధ్యక్షా, రాష్ట్రం మొత్తంలో అరవై శాతం నుంచి డెబ్భై శాతం వరకు డెల్టా ప్రాంతంలో కౌలు రైతులే వ్యవసాయ సాగును చేస్తున్నారు. కౌలు రైతులంతా కూడా చాలా ఇబ్బందుల్లో చాలా సమస్యలతో సతమతమవుతున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి కనబడుతోంది. నేను మాత్రమే ఈ మాటలు చెప్పడం లేదు. స్వయంగా ఈ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు వ్రాసిన లేఖలో నేను ప్రస్తావించిన విషయాలన్ని చాలా స్పష్టంగా పేర్కొనబడ్డాయి. రాష్ట్రంలో ఒక కోటి ఎకరాల్లో సాగు చేసే ఇరవై లక్షల మంది కౌలు రైతులకు భరోసా ఇచ్చేందుకుగాను ఒక మాటను కూడా ప్రభుత్వం బడ్జెట్ ప్రసంగంలో పొందుపర్చకపోవడం చాలా విచారకరం. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులిస్తామని, ఋణ అర్హత కార్డులిస్తామని చెప్పడం జరిగింది. ఈరోజున కౌలు రైతులు ప్రైవేట్ వడ్డీ రూపంలో ఆరు వేల కోట్ల రూపాయలు నష్టపోతున్నారు. ఆరు వేల కోట్ల రూపాయల వడ్డిని ప్రైవేట్ వడ్డీ వ్యాపారస్తులకు కౌలు రైతులు వడ్డీ క్రింద కట్టినటువంటి దారుణమైన పరిస్థితిలో కౌలు రైతులున్నారు. గత సంవత్సరం ఇరవై లక్షల మంది కౌలు రైతులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉంటే, కేవలం ఒక లక్ష అరవై వేల మంది కౌలు రైతులకు రూ.318.00 కోట్ల మేరకే బ్యాంకుల నుంచి ఋణాలను ఇవ్వడం జరిగింది. ఇటువంటి పరిస్థితుల్లో నేను మంత్రి గారిని అడిగిన ప్రశ్నకు "అవునండి" అనే సమాధానం కాదు. కౌలు రైతుల కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం, ఋణ అర్హత గుర్తింపు కార్డుల కోసం, బ్యాంకుల నుంచి ఋణాలిప్పించుట కోసం ఈ ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుంటుందనే విషయాన్ని సభకు తెలియజేయవల్సిందిగా చాలా స్పష్టంగా తమరి ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను. బడ్జెట్ ప్రస్తావనను కూడా దృష్టిలో పెట్టుకుని కౌలు రైతుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకునే చర్యలు ఒక భరోసా కల్పించే విధంగా ప్రభుత్వ సమాధానం ఉండాలనే విషయాన్ని గౌరవ మంత్రిగారికి తెలియజేస్తున్నాను. మంత్రిగారి సమాధానం కౌలు రైతులకు ఆత్మవిశ్వాసం కల్గించేదిలా ఉండాలని తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు (చిలకలూరిపేట): అధ్యక్షా, కౌలు రైతుల కోసం నోటి మాటగా ప్రామాణికంగా మాత్రమే భూములను కౌలుకు తీసుకుని పంటలు పండిస్తున్నారు. కౌలు రైతులు రక్షణ చట్టాన్ని కూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలుచేసే దిశగా ప్రభుత్వం పయనిస్తోంది. కౌలురైతులకు రుణ అర్హత కార్డులను కూడా త్వరలో ప్రభుత్వం జారీ చేయబోతోంది. రుణ అర్హత కార్డులను కౌలు రైతులు బ్యాంకుల్లో చూపించడం ద్వారా వారికి బ్యాంకు రుణంతో పాటు ఇన్‌పుట్ సబ్సిడి, పంటల బీమా, పంట నష్ట పరిహారం తదితర ప్రయోజనాలను కూడా కౌలు రైతులకు కల్పించడం జరుగుతోంది. రాష్ట్రీయ బ్యాంకర్ల సమన్వయ కమిటీ ద్వారా ఎస్.ఎల్.బి.సి. సమావేశంలో కూడా రుణ అర్హత కార్డులు కల్గి ఉన్న

కౌలు రైతులకు రుణాలను మంజూరు చేయమని బ్యాంకర్లను కోరడం కూడా జరిగింది. రుణ అర్హత కార్డు కల్గినటువంటి కౌలు రైతులకు రుణ పంపిణీ వివరాలు 2011-12 వ సంవత్సరానికి గాను మొత్తం 4,13,797 మంది కౌలు రైతులకు ఎల్.ఇ.సి. కార్డులు మంజూరు చేయడం, దాంట్లో 1,64,125 మంది కౌలు రైతులకు రూ.322.20 లక్షల రుణం కూడా మంజూరు చేయడం జరిగింది. 2012-13వ సంవత్సరానికి గాను మొత్తం 3,25,077 మంది కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు మంజూరు చేస్తే, అందులో 1,17,261 మంది కౌలు రైతులకు రుణాలను మంజూరు చేయుట కొరకు రూ.274.19 లక్షలు ఆ సంవత్సరానికి గాను బ్యాంకుల ద్వారా ఖర్చు చేయడం జరిగింది. 2013-14వ సంవత్సరానికి గాను 3,84,621 మంది కౌలు రైతులకు ఎల్.ఇ.సి. కార్డులు ఇష్యూ చేస్తే, 1,56,375 మంది కౌలు రైతులకు రూ.318.13 లక్షల మొత్తాన్ని బ్యాంకుల నుంచి రుణాల క్రింద విడుదల చేయడం జరిగింది. 2014-15వ సంవత్సరం ఇప్పటి వరకు అంటే 01.08.2014వ తేదీ నాటికి 1,86,885 మంది కౌలు రైతులకు ఎల్.ఇ.సి.కార్డులు ఇష్యూ చేయడం జరిగింది. రుణాల విడుదల ప్రక్రియ ప్రాసెస్‌లో ఉంది. రుణ అర్హత కార్డుల జారీ పథకాన్ని పునఃపరిశీలన కొరకు, ల్యాండ్ రికార్డులను అనుసంధానం చేయడం మరియు మార్గదర్శకాలను రూపొందించడానికి గాను ప్రభుత్వం ఒక కమిటీని కూడా ఏర్పాటు చేయడం జరిగింది.

...

1-8-2014 వరకు 1,86,885 మంది రైతులకు ఎల్ఇసీ కార్డులు జారీ చేయడం జరిగింది. రుణాలు ప్రాసెస్‌లో విడుదల చేయడు జరుగుతోంది. రుణ అర్హత కార్డులు జారీ పథకాన్ని పునఃపరిశీలన కొరకు, ల్యాండ్ రికార్డులను అనుసంధానం చేయడం మరియు మార్గదర్శకాలను రూపొందించడం కోసం ఒక కమిటీని వేయడం జరిగింది. ప్రభుత్వ ఉత్తర్వులు నెం.174 ప్రకారం 14–8–2014 ద్వారా జారీ చేసినటువంటి రుణమాఫీ పథకం విధి విధానాల్లో పట్టాదారు, కౌలుదారు మరియు ఎల్ఇసీదారు ఒకే సర్వే నెంబరుపై పంట రుణం పొంది ఉన్న యొడల ఎల్ఇసీదారు మరియు కౌలు దారుకు మాత్రమే రుణ మాఫీ ప్రయోజనాన్ని అందజేయాలని నిర్ణయించడమైనది.

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు లబ్ధిదారుల జాబితాలో 50 శాతం కంటే ఎక్కువ పంటనష్టం జరిగినటువంటి సాగు రైతుల వివరాల్లో కౌలు రైతుల వివరాలు నమోదు చేయడం వారికి పంటనష్టం ఇవ్వడం జరుగుతోంది. పంట నష్ట పరిహారం పంపిణీ చేయనప్పుడు సబ్సిడీ మొత్తాన్ని నష్టపోయిన సాగు, కౌలు రైతులు ఎవరైతే ఉన్నారో వారి బ్యాంకు ఖాతాల్లో జమచేయడం జరుగుతోంది. ఇంకా ఈ ప్రభుత్వం రుణమాఫీ పథకంలో కౌలు రైతులందరికీ కూడా ఎల్ఇసీ కార్డులు ఉండి, ఎక్కడ బ్యాంక్‌లో లోన్ ఉన్నా మొదటి ప్రాధాన్యత కౌలు రైతులకు మాత్రమే ఇవ్వడం జరుగుతుంది. కౌలు రైతుల కోసం తెలుగుదేశం ప్రభుత్వం కట్టుబడి ఉంది. విత్తనాల సబ్సిడీలో గానీ, ఎరువుల సబ్సిడీలో కానీ, రుణాలు మంజూరు చేయడంలో గానీ, కౌలు రైతులను ఆదుకోడానికి తెలుగుదేశం ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రి

నారా చంద్రబాబునాయుడు గారి నాయకత్వంలో ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందని నేను తెలియజేస్తున్నాను.

MR.SPEAKER ; Questin No.12-C (93) , Minister for Agriculture.

ప్రశ్న నెంబరు. 12-సి (93)

శ్రీ కాగిత వెంకటరావు – ఎం.ఎల్.ఎ.

గౌరవనీయులైన వ్యవసాయశాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా.

ఎ) మార్కెట్ యార్డులలో రైతుమిత్ర పథకం పనిచేయడం లేదన్న విషయం వాస్తవమేనా.

బి) అయితే, అందుకు గల కారణా లేమిటి.

సి) ఉత్పాదకాలను సబ్సిడీ ధరలతో సమకూర్చడానికి ప్రభుత్వం తీసుకునే చర్యలేమిటి ?

వ్యవసాయశాఖ మంత్రి (శ్రీ పి.పుల్లారావు) గారి సమాధానం.

ఎ) అవునండి.

బి) ఆంధ్రప్రదేశ్ మార్కెట్ ఫెడ్ తగినన్ని అవసర నిల్వలను నిర్వహిస్తున్నది. రసాయనిక ఎరువుల కోసం రైతుల నుండి డిమాండు లేకపోవడం వలన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఎసిఎస్‌లు) దగ్గర కూడా నిల్వలు లభ్యంగా ఉంచడమవుతున్నది.

సి) జిల్లాలకు కేటాయించిన సబ్సిడీ ఇచ్చిన రసాయన ఎరువులలో 50 శాతాన్ని రైతులకు పంపిణీ చేయడం కోసం ఆంధ్రప్రదేశ్ మార్క్‌ఫెడ్, చెరకు అభివృద్ధి సంస్థలు, రైతుమిత్ర బృందాలు పరస్పర సహాయాధారిత సహకార సంఘాలలోని సభ్యుల ద్వారా సంఘాలకు కేటాయించడమయింది. తద్వారా ఉత్పాదకాల లభ్యత మెరుగవుతుంది.

అదేవిధంగా, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పిఎసిఎస్‌లు) ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ లిమిటెడ్ (ఎపిఎస్ఎస్‌డిసి) ఆంధ్రప్రదేశ్ సహకార నూనెగింజల ఉత్పత్తి దారుల సమాఖ్య లిమిటెడ్ (ఎపి.ఆయిల్‌ఫెడ్) వంటి ఏజన్సీలచే రైతులకు సబ్సిడీ ఇచ్చిన విత్తనాలను పంపిణీ చేయడమవుతున్నది.

మిస్టర్ స్పీకర్ ః కాగిత వెంకటరావు గారు.

శ్రీ కాగిత వెంకటరావు (పెడన)ః అధ్యక్షా, గౌరవ మంత్రిగారు లేదండీ, కాదండీ కోఆపరేటివ్ ద్వారా ఇస్తున్నామని చెబుతున్నారు. గతంలో మార్కెటింగ్ ద్వారా మంచి విత్తనాలను అందజేసే వాళ్లం. నాణ్యతా ప్రమాణాలు కలిగిన విత్తనాలు అందుబాటులో ఉండేవి. వ్యాపారం మంచిగా జరిగేది. అదే విధంగా ఎరువులను కూడా సకాలంలో అందుబాటులో ఉంచి బ్లాక్ మార్కెట్స్‌కు వెళ్లి కొనుగోలు చేయకుండా మనమే మార్కెటింగ్ ద్వారా అందించే ఏర్పాటు చేశాం. ఆ అవకాశాన్ని మళ్లీ మార్కెటింగ్‌కు ఇచ్చి అమ్మించే ఆలోచన, ప్రతిపాదన ఏదైనా ప్రభుత్వం వద్ద ఉందా? మంత్రిగారు చెప్పాలి. రెండవది కోఆపరేటివ్ వ్యవస్థలో కూడా అవినీతి జరుగుతుంది. బంటుమిల్లి కోపరేటివ్ సొసైటీలో కొద్ది కాలంలో సుమారు రూ.4,00,000 ఫ్రాడ్ జరిగింది. ఎంక్వయిరీ చేశారు. ఇంతవరకు ఎటువంటి యాక్షన్ తీసుకోలేదు. వెంటనే చర్యలు తీసుకోవాలని చెప్పినప్పటికీ నత్తనడక నడుస్తోంది. అవినీతికి ఈరోజు కోఆపరేటివ్ మళ్లీ మార్గం ఏర్పాటు చేసుకుంటుంది. గతంలో కూడా జరిగింది. రైతుమిత్ర ఏదైతే ఉందో దీనిని మళ్లీ మార్కెటింగ్ ద్వారా ప్రవేశపెట్టి అమ్మించే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ప్రభుత్వం వెంటనే దీనిపై చర్యలు తీసుకొని అమ్మించే ఏర్పాటు చేస్తారని మేము మంత్రిగారికి, ముఖ్యమంత్రిగారికి కూడా తెలియపరచుకుంటున్నాము.

మిస్టర్ స్పీకర్ ః మినిస్టర్ గారు.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు (చిలకలూరిపేట)ః అధ్యక్షా, గౌరవ సభ్యులు వెంకటరావు గారు అడిగినట్లు రైతు మిత్ర పథకం1999 నుండి 2004వ సంవత్సరం వరకు వ్యవసాయ మార్కెట్ కమిటీలో అమలు చేయబడింది. ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశ్యం రైతులకు నాణ్యతా పరమైన విత్తనాలు, ఎరువులు మరియు క్రిమిసంహారక మందులు అందజేయడం, నష్టం, మరియు లాభం లేకుండా వ్యవసాయ మార్కెట్ కమిటీల నుండి అందజేయుటకు అనుమతి ఇవ్వబడింది. వ్యవసాయ మార్కెట్ కమిటీలు పైన తెలిపినటువంటి లావాదేవీలు మార్కెట్ యార్డులో నిర్వహించుటకు ప్రత్యేకంగా ఒక ఖాతాను తెరచి ఏరోజు వచ్చిన లావాదేవీలను అదే రోజున బ్యాంకులో జమచేయబడడం జరిగింది. ఈ పథకం ఐదు సంవత్సరాలు నుండి మార్కెట్‌యార్డు నందు అమలు చేయబడింది. ఆ తరువాత గత ప్రభుత్వాలు 10 సంవత్సరాల కాలంలో దీనిని ఎక్కడా అమలులో లేకుండా చేయడం జరిగింది. కాబట్టి ఇప్పుడు పిఏసిఎస్‌లు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నందున అదేవిధంగా పిఏసిఎస్‌ల తోపాటు డిసిఎంఎస్. ఏపి. ఆగ్రోస్ రైతు మిత్ర గ్రూపుల ద్వారా ఈరోజు ఆ లావాదేవిల మొత్తాన్ని, ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు, గానీ ఈ సంస్థలు ద్వారా రైతాంగానికి అందించడం జరుతోంది. కనుక గౌరవ సభ్యులు వెంకటరావు గారు అడిగినట్లు ఈ సంస్థల ద్వారా రైతాంగానికి ఎటువంటి లోటు

లేకుండా అందుబాటులో ఉంచడం జరిగింది. ఇంకా అవసరం అనుకుంటే వాటిని మళ్లా తీసుకొచ్చేందుకు ఈ ప్రభుత్వం కృషిచేయడం జరుగుతుంది.

అదేవిధంగా గౌరవ సభ్యులు బంటుమిల్లి కోపరేటివ్ సొసైటీ అవకతవకలు కూడా సభ దృష్టికి తీసుకువచ్చారు. తప్పకుండా ఈ లావాదేవీలపై అవసరమైతే ఎంక్వైరీ వేసి వాటిని రికవరీ చేయాలా, యాక్షన్ తీసుకోవాలనేది తప్పకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

'జీరో అవర్'

MR. SPEAKER: Now, Zero Hour. Sri BK Partha Saradhi Garu.

శ్రీ బి.కె. పార్థ సారథి (పెనుకొండ)ః అధ్యక్షా, అనంతపురం జిల్లా కరువు జిల్లా. జైసల్‌మి తరువాత అతి తక్కువ వర్షపాతం కురిసే జిల్లా అనంతపురం జిల్లా. అయితే అనంతపురం జిల్లాకు హంద్రీనీవా ఒక వరప్రదాయని అని భావిస్తున్నాం. 2006 సంవత్సరంలో మా పెనుగొండ నియోజకవర్గ ప్రాంతంలో 52,53,8-సి ఐదు ప్యాకేజిల కింద వర్క్స్ పిలిస్తే..., జల్లిపల్లి రిజర్వాయర్ అనేది మా నియోజకవర్గం కిందకు వస్తుంది. జల్లిపల్లి రిజర్వాయర్ పూర్తయింది. దానికి నీరు కూడా రావడం జరుగుతోంది. అయితే గ్రావిటీ మీద జల్లిపల్లి నుండి గొల్లపల్లికి నీరు రావల్సిన అవసరం ఉంది. అయితే ఆ రిజర్వాయర్ 5 శాతమే పూర్తయ్యి అసంపూర్తిగా ఉంది. కాబట్టి ఆ పాత ఏజన్సీని రద్దు చేస్తూ..., సద్భావనా ఏజన్సీ అనే సంస్థ పనిచేస్తోంది. గత 8 సంవత్సరాలుగా 5 శాతం పనులు కూడా పూర్తి కాలేదు. ఆఏజన్సీని మార్చి కొత్త ఏజన్సీని నియమించి త్వరితిగతిన పనులు పూర్తి చేసి మా ప్రాంతాన్ని ఆదుకోవల్సిందిగా కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్ ః సాయి ప్రసాద్‌రెడ్డి గారు..

శ్రీ వై. సాయి ప్రసాద్‌రెడ్డి (ఆదోని)ః అధ్యక్షా నా ఆదోని నియోజక వర్గంలో ఆధార్‌కార్డుల జారీ నిదానంగా జరుగుతోంది. దాదాపుగా నా నియోజక వర్గంలో 3,30,000 జనాభా ఉన్నారు. ఇప్పటి వరకు 2,00,000 ఆధార్‌కార్డులు ఇవ్వడం జరిగింది. దాదాపుగా ఇంకా 1,30,000 ఆధార్‌కార్డులు జారీ చేయాల్సి ఉంది. ఆధార్‌కార్డుల జారీ సెంటర్స్‌ను ఇంకా పెంచాల్సి ఉంది. ప్రజలకు అవగాహన లేని కారణంగా వెనుకబడిపోతుంది. దానిపై దృష్టి ఉంచాల్సింది, ఇది ఒక అంశం. కాగా, నిన్న గౌరవ సభ్యులు మాట్లాడుతూ కల్తీ సారా గురించి మాట్లాడారు. నా నియోజకవర్గంలో దాదాపుగా కల్తీ, నాటుసారా తయారీ ఎక్కువుగా ఉంది. నాటు సారా తయారీని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతున్నాను. ఎందుకంటే అక్కడ వాల్మీకిలు ఎక్కువగా ఉన్నారు. వారికి వేరే వృత్తి లేక ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. కాబట్టి వారికి ఏదైనా లోన్స్ ద్వారా ఆర్థిక సహాయం ఇప్పించి వారిని ఆదుకోవాలని నేను కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్ ః మినిష్టర్ గారు.

శ్రీ సిహెచ్.అయ్యన్న పాత్రుడు (నర్సీపట్నం)ః అధ్యక్షా, నోట్ చేసుకోవడం జరిగింది. సంబంధిత మంత్రిగారి దృష్టికి తీసుకువెళ్తాం.

మిస్టర్ స్పీకర్ః నారాయణమూర్తిగారు.

శ్రీ పి.నారాయణమూర్తి(గన్నవరం)ః నాకీ అవకాశం ఇచ్చిన అధ్యక్షులవారికి నమస్కారం. 2012-13వ సంవత్సరంలో అంగన్‌వాడీ వర్కర్లను నియమించడం జరిగింది. కానీ అక్కడ రిజర్వేషన్ పద్ధతిలో మాత్రం జరగలేదు. ఎస్సీ అయితే బీసీ, బీసీ అయితే ఎస్సీ, ఎలాంటి సక్రమమైన పద్ధతిలో ఆనాడు ఆ కార్యక్రమం జరగలేదు. కానీ సంవత్సరం అయిన తర్వాత ఈ అంగన్‌వాడీ వర్కర్లందరినీ కూడా తీసేయమని ప్రభుత్వం నుంచి ఆర్డరు వచ్చిందని, చాలామందిని తీసేయడం జరిగింది. కానీ 360 రోజులూ చేసిన అంగన్ వాడీ వర్కర్లకు మరొక సమయానుకూల పద్ధతిలో గుర్తించి వాళ్లను పర్మినెంట్ చేయమని తమరి ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్ః మినిస్టరు గారూ.

శ్రీమతి పీతల సుజాత (చింతలపూడి)ః అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పిన దానిని నోట్ చేసుకొన్నాను. తప్పకుండా దానికి సంబంధించి ఎంక్వయిరీ వేసి, ప్రభుత్వపరంగా చర్యలు తీసుకొంటాము.

మిస్టర్ స్పీకర్ః శ్యామ్‌సుందర్ శివాజి గారు.

శ్రీ జి. శ్యామ్‌సుందర్ శివాజి (పలాస)ః అధ్యక్షా, నేను ప్రస్తావించబోయే అంశం గౌరవ ఆరోగ్య శాఖామంత్రిగారిది. మా జిల్లాలో పేద ప్రాంతాలలో కిడ్నీ వ్యాధి ఒక మహమ్మారిలాగ వ్యాపించి ఉంది. ప్రతిరోజు పదుల సంఖ్యలో చనిపోతున్నారు. వందల మంది ఈ కిడ్నీ వ్యాధి బారిన పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో అయితే పిల్లలని కూడా ఇవ్వటం లేదు. దానిగురించి ప్రభుత్వం అయితే ఒక డయాలసిస్ సెంటరును అనౌన్స్ చేసింది గాని, దానికి కారణాలను కనుక్కోవటంలో ఇంతవరకు విఫలమయింది. దీనిగురించి ఒక ప్రత్యేక కారణం కనుక్కోవడం మొదటిది.

రెండో విషయం ఏమంటే, ఆ మందులు చాలా ఖరీదైనవి కాబట్టి, తెల్లకార్డు ఉన్న వాళ్లకి, ఆ మందులు ప్రభుత్వం తరపున ఉచితంగా సరఫరా చేయాలని మీద్వారా కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్: మినిస్టరు గారూ.

డా.కామినేని శ్రీనివాస్(కైకలూరు): అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పినట్లు నిజంగా దురదృష్టకరం. ప్రపంచంలోనే హైయస్ట్ ఇన్సిడెంట్స్ ఆఫ్ కిడ్నీ డిసీజెస్ ఆ ఏరియాలో ఉన్నాయి. దాని తర్వాత శ్రీలంక, సౌత్ ఆఫ్రికా వచ్చాయి. తప్పకుండా దానిమీద కారణాలకు ఒక టీమ్‌ను ఏర్పాటుచేసి త్వరలోనే దానిమీద చర్యలు తీసుకొంటాం.

మిస్టర్ స్పీకర్: ప్రతాప్ అప్పారావుగారు.

శ్రీ మేకా వెంకటప్రతాప్ అప్పారావు(నూజివీడు): స్పీకర్ సర్. నాగార్జున సాగర్ వాటర్ నూజివీడు ఏరియాకి సరిగా రావటం లేదు. మాది థర్డ్ జోన్‌లో ఉంది. ఈరోజు డ్యామ్‌లో చూస్తే 570 ఫీట్ల వరకు వాటర్ ఉంది. మా ఏరియాలో చిన్న చిన్న జల్లులు పడ్డాయి. సరైన వానలు లేకపోవడం వలన చెరువులు అన్నీ ఖాళీగా ఉన్నాయి. మేం రిక్వస్ట్ చేసేదేమంటే సెకెండ్ జోన్‌కు, థర్డ్ జోన్‌కు కూడా మొదటి పంటకు నీళ్లు ఇవ్వాలని కోరుతున్నాం. ఎందుకంటే గతంలో కూడా 2004 నుంచి 2009వ సంవత్సరం వరకు నీళ్లు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా కిందటి సంవత్సరం కూడా ఇచ్చారు. ఇప్పుడు వర్షాలు పడి డ్యామ్‌లు అన్నీ నిండాయి కాబట్టి, కొద్దిగా నీళ్లు ఇవ్వమని మేం కోరుతున్నాం.

మిస్టర్ స్పీకర్: మినిస్టరు గారూ.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు(చిలకలూరిపేట): అధ్యక్షా, నోట్ చేసుకున్నాం, సంబంధిత మంత్రిగారి దృష్టికి తీసుకెళ్లి, చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

మిస్టర్ స్పీకర్: సంజీవయ్య గారూ.

శ్రీ కె. సంజీవయ్య (సుళ్ళూరుపేట): అధ్యక్షా, ఈ సభలో మాట్లాడే అవకాశం ఇచ్చిన అధ్యక్షల వారికి, మా అధ్యక్షులు శ్రీ వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిగారికి, నా సుళ్ళూరుపేట నియోజకవర్గ ప్రజలకు, గౌరవ సభ్యులందరికీ కూడా నా నమస్కారాలు. సుళ్ళూరుపేట నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకమైనటువంటి పులికాట్ సరస్సు ఉంది. ఇది సుమారు 60 కిలోమీటర్ల పొడవుతో, 175 కిలోమీటర్ల వైశాల్యంతో విస్తరించి ఉంది. తమిళనాడులో కూడా 60 కిలోమీటర్ల వైశాల్యంతో విస్తరించి ఉంది. తమిళనాడు జాలర్ల కుపాన్లకి, ఆంధ్రా జాలర్ల కుపాన్లకి అక్కడ

సరిహద్దు సమస్య ఉంది. చాలా కాలం నుంచి ఆ సరిహద్దు సమస్య వల్ల తమిళనాడు జాలర్ల కుపానులకి మన ఆంధ్రప్రదేశ్ జాలర్ల కుపానులకి తగాదాలు వస్తూనే ఉన్నాయి. గతంలో శ్రీ సి. పెంచలయ్యగారు ఉన్నప్పుడు ఆ సరిహద్దు సమస్య గురించి, పెద్దలు, అధికారుల ఒప్పందంతో సరిహద్దును ఏర్పాటుచేయడం జరిగింది. అయినప్పటికీ తమిళనాడు జాలర్లు ఆంధ్రప్రదేశ్ హద్దులోకి ప్రవేశించి, మనవాళ్లను అన్యాయంగా ఇబ్బందిపెడుతున్నారు. మొన్న ఏప్రిల్ నెలలో కూడా తమిళనాడు జాలర్లు మనవాళ్లతో తగాదాకు వచ్చి, మన జాలర్లను సుమారు 20 మందిని జైల్లో పెట్టడం జరిగింది. అధికారులైతే సమస్య గురించి మాట్లాడుతున్నారు గానీ, తమిళనాడు ప్రభుత్వం స్పందించటం లేదు. కాబట్టి మన ప్రభుత్వం స్పందించి, ఆ సరిహద్దు సమస్యను తీర్చవలసిన అవసరం ఉంది. ఎందుకంటే సుమారు 4,000 కుటుంబాలు పులికాట్ సరస్సు పైన ఆధారపడి జీవిస్తున్నారు. మొన్న గౌరవ మంత్రిగారు శ్రీ వెంకయ్యనాయుడుగారు సుళ్లూరుపేట నియోజకవర్గానికి వచ్చారు.

మిస్టర్ స్పీకర్: మీరు ఏం చెప్పాలో అది చెప్పండి.. దయచేసి పూర్తి చేయండి.

శ్రీ కె. సంజీవయ్య(సుళ్లూరుపేట): ఆ సరిహద్దు సమస్య తీర్చాలి. కలెక్టరు లెవెల్లో చేస్తుంటే ఆ సరిహద్దు సమస్య తీరటం లేదు. కాబట్టి హై లెవెల్లో గౌరవ మంత్రిగారు జోక్యం చేసుకుని, సమస్యను తీర్చవలసిందిగా మీ ద్వారా మనవి చేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్: మినిస్టరు గారూ.

శ్రీ బొజ్జల గోపాలకృష్ణా రెడ్డి (శ్రీకాళహస్తి): అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పినది నోట్ చేసుకున్నాను. తప్పకుండా చర్యలు తీసుకొంటాం.

మిస్టర్ స్పీకర్: చరితారెడ్డి గారూ.

శ్రీమతి జి. చరితారెడ్డి (పాణ్యం): అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో అవుట్‌సోర్సింగ్ కింద దాదాపు 3,323 మంది పనిచేస్తున్నారు. మా కర్నూలు జిల్లాలో 213 మంది పనిచేస్తున్నారు. వీళ్లలో వర్క్ ఇన్‌స్పెక్టర్లుగా, ఎ.ఈ.లుగా, వివిధ శాఖలలో పనిచేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టరు వీళ్లందరినీ 31.07.2014 వరకే కొనసాగాలని ఆయా జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్లకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. అందువల్ల చాలామంది ఉపాధి కోల్పోయి, రోడ్డున పడ్డారు. బాబు వస్తున్నారు – జాబు వస్తుందని ఎంతోమంది ఆశతో ఎదురుచూశారు. అటువంటి వాళ్లకి ఈరోజు ఉద్యోగాలు పోయి, ఎంతోమంది ఇబ్బంది పడుతున్నారు. వాళ్ల కుటుంబాలు కూడా రోడ్డున పడి, ప్రభుత్వ ఉద్యోగాలు పొందడానికి వాళ్లు వయోపరిమితి అయిపోయి, అర్హత కోల్పోయారు. మేం ఒకటే

కోరుతున్నాం. వాళ్లను యథావిధిగా కొనసాగేలా మళ్లీ చర్యలు తీసుకోవాలని, నాలుగు రోజుల కిందటే ఒక స్టేట్‌మెంట్‌ను కూడా ఇచ్చారు. దాంట్లో 71 మందిని మాత్రమే తీసుకొంటున్నారు. ఇంకా చాలామంది ఎదురుచూస్తున్నారు. కాబట్టి వాళ్లకి ఏదోరకమైన ఉపాధి కల్పించాలని, వాళ్లని యథాతథంగా కొనసాగించేట్లు చర్యలు తీసుకోవల్సిందిగా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్: మినిస్టరు గారూ.

శ్రీమతి పీతల సుజాత (చింతలపూడి): అధ్యక్షా, గౌరవ సభ్యురాలు చెప్పిన దాన్ని నోట్ చేసుకున్నాం, సంబంధిత మంత్రిగారి దృష్టికి తీసుకెళ్తాం.

మిస్టర్ స్పీకర్: రామానాయుడుగారూ.

డా.ఎన్.రామానాయుడు (పాలకొల్లు): అధ్యక్షా, మా పాలకొల్లు నియోజకవర్గంలోని పోడూరు, ఎలమంచిలి మండలాల్లో ప్రతీ సంవత్సరం కూడా నక్కల డ్రెయిన్ పొంగి, ప్రతీ సంవత్సరం ఇంచుమించు పదివేల ఎకరాల పంట నష్టపోవడం జరుగుతుంది. సాధారణంగా డ్రెయిన్స్ అన్నీ కూడా సముద్రంలోకి వెళ్లి కలుస్తూ ఉంటాయి. కానీ ఈ నక్కల డ్రెయిన్ గోదావరి నదిలో కలుస్తూ ఉండటం వలన, గోదావరి నదిలో వరదలు వచ్చినా, లేదా వాటర్ ఎక్కువగా ఉన్నప్పుడు ఆ వాటర్ అంతా కూడా నక్కల డ్రెయిన్‌లో స్టాగ్నేట్ అయిపోయి, ఆ వాటర్ అంతా కూడా ఊళ్ల మీదకి, పొలాల మీదకి ఎదురురావడం వల్ల అక్కడ ప్రతీ సంవత్సరం విపరీతంగా నష్టం జరుగుతుంది. రూ.15 నుంచి 20 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతు నష్టపోతున్నాడు. మళ్లీ ఆ పదివేల ఎకరాలకు మళ్లీ ప్రభుత్వం తరపున ఎకరానికి రూ.4,000 ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి ప్రభుత్వం కూడా నష్టపోతుంది. అన్నిటికీ మించి పంట దిగుబడి అంటే, ధాన్యం ఈల్డింగ్‌ని కూడా నష్టపోతున్నాం. కాబట్టి, దీనికి శాశ్వతమైన పరిష్కారం మీ ద్వారా గౌరవ వ్యవసాయ శాఖామంత్రిగారు చెప్పాలని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్: మినిస్టర్ గారూ.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు(చిలకలూరిపేట): అధ్యక్షా, గౌరవ సభ్యులు రామానాయుడుగారు అడిగినదాన్ని నోట్ చేసుకోవడం జరిగింది. తప్పకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

మిస్టర్ స్పీకర్: శ్రీ కె.రామకృష్ణ గారు.

శ్రీ కె.రామకృష్ణ (వెంకటగిరి)ః మా పార్టీ అధ్యక్షుల వారికి, మా నియోజకవర్గ ప్రజలకు, నాకు అవకాశమిచ్చినందుకు గౌరవ సభాపతి గారికి నా ధన్యవాదాలు. అధ్యక్షా, దరఖాస్తు భూములు, అంటే డి.కె.టి. భూములు, పేద ప్రజలకు అసైన్‌మెంట్ పాలసీ క్రింద మంజూరు చేశారు. వారికి మంజూరు చేసిన భూములు, పేరుకు భూములే గానీ, వాళ్ళ పెళ్ళిళ్ళకి, వాళ్ళ అవసరాలకి అమ్ముకునేందుకు ఎలాంటి హక్కు వాళ్ళకి లేదు. ఆ హక్కు కల్పించవల్సిందిగా గౌరవ మంత్రివర్యులను కోరుతున్నాను.

రెవిన్యూశాఖ నివేదికల ప్రకారం మా నియోజకవర్గంలో గత 50 సంవత్సరాలుగా సాగుచేసుకొనుచున్న కొన్ని వేల ఎకరాల ఇనామ్ భూములున్నాయి. కానీ, వాళ్ళకు పాస్‌బుక్‌లు లేవు. ప్రభుత్వం ఇచ్చే ఎరువులు, లోన్లకు వారు నోచుకోవడంలేదు. అవన్నీ కల్పించాలని గౌరవ మంత్రివర్యులను కోరుతున్నాను.

ఫేర్ అడంగల్ లేక, డైక్లాట్‌లో చుక్కలు పెట్టి ఉన్నారు. ఆ చుక్కలు పెట్టిన భూములు ప్రభుత్వభూములు అని చెప్తున్నారు. ఆ భూములను రైతులు ఎప్పటినుండో సాగుచేసుకుంటున్నారు. వారికి ఇప్పటికీ, ఎలాంటి పాస్‌బుక్‌లు లేవు. అదేవిధంగా, 2004 నుండి గత ప్రభుత్వాలు ఏవిధంగా దోచుకున్నాయో, వీళ్ళు కూడా అదేవిధంగా దోచుకోవడానికి అలవాటు పడ్డారు. ఈ పరిస్థితుల్లో రైతులు ఎక్కడకు పోయినా కూడా వాళ్ళ పనులు జరగడంలేదు.

రెవిన్యూకు సంబంధించిన గ్రామస్థాయి అధికారులు, గ్రామాల్లో నివాసం ఉండకుండా హెడ్‌క్వార్టర్స్‌లో నివాసముంటున్నారు. రికార్డులు కూడా ఎం.ఆర్.ఓ. ఆఫీసుల్లో లేవు. వారి ఇళ్ళలో పెట్టుకుంటున్నారు. దానివల్ల పాస్‌బుక్‌లు కావాలన్నా, పిల్లలకు ఏవైనా సర్టిఫికేట్లు కావాలన్నా, వాళ్ళు పట్టణాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. కాబట్టి, గతంలో ఉన్న విధంగా ఏ గ్రామంలో పనిచేసే అధికారులు, ఆ గ్రామంలోనే నివాసముండేట్లుగా, కార్యాలయాల్లో పనిచేసే అధికారులు కార్యాలయాల్లో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్ఃమినిస్టర్ గారు.

శ్రీ కె.ఈ.కృష్ణమూర్తి (పత్తికొండ)ఃఅధ్యక్షా, సభ్యులు చెప్పిన వివరాలు సేకరించి, తగిన చర్యలు తీసుకుంటాను.

మిస్టర్ స్పీకర్ఃఅనగాని సత్యప్రసాద్ గారు.

శ్రీ అనగాని సత్యప్రసాద్ (రేపల్లె)ః ధన్యవాదాలు అధ్యక్షా. ఈ అంశం ఫిషరీస్‌కు సంబంధించినది. మా నిజాంపట్నం నియోజకవర్గంలో ఉన్న హార్బర్‌లో ఒక సోర్స్ స్టేషన్ ఉండేది. ఈ స్టేషన్, మత్స్యకార సోదరులు వేటకు వెళ్ళినప్పుడు వాళ్ళకేమైనా ఇబ్బంది కలిగినా, వాతావరణ మార్పుల గురించి వాళ్ళకు చెప్పడానికి ఉపయోగపడే ఒక కమ్యూనికేషన్ సిస్టం. అది పడిపోయి నాలుగు నెలలౌతోంది. ఈ విషయాన్ని సంబంధింత కమీషనర్ గారి దృష్టికి కూడా రెండు నెలల క్రితమే తీసుకువెళ్ళడం జరిగింది. కానీ, ఫైల్ ఫైనాన్స్ నుండి రావాలి, కాబట్టి ఇంకా సమయం పడుతుందని చెప్తున్నారు. కానీ, ఇది వందల, వేల మంది ప్రాణాలకు సంబంధించినది కాబట్టి, ఈ విషయాన్ని ఒక డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌గా తీసుకుని సంబంధింత కలెక్టర్లస్థాయిలోనే దీనిని పరిష్కరిస్తే బాగుంటుందని నేను తమద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

శ్రీ సిహెచ్.అయ్యన్న పాత్రుడు (నర్సీపట్నం)ః అధ్యక్షా, నోట్ చేసుకున్నాను. తగుచర్య తీసుకుంటాము.

మిస్టర్ స్పీకర్ః ముస్తఫా గారు.

శ్రీ మొహమ్మద్ ముస్తఫా షేక్ (గుంటూరు ఈస్ట్)ః నమస్కారం. అధ్యక్షా, గుంటూరు పి.ఆర్.గ్రౌండ్స్‌లో పనిచేస్తున్న ముగ్గురు కోచ్‌లకు గత 20 నెలలుగా జీతాలు రావడం లేదు. జిల్లా ప్రాధికార సంస్థకు ఉన్న నిధుల కొరతే దీనికి కారణంగా చెప్తున్నారు. దానివల్ల అప్పటినుండి శిక్షకులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి, తక్షణమే రాష్ట్ర ప్రాధికారసంస్థ నుండి గానీ, జిల్లా క్రీడా ప్రాధికారసంస్థ నుండి గానీ, వాళ్ళకి జీతాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. అదేవిధంగా, ఈ పి.ఆర్.స్టేడియం చాలా పెద్ద స్టేడియం. ఈ స్టేడియానికి నిధులు మంజూరు చేసి, ఇంటర్నేషనల్ స్టేడియంగా మార్చాలని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్ః ఐజయ్య గారు

శ్రీ వై. ఐజయ్య (నందికొట్కూరు)ః నమసారం అధ్యక్షా, ఈ 14 శాసనసభలో నాకు ప్రవేశం కల్పించిన మా నందికొట్కూరు నియోజకవర్గ ప్రజలకు, ముఖ్యంగా మా అధ్యక్షులవారికి, ఈరోజు సభలో మాట్లాడే అవకాశం కల్పించినందుకు గౌరవ సభాపతి గారికి నా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. నేను ప్రాతినిధ్యం వహిస్తున్న నందికొట్కూరు నియోజకవర్గంలోని ప్రజలు ఎక్కువగా వ్యవసాయం పైనే ఆధారపడి ఉన్నారు. మా ప్రాంతంలో వ్యవసాయం కోసమని సుమారు 150 సంవత్సరాల క్రిందట విక్టోరియా మహారాణి గారు కె.సి.కెనాల్ (కడప-కర్నూలు కాలువ)ను త్రవ్వించారు. ఆ కాలువ తుంగభద్ర డ్యామ్, సుంకేశుల నుంచి, కర్నూలు,

అనంతపూర్, కడప మీదుగా సుమారు 305 కి.మీ.మేర ప్రవహిస్తూ, దాదాపుగా రెండు లక్షల ఎకరాలకు సాగునీరునందిస్తోంది. కానీ, కొన్ని సంవత్సరాలుగా రెండు కారులకు (ఖరీఫ్, రబీ పంటలు) నీరు సరిపోనందున, దివంగత ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్.రాజశేఖర రెడ్డిగారు, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి, శంకుస్థాపన కూడా చేశారు. కానీ, ప్రారంభమైన కొద్ది రోజులకే ఆ పనులు ఆగిపోయాయి. ఈ పథకం పూర్తయితే, కె.సి.కెనాల్‌కు 10 టి.ఎం.సి.ల నీళ్ళు వస్తాయి. అప్పుడు రెండు కారుల పంట పండించుకునే అవకాశముంది. రెండు లక్షల ఎకరాల భూమి సాగులోనికి వస్తుంది. కానీ, అక్కడున్న కొందరు బెదిరించడం వల్ల, ఆ కాంట్రాక్టరు పారిపోయాడు. సైలెంట్ బ్లాస్టింగ్ మిషన్‌లు అందుబాటులోకి వచ్చాయి, కాబట్టి, ఆ కాంట్రాక్టరు పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాడు. కాబట్టి, మళ్ళీ టెండర్లు పిలిచి గానీ, లేదా ఆ కాంట్రాక్టరునే పిలిపించి వెంటనే ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించవలసిందిగా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్ః మినిస్టర్ గారు.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు (చిలకలూరిపేట)ః అధ్యక్షా, గౌరవ సభ్యులు చెప్పిన విషయాలను నోట్ చేసుకున్నాను. తప్పకుండా సంబంధిత శాఖా మంత్రివర్యులతో మాట్లాడి, చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

మిస్టర్ స్పీకర్ః రోజా గారు.

శ్రీమతి ఆర్.కె.రోజ (నగరి)ః అధ్యక్షా, పుత్తూరు సి.హెచ్.సి. హాస్పిటల్ గురించి సభ దృష్టికి తీసుకురావలసిన అవసరముంది. ఈ హాస్పిటల్ 1900వ సంవత్సరంలో శ్రీ కృష్ణదాస్, శ్రీ బాలముకుందన్ దాస్ అనేవారు దానం చేయడం వలన ఈ హాస్పిటల్ ఏర్పడింది. ఈ హాస్పిటల్ 1966లో ప్రభుత్వ పరిధిలోనికి వచ్చింది. 114 సంవత్సరాలుగా, పుత్తూరు చుట్టుప్రక్కల 5 మండలాల్లోని ప్రజలకు, రోజుకు 500 నుండి 600 మంది పేషెంట్లకు వైద్యసేవలందించడం జరుగుతోంది. గత 6 సంవత్సరాలుగా ఈ హాస్పిటల్‌కు 'ఎ' గ్రేడ్ కూడా రావడం జరుగుతోంది. ఈరోజు ఆ హాస్పిటల్ ఎప్పుడు పడిపోతుందో తెలియని పరిస్థితి ఉంది. ఈ హాస్పిటల్‌లో కావలసినన్ని రూములు లేవు, కావలసినంతమంది డాక్టర్స్ లేరు, సరిపడినన్ని బెడ్లు లేవు. ముఖ్యంగా, పోస్ట్‌మార్టం చేయడానికి రూమ్, శవాలను భద్రపరచుకోవడానికి మార్చురీ కూడా లేదు. తిరుపతి నుండి చెన్నై వెళ్ళే నేషనల్ హైవేలో హార్ట్ ఆఫ్ ద పుత్తూరులో ఈ హాస్పిటల్ ఉంది. గోవిందపాళెం దగ్గర 3 ఎకరాల స్థలంలో గవర్నమెంట్ క్వార్టర్స్ ఉన్నాయి. ఆ బిల్డింగ్స్ అన్నీ కూడా నివాసానికి యోగ్యంగా లేనందువల్ల వాటిని ఎవ్వరూ ఉపయోగించడంలేదు. కాబట్టి, ఈ స్థలంలో ఈ హాస్పిటల్‌కు బిల్డింగ్‌ను శాంక్షన్ చేసి, కన్‌స్ట్రక్ట్ చేయడం వలన, ఇప్పటికే మంజూరైన 50 పడకల సౌకర్యం కూడా ఈ హాస్పిటల్‌కు కల్పించడానికి వీలై, దురదృష్టవశాత్తు

ప్రమాదానికి గురైన వారికి అత్యవసర సేవలందించగలగడంతోపాటు, పేదప్రజలందరికీ ఉచిత వైద్య సదుపాయాలు అందించడానికి వీలుపడుతుంది. ఈ హాస్పిటల్‌కు గోవిందపాళెం వద్ద కొత్త బిల్డింగ్‌ను నిర్మించి, అవసరమగు సౌకర్యాలు కల్పించే దిశగా తగు చర్యలు తీసుకోవలసిందిగా గౌరవ ఆరోగ్య శాఖామంత్రిగారిని కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్: మినిస్టర్ గారు.

డా. కామినేని శ్రీనివాస్ (కైకలూరు): అధ్యక్షా, ఇప్పుడే మా బి.జె.పి.ఫ్లోర్ లీడర్ గారి ద్వారా నాకు ఈ విషయమై సమాచారమందింది. తప్పకుండా చర్యలు తీసుకుంటాము.

మిస్టర్ స్పీకర్: కొమ్మలపాటి శ్రీధర్ గారు.

శ్రీ కొమ్మలపాటి శ్రీధర్ (పెద్దకూరపాడు): అధ్యక్షా, మాకు అమరావతిలో చాలా ప్రఖ్యాతి గాంచిన రామలింగేశ్వర స్వామి గుడి ఉంది. గుంటూరు నుండి అమరావతికి ఒక రోడ్డు సౌకర్యం కూడా ఉంది. కానీ, ఈ రోడ్డులో ఉన్న లోలెవల్ చప్టాలలో, వర్షాకాలంలో పూర్తి స్థాయిలో నీరు ప్రవహించడం వలన జరిగిన అనేకమైన వాహన ప్రమాదాలలో ప్రాణనష్టం కూడా జరిగింది. గతంలో ఈ పరిస్థితి గురించి ముగ్గురు ముఖ్యమంత్రులకు విన్నవించుకోగా, లోలెవల్ చప్టాలను, హైలెవల్ బ్రిడ్జెస్‌గా మారుస్తామని హామీ కూడా ఇవ్వడం జరిగింది. ఇంతవరకు ఏమీ చేయలేదు. కనీసం ఈ ప్రభుత్వంలోనైనా ఈ లోలెవల్ చప్టాల స్థానంలో హైలెవల్ బ్రిడ్జెస్‌ను నిర్మించడానికి తగు చర్యలు తీసుకోవలసిందిగా గౌరవ ఆర్ & బి మినిస్టర్ గారిని కోరుతున్నాను.

శ్రీ సిద్ధా రాఘవరావు (దర్శి): తప్పకుండా పరిశీలించి చర్యలు తీసుకుంటాము.

మిస్టర్ స్పీకర్: వనమాడి వెంకటేశ్వరరావు.

...

శ్రీ వనమాడి వెంకటేశ్వరరావు (కాకినాడ సిటి): అధ్యక్షా, కాకినాడ ప్రభుత్వ వైద్యశాలలో రోజుకు సుమారు 3,000 మంది రోగులు వస్తుంటారు. 2,000 పడకలున్నాయి, 5,000 మందికి వైద్యం చేస్తారు. ఆ వైద్యశాలలో కార్డియాలజీ డాక్టర్ రిటైర్డ్ అయి ఆరు సంవత్సరాలయ్యింది. అలాగే 15 శాఖలలో 15 మంది డాక్టర్లు రిటైర్డ్ అయ్యారు. ఆ స్థానాల్లో డాక్టర్లను నియమించాలని గత ప్రభుత్వానికి విన్నవించినా నిర్లక్ష్యం వహించారు. గత ప్రభుత్వంలో గిరిజన, వెనుకబడిన ప్రాంతాలలో చికెన్‌గున్యా, డెంగీ వ్యాధులు వచ్చినపుడు కనీసం మందులు కూడా అందించలేని సమయంలో ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా వారికి మందులు అందించి, వైద్యసేవలు అందించిన విధానం ఎంతో ఉపయోగపడింది. అదే విధంగా గిరిజన,

వెనుకబడిన ప్రాంతాలకు ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా వైద్యసేవలు కొనసాగించాలని మీ ద్వారా మంత్రి వర్యులను కోరుతున్నాను.

డా.కామినేని శ్రీనివాస్ (కైకలూరు)ః అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పిన విషయాలు నోట్ చేసుకున్నాం. తప్పకుండా తగు నిర్ణయం తీసుకొని చేస్తాం.

శ్రీ వి.ప్రభాకర్ చౌదరి (అనంతపూరు అర్బన్)ః అధ్యక్షా, వర్షాభావ, సమతౌల్య ఉష్ణోగ్రత పరిస్థితులను బట్టి అనంతపురంలో కొన్ని దశాబ్దాల క్రిందట పోలీస్ ట్రైనింగ్ కాలేజ్(పీటీసి)ను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో కానిస్టేబుల్స్, ఎస్సైలు, ఐపీఎస్‌లు ఈ కాలేజ్‌లో ట్రైనింగ్ అయ్యేవారు. కాలక్రమేణా ఈ కాలేజ్ సిబ్బందిని హైదరాబాదులోని పోలీస్ అకాడమీకి బదిలీ చేయడం జరిగింది. మా జిల్లాలో ప్రభుత్వ భూమి విస్తారంగా ఉంది. పీటీసిని పునరుద్ధరించాల్సిందిగా మీ ద్వారా హోం మంత్రి గారిని ప్రత్యేకంగా అభ్యర్థిస్తున్నాను.

శ్రీ నిమ్మకాయల చిన రాజప్ప (పెద్దాపురం)ః అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పిన విషయాన్ని తప్పకుండా పరిశీలిస్తాం.

శ్రీ అరిమిల్లి రాధాకృష్ణ (తణుకు)ః అధ్యక్షా, నమస్కారం. ఈ రోజు గ్రామ పంచాయితీలలో పారిశుద్ధ్య కార్మికుల సమస్య చాలా ఎక్కువగా ఉంది. చాలా గ్రామాల్లో స్థానిక పంచాయితీలు రోజువారి వేతనాలకు ఒప్పంద కార్మికులను నియమించుకొని పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు. దీని వలన పంచాయితీలపై చాలా ఆర్థికభారం పడుతుంది. మా నియోజకవర్గంలో 48 పంచాయితీలున్నాయి. చాలా గ్రామాలలో రోజువారి పారిశుద్ధ్య పనులు చేపట్టని పరిస్థితి ఉంది. ఇది అంటువ్యాధులు సంక్రమించే కాలం కనుక చికెన్‌గున్యా, డెంగీ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున, గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద పారిశుద్ధ్య పనులు చేపట్టడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాల్సిందిగా మీ ద్వారా సంబంధిత మంత్రి గారిని కోరుతున్నాను.

డా.కామినేని శ్రీనివాస్ (కైకలూరు)ః అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పిన విషయాలు నోట్ చేసుకున్నాం. తప్పకుండా పరిశీలిస్తాం.

శ్రీ పి.డేవిడ్ రాజు (ఎర్రగొండపాలెం)ః అధ్యక్షా, ఈ రాష్ట్రంలోనున్న లక్షలాది దళిత క్రైస్తవుల తరపున ఈ అంశాన్ని ప్రస్తావించదలిచాను. దశాబ్దాల తరబడి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని, దళితులతోపాటు రిజర్వేషన్లు, ప్రభుత్వం తరపున వచ్చే సంక్షేమ పథకాలు అందించాలని వారు కోరుతున్నారు. 5 సంవత్సరాల క్రితం దివంగత ముఖ్యమంత్రి శ్రీ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారు మరణించడానికి రెండు రోజుల ముందు శాసనసభలో దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేయించి కేంద్ర ప్రభుత్వానికి పంపారు. ఆయన

తరువాత వచ్చిన ముఖ్యమంత్రులు ఈ విషయంలో శ్రద్ధ చూపలేదు. ఈ సమస్యను పరిష్కరించడానికి యూపీఏ ప్రభుత్వం కూడా పూర్తి నిర్లక్ష్యం వహించింది.

ఒకే కుటుంబం, ఒకే సామాజిక పరిస్థితులు, ఒకే ఆర్థిక స్థితిగతులు. కానీ కేవలం క్రైస్తవ మతం స్వీకరించినందుకు, చర్చికి వెళుతున్నందుకు రాజ్యాంగపరంగా దళిత క్రైస్తవులకు చాలా అన్యాయం జరుగుతోంది. ఇతర రాష్ట్రాలలో బౌద్ధమతం, సిక్కు మతం స్వీకరించిన దళితులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తున్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రంగనాథ్ మిశ్రా కమీషన్ కూడా దళిత క్రైస్తవులను ఎస్సీలో చేర్చవచ్చని నివేదిక ఇచ్చింది. ఈ సభలో ఉన్న సాంఘిక , సంక్షేమ శాఖా మంత్రి శ్రీ రావెల కిశోర్ బాబు గారు రాష్ట్రంలోనున్న దళిత క్రైస్తవులకు రాజ్యాధికారం రావాలని ఎన్నికలకు ముందు మాట్లాడారు. సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి గారు ముఖ్యమంత్రి గారితో ఈ విషయాన్ని చర్చించి ఒక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించాలని కోరుతున్నాను.

శ్రీ రావెల కిశోర్ బాబు (ప్రత్తిపాడు)ః అధ్యక్షా, గౌరవ శాసనసభ్యుల సూచనను నోట్ చేసుకున్నాం. ఆ విషయాన్ని పరిశీలించి తప్పకుండా చర్యలు తీసుకుంటాము.

శ్రీ జి.జయరాం (ఆలూరు)ః అధ్యక్షా, గతంలో తుంగభద్ర నుంచి ఆలూరు బ్రాంచ్ కెనాల్ (ఎబిసి) ద్వారా మూడు మండలాలకు దాదాపు 15,000 ఎకరాలకు నీరు వచ్చేది. తుంగభద్ర డ్యాంలో పూడిక నిండడం వలన రెండు సంవత్సరాల నుంచి కేవలం 7,000 ఎకరాలకు మాత్రమే నీరు అందుతుంది. కర్నూలు జిల్లాలోని హంద్రీ-నీవా ఆలూరు నియోజకవర్గంనుంచి ప్రవహిస్తుంది. 153 కిలోమీటర్ దగ్గర ఒక తూము ఏర్పాటు చేస్తే 15,000 ఎకరాలకు సాగునీరు అందించడంతోబాటు నాలుగు రిజర్వాయర్లు, రెండు చెరువులు నింపవచ్చు, తద్వారా తాగునీరు అందించడానికి వీలు కలుగుతుంది. దీని ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు (చిలకలూరిపేట)ః అధ్యక్షా, గౌరవ శాసనసభ్యులు చెప్పిన విషయాలు నోట్ చేసుకున్నాం. సంబంధిత శాఖామంత్రి గారికి తెలియజేస్తాం.

శ్రీ జి.వీరాంజనేయులు (ఉంగుటూరు)ః అధ్యక్షా, తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, శ్రీ నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తరువాత రైతు పక్షపాతిగా, వేల కోట్ల రూపాయలు రైతు రుణమాఫీకి కేటాయించినందుకు రైతాంగం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యుల నుంచి సభకు అంతరాయం)

పాస్ పుస్తకాలు ఉన్న రైతులకు మాత్రమే ఈ రుణమాఫీ వర్తిస్తుందని మంత్రి గారు చెప్పారు. నా నియోజకవర్గంలో 150 సంవత్సరాల నుండి అంటే తాతముత్తాతల కాలం నుంచి కొండ్రపోలు, గుమ్మనంపాడు, అంగళూరులోని అగ్రహార భూములను రైతులు సాగుచేస్తున్నారు. ఆ రైతులకు ఆ భూములపై పాస్ పుస్తకాలు లేవు. అడంగళ్‌లపై సన్నకారు రైతులు రుణాలు తీసుకున్నారు. పాస్ పుస్తకాలు లేకున్నా ఈ అగ్రహార భూములు తరతరాలుగా సాగుచేస్తున్న వారందరికీ న్యాయం చేయాలని, రుణమాఫీ వర్తింపచేయాలని కోరుతున్నాను.

గతంలో పాస్ పుస్తకాలపై సర్వే జరిగి ఆగిపోయింది, దానిని పూర్తి చేయించి రైతాంగానికి పాస్ పుస్తకాలు ఇస్తే, బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోడానికి అవకాశముంటుంది. పాస్ పుస్తకాలు లేనందున కొంత మంది రైతులు బ్యాంకుల నుంచి రుణాలు పొందలేకపోతున్నారు. రైతాంగానికి పాస్ పుస్తకాలు ఇప్పించి, రుణమాఫీ వర్తింపచేయాలని రెవెన్యూ మంత్రి గారిని కోరుతున్నాను.

శ్రీ కె.ఈ.కృష్ణమూర్తి (పత్తికొండ)ః అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పిన విషయాలు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

...

శ్రీ పి.విష్ణుకుమార్ రాజు (విశాఖపట్నం నార్త్)ః అధ్యక్షా, రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లున్నారు, విద్యార్థులున్నారు కానీ విద్యార్థులు కూర్చోవడానికి బెంచీలు లేవు. ఎల్‌కెజి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రభుత్వ కళాశాలల్లో బెంచీలు ఎపుడు ఏర్పాటుచేస్తారో మంత్రిగారు చెప్పాలి. అలాగే విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న డాక్టర్లు, నర్సింగ్ సిబ్బందిని ఎప్పటిలోగా భర్తీ చేస్తారు? ఇంతకు ముందే సభలో పైనుంచి ఏవో వస్తువులు పడ్డాయి. వాటిని కూడా వెరిఫై చేయించండని కోరుతున్నాను.

శ్రీ గంటా శ్రీనివాసరావు (భీమిలి)ః అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పిన విషయాలు నోట్ చేసుకున్నాను. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.

శ్రీ పితాని సత్యనారాయణ (ఆచంట)ః అధ్యక్షా, రాష్ట్ర విభజన తర్వాత వచ్చిన అనేక సమస్యలతోబాటు నిన్ననే ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి సంబంధించిన ఒక ప్రధాన సమస్య నా దృష్టికి వచ్చింది. ఆర్టికల్ 370 ప్రకారం రాష్ట్రంలో విభజించకుండా ఉమ్మడిగా ఉంచిన సంస్థలు, విశ్వవిద్యాలయాల వ్యవహారాలలో పర్యవేక్షణ గవర్నర్ గారికి కేంద్ర ప్రభుత్వం అప్పగించింది. కానీ ఇటీవల తెలంగాణ రాష్ట్రం ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయం పేరు మార్చి ఆచార్య జయశంకర్ పేరు పెట్టి వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని కబ్జా చేశారు. వ్యవసాయ

శాఖ మంత్రి గారిని, సంబంధిత అధికారులకు ఈ విషయం తెలుసా? రాష్ట్ర విభజనకు ముందు నియమించిన విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు, రిజిస్ట్రార్ ఇపుడు వారి స్థానాలలో కూర్చోలేని పరిస్థితి రావడంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలదించుకొనే పరిస్థితి వచ్చింది. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి సంబంధింత మంత్రి గారు చర్యలు తీసుకోవాలని మీ ద్వారా కోరుతున్నాను.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు (చిలకలూరిపేట)ః అధ్యక్షా, గౌరవసభ్యులు చెప్పిన విషయం నోట్ చేసుకున్నాను. తప్పకుండా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.

MR.SPEAKER: Now, we will take up Demands for Grants for the year 2014-2015.
Yes, Minister for Municipal Administration

SRI P.NARAYANA, (MINISTER FOR MUNICIPAL ADMINISTRATION AND URBAN DEVELOPMENT) : Sir, with your permission, I beg to move:

"That the Government be granted a sum not exceeding Rs.3134,42,51,000/-under Demand No. XVII (17)- Municipal Administration and Urban Development".

SRI Ch.AYYANNAPATRUDU, (MINISTER FOR PANCHAYAT RAJ AND RURAL WATER SUPPLY, NREGS) : Sir, with your permission, I beg to move:

"That the Government be granted a sum not exceeding Rs.5522,31,91,000/- under Demand No. XXXI (31) – Panchayat Raj"

SMT.P.SUJATHA, MINISTER FOR MINES, WOMEN&CHILD WELFARE (On behalf of Minister for Rural Development, Housing and Sanitations) :Sir, with your permission, I beg to move.:

"That the Government be granted a sum not exceeding Rs.6094,44,34,000/- under Demand No.XXXII (32) – Rural Development".

MR.SPEAKER: Demands moved.

Now, The House is adjourned for tea break for 15 minutes at 11.05 a.m..

(The House then adjourned at 11-05AM)

...

(THE HOUSE RE-ASSEMBLED AT 11-35 IN THE CLOCK OF THE HOUSE WITH HON'BLE SPEAKER IN THE CHAIR)

* * *

MR.SPEAKER: Now discussion on Demands for Agriculture. Now, Alapati Rajendra Prasad garu.

శ్రీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ (తెనాలి)ః అధ్యక్షా, ఈరోజు వ్యవసాయానికి సంబంధించిన పద్దులపై చర్చలో మాట్లాడే అవకాశం నాకు కల్పించినందుకు మీకు ప్రత్యేకమైన ధన్యవాదాలు. రాష్ట్ర విభజన తరవాత తలెత్తిన ప్రత్యేక పరిస్థితుల్లో మన రాష్ట్రాన్ని వ్యవసాయపరంగా మరింత ముందుకు తీసుకెళ్లాలని, మరింత అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి గారు ప్రధానంగా భావిస్తున్నారు. దేశవ్యాప్తంగా మూడింట రెండు వంతుల మంది వ్యవసాయం పైననే ఆధారపడి జీవిస్తున్నారు. అలాంటి వ్యవసాయ రంగం దేశ స్థూలాదాయంలో ప్రధాన భాగస్వామిగా ఉంది. అలాంటి వ్యవసాయరంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి ఈ రాష్ట్రంలో ఒక నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టడం జరిగింది. ప్రత్యేకంగా వ్యవసాయరంగానికి కేటాయించిన బడ్జెట్ చూస్తే నిజంగా ఒక మహోన్నతమైన కార్యానికి శ్రీకారం చుట్టినట్లుగా భావించవచ్చు. 1994 నుంచి 2004 వరకు మన రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉన్నారు. వారు అధికారంలో ఉన్నప్పుడు వారు పడ్డ తపన, ఆయన పడిన వేదన, అప్పటి ప్రతికూల పరిస్థితులను అధిగమించేందుకు చేపట్టిన పారదర్శక విధానాలతో ప్రతి రంగాన్ని ముందుకు తీసుకెళ్లే విధానంలో ఒక ప్రత్యేకమైన పాత్ర పోషించిన నాయకుడు చంద్రబాబునాయుడు గారు. అంతే కాకుండా మరీ ముఖ్యంగా వ్యవసాయం రాష్ట్రాభివృద్ధిలో ఒక ప్రత్యేకమైన పాత్ర పోషించేలా చూసేందుకు, రైతులకు కూడా భద్రత కల్పించేందుకు ఆయన చేసిన కృషిని మనం గమనించాలి. నీటిసంఘాల ఏర్పాటు, మార్కెట్‌యార్డుల విస్తరణ, రైతుబజార్ల స్థాపన, రైతుబంధు పథకాలు లాంటి పలు పథకాలు ప్రవేశపెట్టారు. అంతే కాకుండా ఆ రోజున దాదాపు పది వేల కోట్ల రూపాయల వ్యయంతో 30లక్షల ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత కూడా మా నాయకుడిది, వారి నాయకత్వానిదని మీకు మనవి చేస్తున్నాను.

...

వ్యవసాయానికి ప్రత్యేకమైన బడ్జెట్ ఎందుకు ప్రవేశ పెట్టుకుంటున్నామంటే ఈరోజున వ్యవసాయరంగ ఆధారిత పరిశ్రమలు ఇంకా ఉన్నాయి. యానిమల్ హజ్‌బెండరీ గానీ, పౌల్ట్రీ గానీ, ఫిషరీస్ గానీ వీటన్నింటిని ఒక గొడుకు క్రిందకు తీసుకుని వచ్చి ఒక ప్రత్యేకమైన బడ్జెట్ తీసుకునిరావాలి, ఆ బడ్జెట్ ద్వారా ఈ రాష్ట్రాభివృద్ధి సాధించాలనే ఒక ధృఢ సంకల్పంతో తీసుకున్న నిర్ణయం. గతంలో ఈ రాష్ట్రం అన్నపూర్ణగా పిలువబడ్డ రాష్ట్రం. ఈ రాష్ట్రం దేశ

భాండాగారంగా పిలువబడిన రాష్ట్రం. అంతేకాకుండా జాతీయ అభివృద్ధి మండలికి మన నాయకులు వెళుతుంటే మిగతా నాయకులు కూడా అన్నదాతలు వస్తున్నారని అనుకున్న పరిస్థితి నుంచి ఈ రాష్ట్రం యొక్క ఈనాటి పరిస్థితి చూస్తుంటే చాలా బాధాకరం. ఈనాటి ముఖ్యమంత్రి ప్రతిపక్షనాయకుడిగా ఉన్నప్పుడు ఆయన చేసిన పాదయాత్రల సందర్భంగా అనంతపూర్ జిల్లాలో పాదయాత్ర చేస్తున్నప్పుడు అక్కడ వారు చూపించిన ఆవేదన, అక్కడ ఆకలి చావుల ద్వారా వినిపించిన శోకం, ఆయన హృదయాన్ని ద్రవింపచేసింది. ఆనాటికి రాష్ట్ర విభజన ఇంకా జరగలేదు. ఆనాడు అక్కడ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతీ ఒక్కరూ కన్నీటి పర్యంతమయ్యే పరిస్థితి. అలాంటి పరిస్థితుల్లో ఈ రాష్ట్ర రైతాంగాన్ని కాపాడాలనే ఉద్దేశంతో చంద్రబాబునాయుడుగారు రుణమాఫీ నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఖచ్చితంగా రైతులను ఆదుకోవాలి, రైతుల రుణాలను మాఫీ చేయాలి, రైతులను అన్ని రకాలుగా రక్షించుకోవాలని ఆరోజున నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర విభజన దృష్ట్యా ఈ రాష్ట్రానికి ఆర్థికంగా సహాయం లేకపోయినా కూడా, ఆర్‌బిఐ కొన్ని నిబంధనలు పెట్టినా కూడా వెనక్కు తగ్గకుండా రుణమాఫీ అంశం మీద పరిశీలన చేయమని కోటయ్య కమిటీని వేశారు. కోటయ్యగారు కూడా లక్ష రూపాయల వరకే రుణమాఫీ వర్తించేలా సూచన చేశారు. అయినా రుణమాఫీ హామీలో లోపం జరగకూడదని చంద్రబాబు నాయుడు గారు భావించారు. కాబట్టి వ్యక్తిగతంగా నాకు నష్టమా, లాభమా కాకుండా ఈ రాష్ట్రంలో ఏ రైతు కూడా నష్టపడకూడదనే భావంతో రుణమాఫీ ప్రకటనను మొట్టమొదటిసారిగా ఏరోజైతే ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడానికి నాంది పలికారో అదే రోజున మొదటి ఫైలు మీద రుణమాఫీ పైన సంతకం చేయడమనేది సాహసోపేతమైన నిర్ణయం అని ఈ సందర్భంగా మీద్వారా సభ్యులకు మనవి చేస్తున్నాను. ఎలాంటి పరిస్థితుల్లో రుణమాఫీ ప్రకటన చేశారంటే రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఈనాడు రూ.16,000 కోట్లు లోటు ఉంది. ఎఫ్‌ఆర్‌బిఎం చట్టం ప్రకారం మనకు కొంత అప్పు తెచ్చుకునే అవకాశం కూడా ఉన్నా ఆ అప్పు బడ్జెట్‌లో ఉన్న లోటును పూడ్చేది కాకుండా కేవలం రూ.15,839 కోట్లు మాత్రమే తీసుకోవడానికి అవకాశం ఉంది. అంత కంటే గరిష్ట అప్పు వేరే రకంగా తీసుకోవడానికి రూ.25,000 కోట్లు మాత్రమే ఉంది. అంటే దాదాపు రూ.37,900 కోట్లు మాత్రమే అప్పు తీసుకోవడానికి ఆస్కారం ఉంది. ఈరోజున ఒక్కొక్క రైతుకి రూ.1,50,000/- రుణమాఫీ ఏరకంగానైతే ప్రకటించారో దానికి కట్టుబడి ఉండి ఇవాళ మొత్తం రుణమాఫీని చేయడానికి ఈ ప్రభుత్వం నడుం బిగించిందని తెలియచేస్తున్నాను. రైతు రుణమాఫీ వలన రూ.30,000 కోట్ల నుంచి రూ.35,000 కోట్ల వరకు, డ్వాక్రా రుణాల వలన రూ.7500 కోట్లు, ఎస్సీల రుణమాఫీ వలన రూ.600 కోట్లు భారం ఈనాడు ప్రభుత్వం మీద పడే అవకాశం ఉంది. అయినా సరే ఈ రాష్ట్ర రైతాంగాన్ని కాపాడాలి, రైతులు ఆకలితో అలమటించకుండా, ఆత్మహత్యలకు పాల్పడకుండా ఉండాలి. ఈ రాష్ట్రం అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలి, రాష్ట్ర అప్పులు ఊబిలో ఉన్నప్పుడు కూడా రైతులను కాపాడగలగాలి అని చంద్రబాబు నాయుడు గారు భావించారు. ఆంగ్లంలో ఒక సామెత ఉంది. When Agriculture survives then only India survives. రైతు బాగుంటేనే ఈ రాష్ట్రం బాగుంటుంది. రైతు

రాజుగా ఉండాలంటే మనం కొన్ని నిర్ణయాలు తీసుకోక తప్పదనే ఉద్దేశంతో ఈ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని మనవి చేస్తున్నాను.

ఈనాడు రుణమాఫీ నిర్ణయాన్ని అన్ని రాజకీయ పార్టీలు, అన్ని రైతు సంఘాలు ఆహ్వానించాయి. రుణమాఫీ చేయాల్సిన పరిస్థితి ఉందని చెప్పాయి. గతంలో స్వామినాథన్ కమీషన్ వేశారు, జయతీ ఘోష్ కమీషన్ వేశారు. ప్రజా సంఘాలు ఆనాడు జస్టిస్ పి.ఎ.చౌదరి గారిని ఆహ్వానించి ఆయన ద్వారా ఒక కమీషన్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. ఆ కమిటీలన్నీ ముక్తకంఠంతో రైతులను ఆదుకోవాలి, రైతులకు ఏ విధంగా వీలైతే ఆ విధంగా సబ్సిడీలు ఇవ్వాలని చెప్పిన పరిస్థితులను మనమందరం గమనంలోకి తీసుకోవాలి. పెట్టుబడులు ఎక్కువైపోతున్నాయి, ఆదాయం తగ్గిపోతున్నది. వాళ్లకు సరైన గిట్టుబాటు ధర రావడం లేదు. అందుకే ఈనాడు రైతు ఆత్మహత్యలు ఏ రాష్ట్రంలో లేకపోయినా ఈ రాష్ట్రంలో ఉన్నాయని ఘంటాపథంగా చెప్పినా కూడా ఆ కమిటీ రిపోర్టులను పక్కన బెట్టిన విధానాన్ని మనం గత ప్రభుత్వాల్లో చూశాం. ఆఖరుకి ఆ ప్రభుత్వంలోని మంత్రివర్గంలో ఉన్న కోనేరు రంగారావుగారు కమిటీ ద్వారా స్వయంగా కొన్ని సిఫారసులు చేసినా వాటిని కూడా బుట్టదాఖలు చేసిన ప్రభుత్వమేదైనా ఉందంటే ఆనాటి రాజశేఖర్ రెడ్డి గారి ప్రభుత్వమే అని చెప్పక తప్పదని మనవి చేస్తున్నాను. ఆనాడున్న దళితుల కష్టాలను, నష్టాలను వారు పడే ఆవేదనకు సంబంధించి ఆ కమిటీ సూచన చేసినా కూడా వాటన్నింటినీ తృణప్రాయంగా తీసివేసిన ప్రభుత్వమేదైనా ఉందంటే ఆనాటి రాజశేఖర్ రెడ్డి గారి ప్రభుత్వమే అని చెప్పక తప్పదు. ఆనాడు యుపిఎ ప్రభుత్వం రుణమాఫీ ద్వారా రూ.56,000 కోట్లు సహాయం చేసింది. తద్వారా ఒక్కొక్క రైతుకు రూ.5000/- రుణమాఫీ వర్తింప చేస్తే ఆ రుణమాఫీ లో కూడా మైక్రో ఫైనాన్స్ సంస్థకు చెందిన రుణాలను మాఫీ చేశారని నేను చెప్పడం లేదు కాగ్ వెల్లడించింది. అలాంటి మోసం కూడా ఈ రాష్ట్రంలో జరిగిందని చెప్పడానికి నేను ఒక రైతు బిడ్డగా సిగ్గుపడుతున్నాను. ఎన్నికల మేనిఫెస్టోలో మేము ఆరోజున రైతు రుణమాఫీ చేస్తామని చెప్పాము. కానీ ఈనాడు వైఎస్ఆర్‌సీపీ పార్టీ మాత్రం ఎన్నికల్లో.....

(వైఎస్ఆర్‌సీపీ సభ్యులచే అంతరాయం)

(వైఎస్ఆర్‌సీపీ సభ్యుల నుద్దేశించి) నేను ఎవర్నీ విమర్శించడం లేదు. మిమ్మల్ని విమర్శించినప్పుడు మీరు లేచి మాట్లాడండి. ఆ విమర్శ సద్విమర్శో కాదో మీ చేత చెప్పిస్తాను. అధ్యక్షా, నేను మాట్లాడేటప్పుడు వారిని సైలెంట్‌గా ఉండమని చెప్పండి. వాళ్లు మాట్లాడాలనుకుంటే నేను కూర్చుంటాను, ఆ తరువాత మాట్లాడమని చెప్పండి. ఎందుకంటే అది మంచి సంప్రదాయం కాదు. నేను రెండుసార్లు శాసన సభ్యుడిగా ఎన్నికయ్యాను. నెహ్రూ గారు మీరు కూడా ఉన్నారు. ఎప్పుడూ కూడా ఇలాంటి సంప్రదాయం ఏ సభలోనూ జరగలేదు. కానీ మొట్టమొదటి సారిగా సాంప్రదాయాలకు విరుద్ధంగా ఆ సభ్యులు ఎందుకు నడుస్తున్నారో నాకు తెలియదు గానీ ఒక వ్యక్తి మాట్లాడుతుంటే ఎదురుగా వచ్చి నిల్చొని సభా

సాంప్రదాయాలకు, విలువలకు నీళ్లు వదిలి మీరు మాట్లాడుతుంటే ప్రజలు గమనిస్తున్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవలసిన అవసరం ఉందని మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, ఆరోజున రుణమాఫీ గురించి పార్టీ ప్రకటించినప్పుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారు రుణమాఫీ ఎట్లా అమలు చేస్తారని చెప్పారు. విజయమ్మ గారు కూడా వీధి వీధినా తిరుగుతూ అది వీలు కాదని చెప్పారు. ఆఖరుకి షర్మిల గారు కూడా చెప్పారు. వాళ్లందరూ ఈరోజున కనబడడం లేదు. రుణమాఫీ ప్రకటించిన తరువాత కూడా, రుణమాఫీ అమలు చేస్తామని చెప్పిన తరువాత కూడా ఎలాంటి పరిస్థితుల్లో ఈ ప్రభుత్వం వెనక్కు వెళ్లదని చెప్పినా కూడా వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారు మాత్రం పేపర్లు తీసుకొని ఎకనమిక్ టైమ్స్ ఈ విధంగా ఉంది, ఈ రిపోర్టులు ఈ విధంగా చెబుతున్నాయి, ఈ రకంగా బడ్జెట్‌లో లోటుంది మీకు డబ్బులు ఎక్కడ నుంచి వస్తాయి, మీరు ఎందుకిస్తారు? అంటూ సిరి వస్తుంటే మోకాలడ్డుతున్నారని ప్రజలు అనుకుంటున్నారనే విషయాన్ని గమనించాల్సిన అవసరం ఉందని మనవి చేస్తున్నాను.

...

ఈరోజున రైతుకు న్యాయం చేయాలని ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే, నైతిక అన్యాయం చేసే ప్రయత్నానికి వీరు నాంది పలుకుతున్నారంటే, వీళ్లు రాజకీయ విలువలను ఏ విధంగా కొనసాగించబోతున్నారని ఈ సభ ద్వారా వారిని అడుగుతున్నాను. అంతేకాదు వీళ్లు పరిపాలించారు. నేను వేరే విధంగా విమర్శించడం లేదు. కానీ ఆనాడు రాజశేఖరరెడ్డి గారు బ్రతికున్నప్పుడు, ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ రాష్ట్రంలో మొట్టమొదటిసారి రైతు రోడ్డెక్కిన పరిస్థితి వచ్చింది. ఒక బస్తా ఎరువు కోసం క్యూలో నిలబడి లాఠీ దెబ్బలుతిన్న విధానాన్ని మర్చిపోవద్దని మీ అందరికీ గుర్తు చేస్తున్నాను. ఎందుకు చెబుతున్నానంటే ఆరోజున కృత్రిమ కొరతను సృష్టించారు. స్వయంగా రాజశేఖరరెడ్డి గారి కుటుంబమే కృత్రిమ ఎరువుల తయారీలో పాల్గొన్నారు. ఆ రోజున మేయర్‌గా ఎవరున్నారో నాకు తెలియదు. ఆనాటి రవీంద్రనాథ్‌రెడ్డి గారు ఈనాటి శాసనసభ్యుడో కాదో నాకు తెలియదు. కానీ ఆనాడు రవీంద్రనాథ్‌రెడ్డిగారు కృత్రిమ ఎరువులను తయారు చేయడంలో పాలుపంచుకున్న విధానం, కేసులు పెట్టిన విధానాన్ని ఒక్కసారి గుర్తు చేస్తున్నాను. ఎందుకు ఈ విషయాన్ని చెబుతున్నానంటే, ఆ రోజున ప్రతి జిల్లాలో కూడా ఎక్కడ ఎరువులు కావాల్సి వచ్చినా అక్కడ కృత్రిమ డిమాండ్‌ను క్రియేట్ చేసి, ఎరువుల కొరతను సృష్టించి, కేవలం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఇళ్లల్లోనూ, కాంగ్రెస్ పార్టీ నాయకుల ఇళ్లల్లోనూ ఎరువుల బస్తాలను నింపుకున్నారు.

(అంతరాయం)

శ్రీ పి.రవీంద్రనాథ్‌రెడ్డి (కమలాపురం)ః అధ్యక్షా, అన్యాయంగా రాజేంద్రప్రసాద్ గారు నా పేరును తీసుకొచ్చి హౌసులో మాట్లాడటం చాలా దారుణం. ఎందుకంటే మాకు సంబంధించిన

ఎంపికే ఎరువులు అనేవి గతంలో తయారు చేసే వాళ్లం. రాజశేఖరరెడ్డి గారు మరణించిన తర్వాత రోశయ్య గారి ప్రభుత్వ హయాంలో అదే పనిగా నన్ను కేసుల్లో ఇరికించాలన్న ఉద్దేశంతో ఆ విధంగా ప్రవర్తించడం జరిగింది. మా బ్రాండుకు సంబంధించి రాష్ట్రంలో ఎక్కడైనా అటువంటి పరిస్థితి లేదు. అన్నిచోట్ల మంచి బ్రాండని చెప్పే పరిస్థితి ఉందని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

శ్రీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ (తెనాలి)ః గౌరవ సభ్యులు రవీంద్రనాథ్ గారికి ఒక్క విషయాన్ని తమరి ద్వారా నేను మనవిచేయదల్చుకున్నాను. పుంకానుపుంకలుగా అన్ని దిన పత్రికల్లో, అన్ని టీవీల్లో ఈ న్యూస్ వచ్చింది. ఆరోజు ముఖ్యమంత్రిగా ఎవరు ఉన్నారు? మేము లేమే, మీ బావగారు ముఖ్యమంత్రిగా ఉన్నారు, తర్వాత రోశయ్య గారు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఎరువుల కొరత వచ్చినప్పుడు ఆనాడు ప్రిన్సిపల్ సెక్రటరీగా రేచల్ చటర్జీగారు ఉన్నారు. వారు ఒక పెద్ద రిపోర్టును తయారు చేసి ఆనాటి ప్రభుత్వానికి సమర్పించడం జరిగింది. ఇదంతా కాంగ్రెస్ కార్యకర్తలు, కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ ఎంపీలు కలిసి కృత్రిమ కొరతను సృష్టించడానికి, ఈ రాష్ట్రంలోని రైతులు బాధపడుతున్నారని చెప్పే విషయంలో నేను చెప్పలేదు, ఆ రిపోర్టును వాళ్లందరి సమక్షంలో ఒక్కసారి ఓపెన్ చేస్తే ఈనాడు వాస్తవాలు బయటపడతాయి. ఆనాడు రవీంద్రనాథ్‌రెడ్డి గారు దాంట్లో ఉన్నారనేది నేను చెప్పడంలేదు. దిన పత్రికలు ప్రకటించాయి, టీవీల్లో చెప్పారు, వారి ఫ్యాక్టరీలను సీజ్ చేయడం జరిగింది, ఎంక్వైరీ చేయడం జరిగింది. ఇవన్నీ ఉన్నాయి కాబట్టి ఈనాడు మీ పేరును ఉచ్చరించడం జరిగింది. ముద్దాయా కాదా అనే విషయాలను నేను మాట్లాడటం లేదు. ఆరోజున మీ పాత్ర ఉందని దినపత్రికల ద్వారా తెలిసింది కాబట్టి ఈనాడు వారి గురించి మాట్లాడాల్సి వచ్చింది.

MR.SPEAKER: No personal allegations please.

శ్రీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ (తెనాలి)ః నేను పర్సనల్ ఎలిగేషన్స్ చేయడం లేదు. ఇవాళ్ల రైతుల యొక్క క్షోభను, రైతుల యొక్క ఆవేదనను తమరి ద్వారా తెలియజేస్తున్నాను. వీళ్ల ప్రభుత్వ హయాంలో రైతులు ఏ విధంగా రోడ్ల మీదకొచ్చి లాఠీ దెబ్బలు తిన్నారనే విషయాన్ని చెప్పే ప్రయత్నం చేస్తున్నాను తప్ప వ్యక్తిగతంగా ఎవరినీ విమర్శించడానికి నేను ప్రయత్నం చేయడం లేదు. ఒక్క విషయాన్ని మీరు గమనించాలి. స్వర్గీయ శ్రీ వై.ఎస్.రాజశేఖరరెడ్డి గారు ముఖ్యమంత్రి కాకముందు వారు మా ప్రాంతంలో పర్యటించారు. పర్యటించినప్పుడు రెండు పంటలకు నీళ్లిస్తాం, రెండు ఓట్లను వేయండి, ఈ యొక్క డెల్టా ప్రాంతాన్ని కాపాడతాము, డెల్టాలో రెండు పంటలకు నీళ్లిస్తానని చెప్పిన పెద్ద మనిషి ముఖ్యమంత్రి అయిన తర్వాత, కనీసం ఒక్క పంటకు కూడా నీళ్లివ్వని పరిస్థితి ఉంది. ఆనాడు ఉన్న నియమనిబంధనలకు వ్యతిరేకంగా సిడబ్ల్యుసి పర్మిషన్ లేకపోయినా పోతిరెడ్డిపాడు హెడ్‌ని నిర్మించడం జరిగింది.

(అంతరాయం)

ఒక్క నిమిషం నెహ్రూ గారు.. ఆనాడు పోతిరెడ్డిపాడు హెడ్‌ని నిర్మించిన తర్వాత, నిన్నగాక మొన్న మన ఇరిగేషన్ శాఖామంత్రి గారు మాట్లాడుతూ, ఆ పోతిరెడ్డిపాడు హెడ్‌ని నిర్మించే విధానంలో కనీసం 10 వేల క్యూసెక్కుల నీళ్లు కూడా వెళ్లలేని విధంగా నిర్మాణం జరిగిందంటే, నియమాలకు వ్యతిరేకంగా నిర్మాణం జరిగినా కూడా, ఈరోజు అక్కడ ఉన్న రైతులకు ఉపయోగపడని విధంగా పోతిరెడ్డిపాడు హెడ్‌ని నిర్మించారంటే, ఎలాంటి పరిస్థితుల ద్వారా జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం జరిగిందో, ఆనాడు 86 ప్రాజెక్టులను రూ.186 లక్షల కోట్ల వ్యయంతో నిర్మించాలని ప్రయత్నం చేస్తే, ఏ విధంగా జరిగింది? రూ.90 వేల కోట్లను ఆనాడు అడ్వాన్స్‌లుగా తీసుకుంటే సగానికి పైగా అవినీతిమయమైన విషయాన్ని మీ దృష్టికి తీసుకొస్తున్నాను. ఈ రకమైన ప్రభుత్వాల వల్ల రైతులకు ఏ విధంగా న్యాయం జరుగుతుంది.

మిస్టర్ స్పీకర్ ः రాజేంద్రప్రసాద్ గారు మీరు ఇరిగేషన్ అంశంలోకి వెళుతున్నారు.

శ్రీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ (తెనాలి)ः అధ్యక్ష, నేను ఇరిగేషన్ అంశంలోకి వెళ్లడం లేదు. I am just clarifying. వ్యవసాయానికి సంబంధించిన అంశంలో, వ్యవసాయానికి ప్రధానంగా నీరు కావాలి, అటువంటి నీటిని వీళ్లు ఏ విధంగా దుర్వినియోగం చేశారు, ఏ విధంగా హక్కులను కాలరాసారు, ఏ విధంగా ఈనాడు వ్యవసాయం సంక్షోభంలో పడిపోయింది అనే విషయాలను చెప్పడానికి నేను ప్రయత్నం చేస్తున్నాను. It is my clarification to that extent necessary. ఎందుకంటే, ఆరోజున ఆయన హరిత విప్లవాన్ని తీసుకొస్తానన్నారు, హరితాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని నిర్మిస్తానన్నారు, ఈ రాష్ట్రంలో ఏ ఒక్క ఆత్మహత్య కూడా జరగడానికి వీల్లేదు, నా ప్రభుత్వం రాబోతుంది, ఇందిరమ్మ ప్రభుత్వం రాబోతుంది, ఇంటింట వెలుగులతో నింపుతాను అన్నారు. కానీ ఆనాడు మేము అధికారంలో ఉన్నప్పటికంటే గత ప్రభుత్వంలో జరిగిన ఆత్మహత్యలు అయిదు రెట్లు ఉన్నాయి.

దేశం మొత్తంలో 1,66,000 ఆత్మహత్యలు జరుగగా, కేవలం ఆంధ్రప్రదేశ్‌లోనే 36,000 మంది ఆత్మహత్యలు చేసుకొని చనిపోయారు. ఈ ఆత్మహత్యలకు వీళ్లు ఏ విధంగా కారణమంటే, వీళ్లు తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల, వారు ఎలాంటి నిర్ణయాలను తీసుకున్నారంటే, ఎక్కడా ఏ పంట కూడా పండేది లేకుండా మోనో క్రాప్, ఒకే పంట పండే విధానంలో కూడా వీళ్లు సరిగ్గా సహాయం చేయకపోవడం మనందరికీ తెలిసిన విషయం. వరి ప్రాంతం ఎక్కడ, ప్రత్తి ప్రాంతం ఎక్కడ, మిర్చి ఎక్కడ పండుతుంది, ప్రొద్దుతిరుగుడు ఎక్కడ పండుతుంది, వేరుసెనగ పంట ఎక్కడ పండుతుంది అనేది తెలిసినా కూడా ఆ ప్రాంతాలన్నింటికీ కల్తీ విత్తనాలను, కల్తీ ఎరువులను, ప్రకృతి ఒకవైపు అనుకూలించకపోతే మరో

ప్రక్కన ప్రభుత్వాలే స్వయంగా రైతులను నష్టపరచే విధంగా ఆనాడు పాలకులు పాలించారనేది చెప్పడానికే నా ప్రయత్నం. ఇది వాస్తవమో కాదో వారు ఆలోచన చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఏ నష్టం జరగకపోతే, ఏ ప్రమాదం సంభవించకపోతే, ఏ రైతు ఆత్మహత్య చేసుకోకపోతే, ఈరోజు రాష్ట్రంలో ఉన్న రైతుల యొక్క ఆక్రందనను, ఆవేశాన్ని, ఆలోచనను మీరు గమనించారా అని అడుగుతున్నాను. ఈరోజున రైతు నష్టపోలేదంటే, ఒక్కొక్క రైతుకు లక్షా యాభైవేల రూపాయల రుణమాఫీ చేస్తామని మేము చేసిన ప్రకటనను మీరు ఒప్పుకుంటున్నారా లేదా అని మిమ్మల్ని అడుగుతున్నాను. ఎందుకంటే, గత 10 సంవత్సరాల కాలంలో రైతులకు మీరు అన్యాయం చేయలేదని చెప్పే ప్రయత్నం చేసినట్లయితే ఈ సందర్భంగా తమరి ద్వారా నేను అడుగుతున్నాను, ఏ నష్టము జరగకపోతే, రాష్ట్రంలో ఏ ఒక్క రైతు ఆత్మహత్య కూడా జరగలేదని మీరు భావిస్తే, ఇవాళ్ల రుణమాఫీ అవసరం ఉందా లేదా చెప్పాల్సిందిగా కోరుతున్నాను.

గత వారం రోజుల నుండి నేను గమనిస్తున్నాను, కుంటిసాకులు చెబుతున్నారు. ప్రతి విషయంలో కూడా చంద్రబాబు నాయుడు గారిని విమర్శించే వాళ్లు. చనిపోయిన రాజశేఖరరెడ్డి గారిని విమర్శిస్తున్నారని గౌరవ సభ్యులు చాలాసార్లు బాధపడ్డారు. కానీ గత 10 సంవత్సరాల కాలంలో పొరపాటున రోడ్డు మీద కుక్క చనిపోయినా దానికి కారణం చంద్రబాబు నాయుడు గారు అనే విధంగా మాట్లాడారు. అది నిజమో కాదో దిన పత్రికలను చూసినా మీకు తెలుస్తుంది. ప్రతి అంశంలో కూడా ఏ అంశాన్ని చూసినా, వారు 10 సంవత్సరాల పాటు పరిపాలించారు, ముగ్గురు ముఖ్యమంత్రులు మారారు, వారు ప్రతిదానికి చంద్రబాబు నాయుడే కారణమని చెప్పడానికి వెనుకాడలేదంటే ఎలాంటి రాజకీయ ప్రవృత్తి కలిగిన వ్యక్తులో, రాజకీయ విలువలకు ఎలా తిలోధకాలను ఇచ్చారో ఈ సందర్భంగా మీకు మనవి చేస్తున్నాను. ఇది వాస్తవం కాదు. ప్రతిపక్షం ఆలోచన చేసుకోవాల్సిన సందర్భముందనే విషయాన్ని తమరి ద్వారా మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, ఈనాటి బడ్జెట్ కేటాయింపుల గురించి కూడా ఒకసారి ఆలోచన చేయాల్సిన అవసరముంది. ఈ ప్రభుత్వం ఏ రకంగా ప్రజాసమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందో తెలియజెప్పాల్సిన అవసరముంది. ఈ ప్రభుత్వం రైతు ప్రభుత్వం. It is need of ours. అందరూ గుర్తుంచుకోవాల్సిన అంశం ఒకటుంది. ఈరోజున రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 96.27 శాతం మంది రైతులు బ్యాంకుల నుండి తీసుకున్న ఋణాలన్ని "రుణ మాఫీ" పథకం ద్వారా మాఫీ అవుతాయి. మిగితా 3.73 శాతం మంది రైతులకు కూడా ఒక లక్ష యాభై వేల రుణ పరిమితి సౌకర్యం దొరికింది. త్వరలో రుణవిముక్తులౌతారు కూడా. 2014, మార్చి 31వ తారీఖు వరకు బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలను చెల్లించిన వారికి, చెల్లించని వారికి రుణ మాఫీ వర్తించే విధంగా ప్రభుత్వం ఈనాడు సాహసోపేత నిర్ణయాన్ని తీసుకుంది. ఒక్కో కుటుంబంలో రెండేసి బ్యాంకు ఖాతాలుంటే, రెండు ఖాతాలకు కలిపి ఒక లక్ష యాభై వేల పరిమితి వరకు లబ్ధి చేకూర్చేవిధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎక్కడైనా కౌలురైతు

బంగారం తాకట్టుపెట్టి ఋణం తీసుకుంటే, అదే పొలంపైన రైతు కూడా తీసుకుంటే తొలి ప్రాధాన్యం కౌలు రైతుకిచ్చి ఒక లక్ష యాభై వేల రుణ పరిమితికి లోబడి రుణ మాఫీ చేయడం జరుగుతుంది. ఈరోజున ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చాలా గొప్పది. ఎందుకంటే ఈరోజు రైతు - కౌలు రైతు, వీళ్లిద్దరు సమాజంలో కాడి క్రింద ఉండే రెండు ఎద్దుల లాగ పనిచేసే వ్యక్తులు. రైతు, రైతు కూలీని సమానంగా చూడాల్సిన అవసరముంది. మరీ ముఖ్యంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈనాడు ఉన్న కౌలు రైతులందరూ వెనుకబడిన వర్గాలకు చెందినవారే. కౌలు రైతుల్లో ఎస్సీ, ఎస్టీ, గిరిజన, బడుగు, బలహీన వర్గాలకు చె ందివారున్నారు. వీళ్లందరిని ఆర్థికంగా కాపాడడానికి తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం ధృడనిశ్చయంతో ఉందనడానికి తార్కాణం ఈరోజున ఒకే కుటుంబంలోని రైతు సోదరులు ఒకే పొలం మీద రెండు రుణాలను బ్యాంకుల నుండి తీసుకుంటే, ఆ పొలానికి సంబంధించిన కౌలు రైతు ఎవరైతే ఉన్నాడో, ఆ కౌలు రైతుకు రుణమాఫీ వర్తించదని చెప్పేదాంట్లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మనమందరం హర్షించాలని ఈ సందర్భంగా నేను సభకు మనవి చేసుకుంటున్నాను.

అధ్యక్షా, డ్వాక్రా మహిళా సంఘాలు బ్యాంకుల నుండి తీసుకున్న లక్ష రూపాయల లోపు వరకు ఋణాలను మాఫీ చేస్తామని ప్రభుత్వం ఎన్నికలకు ముందు మేనిఫెస్టోలో పెట్టి, అధికారంలోకి వచ్చాక ఆ మాటకు కట్టబడి ఉంది. ఒక్కో డ్వాక్రా గ్రూప్‌కు లక్ష రూపాయల చొప్పున దాదాపు రూ.7,600.00 కోట్ల రుణ మాఫీ వర్తించే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. చాలామంది రైతులు, డ్వాక్రా గ్రూపులు రుణ మాఫీ ద్వారా ఉపశమనం పొందారు. తద్వారా రాష్ట్ర మంతటా రైతాంగం, డ్వాక్రా మహిళా సంఘాలు సంతోషపడుతుంటే, "మేం మాత్రం మారం, మా పరిస్థితి మాత్రం మారదు, "మేం పట్టిన కుందేలుకు మూడే కాళ్లని"" చెప్పి రోజూ జపం చేసే విధానాన్ని మీరే స్వయంగా చూస్తున్నారు.

అధ్యక్షా, తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం వ్యవసాయరంగంలో ఏరకమైన అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలనుకుంటుందో ఈ సభ ద్వారా ప్రజానీకానికి తెలియజేయాలని నేను భావిస్తున్నాను. భారత దేశంలో సర్వీస్ సెక్టార్ మరియు ఇండస్ట్రీ సెక్టార్ గ్రోత్ ఏ విధంగా ఉందో, దానికి తీసిపోని విధంగా వ్యవసాయరంగాన్ని ముందుకు నడిపించాలనే నేపథ్యంలో భాగంగానే రాష్ట్రంలో ప్రత్యేకంగా "వ్యవసాయ బడ్జెట్" ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. గతాన్ని మనం ఒకసారి తిరిగేస్తే యుగయుగాల నుంచి కూడా ఈ భారతదేశ ప్రజలు అధికంగా వ్యవసాయం పైన ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. మనకు స్వాతంత్ర్యం రాక మునుపటి రోజుల గురించి ఆలోచించాల్సి ఉంది. 1900-1947 మధ్య కాలంలో Growth rate is only one percent. 1947-1960s వరకు తీసుకున్నా కూడా పెద్దగా గ్రోత్ ఏమి కనబడలేదు. అయితే ఆనాడు పాలకులు ఈ విషయాన్ని గుర్తించారు. స్వాతంత్ర్యఫలాలు పొందాలన్నా, దేశ సుస్థిరత కొనసాగాలన్నా, మనకు ఆహార భద్రత కావాలన్నా కచ్చితంగా మనం ప్రత్యామ్నాయాన్ని ఆలోచించాలనే ఉద్దేశంతో ఆనాడు పాలకులు వ్యవహరించారు. They have started the

Green Revolution in Punjab State. మన రాష్ట్రానికి late 1960s-1970s లో హరిత విప్లవం వచ్చింది. ఆనాటి నుంచి రాష్ట్రం చక్కగా అభివృద్ధి జరుగుతున్న సమయంలో మళ్లీ ఆనాడు నాబార్డ్ (NABARD) ఏర్పాటైంది. ఈ సందర్భంగా నాబార్డ్ పాత్రను కూడా మనం ప్రస్తావించుకోవాలి. మన రాష్ట్రంలో నాబార్డ్ వ్యవసాయాభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలను అమలుచేయడం జరిగింది. ఆ సమయంలో మన దురదృష్టమేమిటంటే, నాబార్డ్ నుంచి ఒక సభ్యుడు కూడా ప్రాతినిథ్యం వహించడానికి అవకాశం కల్పించకుండా ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో జాతీయ అభివృద్ధి మండలి కమీషన్‌ను ఏర్పాటుచేసింది. ఎంత దుర్మార్గమైన పని? ఆరోజున స్వామినాథన్ కమీషన్‌ను మనం వేయలేదు. అదే విధంగా జయతీఘోష్ కమీషన్. రెండు వ్యవసాయ కమీషన్లు కేంద్ర ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేసింది. మనం పెట్టే పెట్టుబడికి ఒకటిన్నర రెట్లు కృషిచేసి అభివృద్ధి చేసుకున్నట్లైతే రైతు బాగుపడతాడనే విషయాన్ని సదరు కమీషన్లు చెప్పడం జరిగింది. కమీషన్లు చెప్పిన ఒక సూచనను కూడా పరిగణనలోకి తీసుకోకుండా వ్యవహరించిన మూలానే గత పది సంవత్సరాల కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో రైతు నష్టానికి గురికావడం జరిగింది. ఏనాడూ రైతుకు లాభసాటి కల్గే విధంగా గత పది సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు వ్యవహరించలేదు. ఇది వాస్తవం. అందుకే ఈరోజున తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం వ్యవసాయానికి సంబంధించిన ప్రత్యేక బడ్జెట్‌ను సభలో పెట్టడం జరిగింది. తద్వారా రైతుకు ఒక భరోసా కల్గుతుంది. ఒక టార్గెటెడ్ ప్రొగ్రామ్‌ను తీసుకుని వ్యవసాయ మరియు వ్యవసాయ అనుబంధ విభాగాలను ఒకే గొడుగు క్రిందకు తీసుకువచ్చి రాష్ట్రాన్ని ప్రగతి పథం వైపు పయనించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రయత్నాన్ని చేస్తోంది.

అధ్యక్షా, వ్యవసాయంలో ఉత్పత్తి అనేది ఉండాలి. అదే విధంగా ఉత్పాదకత పెరగాలి. ఉత్పత్తి ఉండాలంటే మంచి విత్తనం, అందుకు తగ్గ నేల (soil) ఉండాలి. soil testing అనేది తప్పకుండా జరగాలి. భూసార పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన భూసార కార్డులను రైతులకు అందజేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉంది. గ్రామ స్థాయిలో భూసార పరీక్షలపైన రైతులకు అవగాహన కల్పించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఉన్న భూమిలో వ్యవసాయం చేసి ఉత్పత్తిని, ఉత్పాదకతను పెంచాలని, ఏ రకంగా ఉత్పాదకతను పెంచితే వ్యవసాయంలో ఎక్కువ దిగుబడి రావడానికి అవకాశం ఉంటుంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి పొందడమే ప్రధాన ధ్యేయంగా రైతు పెట్టుకోవాలి. అదేవిధంగా సస్యరక్షణ, సస్యపోషణ జరగాల్సిన అవసరముంది. అందుకు గాను Integrated Pest Management, Integrated Crop Management and Integrated Nutrient Management అవసరం. వ్యవసాయంలో ఈ మూడింటిని అమలు చేయాలనే చిత్తశుద్ధితో ప్రభుత్వం ఉంది. Integrated Crop Management క్రింద ఏ రకమైన ప్రత్యామ్నాయ పంటలను రైతులు వేయాలి, ఏ పంటలను వేస్తే రైతుకు రాబడి పెరిగి లాభాలొస్తాయనేది నిర్దేశిస్తుంది. కానీ మన రాష్ట్రంలో Mono system అమలౌతోంది. ఒకే పంటను పదే పదే వేయడం జరుగుతోంది. ఉదాహరణకు

ఒక ప్రాంతంలో రైతులందరూ పత్తిపంటను, పొద్దుతిరుగుడు పంటను, వరి పంటను పదే పదే వేయడం జరుగుతోంది. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతు పయనించే విధంగా గతంలో ప్రభుత్వాలు ప్రొత్సహించాయి. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్న కాలంలో వరుసగా నాలుగు సంవత్సరాల పాటు రాష్ట్రం కరువుకోరలో చిక్కుకున్నప్పుడు ఒక సంవత్సరం ప్రకాశం, గుంటూరు జిల్లాల్లోని కొంత భాగాన్ని పొగాకు పంట వైపు, కొంత భాగాన్ని పచ్చసెనగ పంట వైపు మళ్లించడం జరిగింది. కానీ ఈనాడు పచ్చసెనగ పంట అనేది ప్రకాశం జిల్లాలో ప్రధాన పంటగా మారింది. అదే విధంగా పశ్చిమ గోదావరి జిల్లాలోని జంగారెడ్డిగూడెం ప్రాంతంలో కూడా పచ్చసెనగ పంటను ఆనాడు ప్రత్యామ్నాయ పంటగా సూచిస్తే, ఈనాడు ఆ పంట ప్రధాన పంటగా మారింది. ఈ సందర్భంగా శ్రీవరి సాగు గురించి కూడా చెప్పుకోవాల్సిన అవసరముంది.

(గౌరవ ప్యానల్ స్పీకర్ శ్రీ గౌతు శ్యాంసుందర్ శివాజీ గారు మధ్యాహ్నం గం.12.08 ని.లకు అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

అధ్యక్షా, ఆనాటి తెలుగు దేశం పార్టీ ప్రభుత్వం శ్రీవరి సాగును ప్రొత్సహించింది. శ్రీవరి సాగుకు సంబంధించిన లైవ్ ప్రొగ్రామ్‌ను రాజశేఖరరెడ్డి గారి హయాంలో టి.వి.లో చూపించడం జరిగింది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ప్రాంతంలోని ఒక పొలానికి రాజశేఖరరెడ్డి గారే స్వయంగా వెళ్లి శ్రీవరి సాగును సమీక్షించడం జరిగింది. శ్రీవరి సాగు ద్వారా ఎకరానికి 92 బస్తాల వరి పంట పండినట్టుగా చెబితే, ఆ శ్రీవరి సాగు కేవలం కాగితాలకే, టి.వి.లకే పరిమితమైంది. ఆ తరువాత శ్రీవరి సాగును ప్రొత్సహించేందుకు అవసరమైన కృషిని మనం చేయలేదనే చెప్పుకోవాలి. ఈ రకంగా వ్యవసాయంలో లాభదాయకమైన పంటలను పట్టించుకోకుండా, ప్రత్యామ్నాయ పంటల గురించి ఆలోచించకపోవడం వల్లే ఈనాడు వ్యవసాయరంగంలో చాలా లోపాలు జరుగుతున్నాయనే విషయాన్ని సభాముఖంగా మనవి చేసుకుంటున్నాను. soil erosion కాకుండా చూడాలి. భూమిలో ఒక చిన్న ఇంచి లేయర్ ఏర్పడాలంటే నలభై యేళ్ల నుంచి 700-800 యేళ్లు పట్టే పరిస్థితి ఉంది. అట్లాంటి లేయర్ పాడైపోకుండా చూడాల్సిన బాధ్యత, arisen కాకుండా చూడాల్సిన బాధ్యత ఫారెస్ట్రీ డిపార్ట్‌మెంట్ పైన ఉంది.

...

అంతేకాకుండా ఈ రోజున చేయవలిసింది, ఎప్పుడైతే భూమిని సారంవంతం చేసుకొని, భూసార పరీక్షలు చేపట్టి, ఏ పంట వేయడం ద్వారా ఎక్కువ దిగుబడులను ఇస్తుందో ఆ రకమైన పంటలు వేయవల్సిన అవసరం ఉంది. ఎవరైతే డిపార్ట్‌మెంట్ వ్యవసాయ రంగం క్రింద పనిచేస్తున్నారో వారిని research extention programme కింద వ్యవసాయ విస్తరణ అధికారులందరూ ప్రతి గ్రామం వెళ్లి రైతును చేరుకొనే విధంగా పనిచేయాలి. ఎప్పుడైతే ప్రతి రైతును చేరుకోగలిగిన వాళ్లమౌతామో, అప్పుడు ఈ రాష్ట్రంలో రైతాంగాన్ని కాపాడగలిగిన వాళ్లమౌతాము. అదే విధంగా ఏ ప్రాంతానికి ఏ పంట అవసరమవుతుందో, ఏ పంట పండిస్తే

ఎక్కువ దిగుబడులు వస్తాయి. ఏ పంటకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు వస్తాయనే విషయాలు ఫోకస్ చేయల్సిన అవసరం ఉంది. ఆ కార్యక్రమాన్ని ముందుగానే రైతుల్లోకి తీసుకెళ్ల గలిగితే అది లాభసాటి విధానమని ఈ సందర్భంగా తెలియజేసుకుంటున్నాను. అంతే కాకుండా ఈరోజున విత్తనాలకు రూ.212కోట్లు సబ్సిడీ ఇవ్వడానికి ప్రభుత్వం ముందుకు వచ్చిందని చెప్పడానికి నేను చాలా సంతోషపడుతున్నాను. విత్తన చరిత్రను ఒక్కసారి ఆలోచిస్తే మన రైతాంగం ఎవరైతే వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నారో వారి గురించి విశ్లేషణ చేసుకుంటే మనకు కావల్సిన విత్తనాలు మనమే తయారు చేసుకొనే వారం అన్న విషయాన్ని ముందుగా తెలియజేస్తున్నాను. విత్తనాల కొరకు ఇతరులపై ఆధారపడే వారిమి కాదు. మన విత్తనం మంచి విత్తనం.

అలాంటి సందర్భంలో ఈ రోజు మల్టీనేషనల్ కంపెనీలు వచ్చి అధిక దిగుబడుల పేరుతో వంగడాలను తీసుకొని వస్తున్నారు. ఈ కారణంగా మన విత్తన తయారీని మనమే నాశనం చేసుకున్నాం. ఈ సందర్భంలో కూడా ప్రభుత్వం వారికి నా సలహా ఏమనగా, ఈ విత్తన తయారీ రంగంలో మన రైతాంగం ప్రావీణ్యతను, నైపుణ్యతను, పెంపొందించే విధంగా మన విత్తనాల్ని మనమే తయారు చేసుకునే విధంగా, even hibreedsను కూడా మనమే తయారు చేసుకునే విధంగా ఆ రకమైన green houses, poly houses, where other Countries are doing in our country also మన రాష్ట్రంలో కూడా green houses, poly housesను మనం పెంపొందించుకున్నట్లైతే మన రైతులతోపాటు, ఇతర రాష్ట్రాలకు విత్తన సరఫరా చేస్తూ ఒక విత్తన హబ్‌గా ఈ రాష్ట్రం తయారు కాగలదని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాను.

అదే విధంగా horticultureలో తీసుకుంటే, ఈరోజు citrus, coconut, ఈ రకంగా చూసుకుంటే వాటిల్లో ప్రధానమైన Agro based plantsను తయారు చేసుకున్నట్లైతే, అదే విధంగా వాణిజ్య పరంగా చూసుకున్నట్లైతే turmeric. అధ్యక్షా, ప్రధాన పంట ప్రత్తి. మా ముఖ్య మంత్రిగారు చాలా గొప్పగా ఆలోచించి ప్రత్తిపాటి వారిలో ప్రత్తి ఉందని చెప్పి మా పుల్లారావు గారికి వ్యవసాయ శాఖను ఇచ్చారు. చాలా సంతోషం. ఆయన కూడా మా జిల్లా వ్యక్తి కావడం, కష్టపడే వ్యక్తి కావడం సంతోషం. ఈనాడు ప్రత్తి పంటను రక్షించుకోవల్సిన అవసరం ఉంది. 2012-13 సంవత్సరం దాదాపు 4 లక్షల టన్నులు ప్రత్తి పండుద్ది అనుకుంటే, కనీసం 2 లక్షల టన్నుల ప్రత్తి కూడా చేతికి దక్కలేదు ఇది చాలా దుర్మార్గం. రైతాంగం అంతా నోటికి వచ్చిన కూడును పోగొట్టుకున్నట్లైంది. ఆనాటి ప్రభుత్వం హామీ ఇచ్చింది.

ప్రత్తి ఏ రకంగా ఉన్నా, అంటే తడిసిన, రంగు మారిన ప్రత్తిని కూడా కొనుగోలు చేస్తామని చెబుతూ ఆనాటి ప్రభుత్వం మాటలకే పరిమితం అయింది. ఇటువంటి సంఘటనలు ఉత్పన్నం కాకూడదు. రైతుకు నష్టం జరిగింది అంటే అనాడు 1999లో కృష్ణా, పశ్చిమగోదావరి, గుంటూరు జిల్లాలో ధాన్యం పండే ప్రాంతాల్లో వరదలు రావడం వలన, అకాల వర్షాల వలన పంట పూర్తిగా తడిసి పోయింది. పూర్తిగా పంట రంగు మారిపోయింది. రంగు మారిన

ధాన్యాన్ని కొనాలి అని ఆనాటి ప్రభుత్వాన్ని అడిగాము. ఆనాటి చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వంలో నేనూ కూడా మంత్రిగా పనిచేశాను. ఖచ్చితంగా రైతులను ఆదుకోవల్సిన అవసరం ఉందని మేము స్పష్టంగా చెప్పడం జరిగింది. ఆఖరి ధాన్యపు గింజ వరకు కూడా కొనాల్సిందే అని ప్రభుత్వాన్ని పట్టుపట్టడం జరిగింది. నెహ్రు గారు కూడా ఆనాడు మాతోనే ఉన్నారు.

సివిల్ సప్లై ద్వారా, మార్కెటింగ్ ద్వారా, మిల్లర్స్ ద్వారా, ఏదో రకంగా ఆఖరి ధాన్యపు గింజ వరకు కొన్న ప్రభుత్వం ఆనాటి ప్రభుత్వం అని గౌరవ సభ్యులందరికీ గుర్తు చేస్తున్నాను. కానీ నీలం తుఫాన్‌లో నష్టం జరిగిన రైతాంగానికి ఈ నాటికి కూడా సహాయం అందలేదంటే ఏం చేస్తున్నాయి ఈ ప్రభుత్వాలు అని అడుగుతున్నాను. కళ్లుండినా కబోదుల్లాగా వ్యవహరిస్తున్న ఈ ప్రభుత్వాల్ని ఏమనాలని అడుగుతున్నాను.

ఈరోజు పాలకులపై రైతాంగానికి నమ్మకం పోతుంది. ఒట్టొట్టి మాటలు చెబుతున్నారు. విశ్వసనీయతకు మరోపేరు అని నిరూపించుకోవాలని, చంద్రబాబునాయుడుగారి నాయకత్వం అంటే తెలుగుదేశం పార్టీ, అంటే రైతాంగం పార్టీ, రైతు పార్టీ అని చెప్పడానికే ఈ రుణమాఫీని ప్రవేశపెట్టాం. రుణమాఫీనీ ఎన్ని అడ్డంకులు, అవరోధాలు వచ్చినా ఖచ్చితంగా అమలు చేస్తాం. ఎన్ని విమర్శలు వచ్చినా ఆగదు. ఈరోజు రైతుల్ని ఆదుకునే విధానంలో ఆరోజున్న గ్రీన్ రెవల్యూషన్‌తో మొదలై, ఎల్లో రెవల్యూషన్, వైట్ రెవల్యూషన్, బ్లూరెవల్యూషన్స్ వస్తే రెవల్యూషన్స్ వచ్చేంత వరకే వాటి పరిధి, అయితే వాటిని పూర్తిగా సఫలం చెయ్యాలనే ప్రయత్నంలో ఈ నాటి ప్రభుత్వం ఉంది. అందుకనే ఈనాడు వ్యవసాయాధారిత పరిశ్రమలను కూడా అందులో fisheries issue, Aqua కూడా ఈ రాష్ట్ర ప్రగతిలో ఉంది. స్థూల ఆదాయంలో ప్రధానమైన భాగస్వామ్యం చేయాలని ఈరోజున ఎగుమతుల జోన్‌లో ప్రథమ స్థానంలో ఉంది. ఇంకా అభివృద్ధి చేయల్సిన అవసరం ఉంది. ఫ్రెష్ వాటర్ ఆక్వాకు గానీ, ఫిసెష్ కానీ ఏదైతే అవసరం ఉందో, దానికొక ప్రత్యేకమైన సదుపాయాలను కలుగజేసి ఆదుకోవల్సిన అవసరం ఉంది.

అదేవిధంగా కోళ్ల పరిశ్రమ ఈనాడు మనం చెప్పుకోవాలంటే India is like an egg bowl మనం ఏ రకంగా rise bowl అని ఇది వరకు అనుకున్నామో అదేవిధంగా అనుకునే పరిస్థితికి తీసుకువచ్చాం. దాంట్లో ఈరోజు మన రాష్ట్రం ప్రధానంగా ఉంది. దానిని ఇంకా మనం పెంచుకోవల్సి ఉంది. అలాగే మన animal husbandry అందులో ముందుగా పాడి చెప్పుకున్న తరువాత పంట చెప్పుకుందాం. దాదాపు ఈ రోజున ఈ రాష్ట్రంలో 1కోటి 26లక్షల కుటుంబాలుంటే దాదాపు 37 శాతం ప్రజలు ఈ పాడిపరిశ్రమ మీద ఆధారపడి ఉన్నారు. ప్రతి ఒక్కరికీ రోజు వారిగా, సామాన్య, మధ్యతరగతికి చెంది ఉండి ఎవరైతే ఈ పాడిపరిశ్రమ మీద ఆధారపడి ఉన్నారో వారి జీవనం కొనసాగడానికి ఉపయోగపడే విధంగా ఈ పాడిపరిశ్రమ ఉంది.

పాడిపరిశ్రమలో breeding system ను గానీ ఇటువంటి వన్నీ డెవలప్ చేసి export oriented concept తో మనకున్న జాతి బ్రహ్మాండమైన జాతి. ఒంగోలు జాతి లేదా మనకున్న జాతుల breeding centresను డెవలప్ చేసి ఈ ప్రభుత్వం పాలుపంచుకుంటుందని చెప్పుకోవడంలో ఎటువంటి అవాస్తవం లేదని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

అదేవిధంగా horticulture లో vegetables పాత్ర కూడా ఈరోజు మనం గమనంలోకి తీసుకోవాలి. ఈరోజున ప్రపంచంలో ప్రతి ఒక్కరికి రోజుకు 300 గ్రాముల కూరగాయలు అవసరం కాగా, వాస్తవంగా చూస్తే 60 నుండి 250 గ్రాముల కూరగాయల వరకే మనం కలిగి ఉన్నాం. కూరగాయలకు కొరత ఉంది. ఒక్కొక్క సీజన్‌లో కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్న విషయం మనందరం చూస్తున్నాం. అందుకనే ఈరోజున మార్కెటింగ్ శాఖతో లింక్ అప్ అయితే ప్రాసెసింగ్ ప్లాంట్స్‌ను గానీ కోల్డ్ స్టోరేజెస్ గానీ పెంచుకోగలిగితే, సాంకేతిక పరిజ్ఞానాన్ని మనం వినియోగించుకోగలిగితే, export orientedగా చేసుకోగలిగే అవకాశం ఉంది. ఈ అవకాశాలను మనం కల్పించుకోవాలనే ఉద్దేశ్యంతో వీటన్నింటిని పరిగణనలోకి తీసుకొని వ్యవసాయ బడ్జెట్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈరోజున్న ప్రతి జిల్లాలో మార్కెటింగ్ శాఖ ద్వారా అభివృద్ధి చేసి vegetables perishable goods, live stocks వీటన్నింటిని కాపాడుకోడానికి ఎక్కడ ఏరకమైన సాంకేతిక పరిజ్ఞానం అవసరమో ఆ పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం ద్వారా ఈ రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లాలనే దృఢనిశ్చయంతో ప్రభుత్వం ఉందనడానికి ఈ వ్యవసాయ బడ్జెట్ ఉదాహరణ అని చెప్పతున్నాను.

...

అంతేగాకుండా సెరీ కల్చర్ ఉంది. ఈ సెరీ కల్చర్ వల్ల మహిళలకు ఉద్యోగ అవకాశాలు, సంవత్సరానికి 5 లేదా 6 పంటలు వస్తాయి. నెల నెలా డబ్బులు వచ్చేలా ఉంటుంది. ఉద్యోగికి ఏవిధంగా అయితే నెలకు జీత భత్యాలు వస్తాయో, అదేవిధంగా జీతభత్యాలు వచ్చేవిధంగా ఈ సెరీకల్చర్‌ను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంది. చాలా తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఫలసాయం తీయగలిగిన పరిశ్రమ. ఈ పరిశ్రమ అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. వీటికి చాలా రకాలుగా సబ్సిడీలు ఇస్తున్నాం. సబ్సిడీల ద్వారా రైతాంగానికి ఉపయోగపడి, ఈ సెరీ కల్చర్‌ను కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ఈరోజున ఒకే ఒక విషయాన్ని మీకు మనవి చేసుకుంటున్నాను. వ్యవసాయంలో ప్రత్యామ్నాయ పంటల గురించి ఎప్పుడైతే మనం ఆలోచించగలుగుతామో, ఎప్పుడైతే మనం క్రాపింగ్ సిస్టంను మార్చుకోగలుగుతామో, పరిస్థితులను బట్టి మనం అన్వయం చేసుకుంటూ రైతాంగాన్ని కాపాడుకోవటానికి ఒక యాక్షన్ ప్లాన్‌ను తయారుచేసుకోటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పటంలో ఎలాంటి అవాస్తవం లేదు.

ఖచ్చితంగా ఈ రాష్ట్రంలో ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్ ద్వారా ఈరోజు ఈ రాష్ట్ర రైతాంగాన్ని కాపాడే విధానంలో, ఈ రాష్ట్ర స్థూల ఉత్పత్తిని పెంచే విధానంలో ఈరోజు ఘననీయమైన పాత్రను

వ్యవసాయరంగం తీసుకోబోతోంది అనటంలో వాస్తవం చెప్పటానికి వెనకాడటం లేదు. ఈసందర్భంగా ఒక అంశాన్ని గుర్తు చేయవలసిన అవసరం ఉంది.

(వై.ఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు పేపర్ దొరకటం లేదా అని ప్రశ్నించారు)

లేదు లేదు మీ గురించి చెప్పటం మర్చిపోతున్నాను. ఎందుకంటే మీరందరూ కూడా పాత స్నేహితులు. మీరంతా నా స్నేహితులు కాబట్టి, మిమ్మల్ని విమర్శిస్తే నేను బాధపడాల్సి వస్తుంది. కానీ వాస్తవం చెప్పుకోకపోతే... ఒకటి మాత్రం గుర్తుంచుకోవాలి. వర్షం పడుతూ ఉంటుంది. ఆ నీటి చుక్క నేలమీద పడితే అది మట్టిలో ఇంకిపోతుంది. సముద్రంలో పడితే ఉప్పు నీరుగా మారిపోతుంది. కానీ ముత్యపు చిప్పలో పడితే మాత్రం బ్రహ్మాండమైన ముత్యంగా మారుతుంది. అందుకనే వాస్తవాన్ని వాస్తవంగా చెప్పుకోకపోతే, ఆ వాస్తవాన్ని కూడా వక్రీకరించి చెప్పగలిగిన సమర్థతను కొంతమంది నాయకుల ద్వారా ఈ రాష్ట్ర రాజకీయాల్లో చూస్తున్నాం.

ఈరోజు వ్యక్తిగతంగా నష్టపోలేదు. రాష్ట్ర రైతాంగం అంతా నష్టపోయింది. ఇవాళ నీటి సంఘాలున్నాయి. వ్యవసాయానికి సంబంధించిన నీటి సంఘాలకు ఆనాడు చట్టపరంగా రైతుని రాజుగా చేయాలన్న ఒక హక్కుని కల్పించి, చట్టబద్ధత కల్పిస్తే, ఆ నీటి సంఘాలను నిర్వీర్యం చేసిన ప్రభుత్వాలను మనం గత పది సంవత్సరాలుగా చూశాం. అలకేషన్స్ ఎవరికి ఉన్నాయి. అంతేకాదు, ఆరోజున మీరు మోడరనైజేషన్ కింద నిధులు మంజూరు చేశామని చెబుతున్నారు. నిన్న గాక మొన్న ప్రతిపక్ష సభ్యులు శ్రీ వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిగారు ప్రత్యేకంగా మెన్షన్ చేశారు. ఈ ప్రాజెక్ట్‌లో ఇన్ని పూర్తయ్యాయి, ఇంత ఎర్త్ వర్క్ పూర్తయింది, ఇంకా కొద్దిగా ఉంది, కానీ దీనికి ఇంతే ఇచ్చారు, మరి ఎలా పూర్తవుతుందని చాలా చక్కగా చెప్పారు. డా.వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మా ప్రాంతంలో పులిచింతల ప్రాజెక్టు గురించి మాట్లాడినప్పుడు నేను అనుకొన్నాను. ఎవరైతే ఏమీ, ఏ పార్టీ వారు అయితే ఏమి ఈ రాష్ట్ర రైతాంగాన్ని కాపాడటానికి పులిచింతల ప్రాజెక్టు కార్యక్రమానికి నాంది పలికి జాతికి రెండు సంవత్సరాల్లో అంకితం ఇస్తానంటే హర్షించాలి అని నా మనసులో ఒక పులికింత ఏర్పడింది. ఆ పులకింతను నీరుగార్చిన వ్యక్తి గూడా ఆయనే.

అధ్యక్షా, ఆ రోజున రూ.600 కోట్లతో ప్రారంభమైన ప్రాజెక్టు. ఈనాటికి కనీసం కొంతమేరకు కూడా పూర్తి కాలేదు. మరి మాజీ ముఖ్యమంత్రి శ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డిగారు ఏరకమైన తలుపులు కూడా పెట్టకుండా, ఆరోజున 32 ను 24 షట్టర్సుగా చేశారు. 24 షట్టర్సును కూడా పెట్టకుండా ఊరికే జస్ట్, ఓపెనింగ్ ఎవరైనా చేస్తారనే భయంతో ఫలకాలు వేయించుకున్నారు. చాలా దురదృష్టం.

నా ప్రాంతంలో కూడా కొన్ని ప్రాజెక్టులను తీసుకొచ్చారు. నేను అనకూడదు. ఈరోజు ఎవర్నీ కూడా విమర్శించకూడదు. కానీ ఆ ప్రాజెక్టులన్నిటినీ ఏరకమైన ప్రవృత్తి కలిగిన

విధానంతో గత ప్రభుత్వం వ్యవహరించిందంటే, పనిచేసినట్లుగా భ్రమ కల్పించారు. ఆ పనిచేసిన భ్రమలో పూర్తిగా అవినీతి అయిపోయింది. పూర్తిగా దోచుకున్నారు. ప్రజల హక్కును, ప్రజా ధనాన్ని పూర్తిగా దుర్వినియోగం చేసిన ప్రభుత్వం ఏదైనా ఉందా అంటే గత పది సంవత్సరాలపాటు పరిపాలించిన ప్రభుత్వాలే. దానిని మర్చిపోకూడదు. దానివలన ఇవాళ జరిగిన నష్టాన్ని పూడ్చుకోవాలంటే, లక్ష కోట్ల రూపాయల రుణమాఫీ చేసినా కూడా ఆ నష్టాన్ని పూరించలేని పరిస్థితిలో ఈ రాష్ట్ర ప్రజానీకం ఉన్నారని చెప్పటానికి చాలా బాధ, సిగ్గు పడుతున్నాను. ఇలాంటి పరిస్థితికి దిగజార్చిన రాజకీయాలు మనకొద్దు. ఇవాళ రాజకీయాలలోకి రావటానికి, రాజకీయ విలువలను కాపాడటానికి ఈరోజున మీ పాత్ర ఎంత ఉందనేది ఆలోచించుకుంటే మీకే అర్థమవుతుంది. నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉందనేది వాస్తవం. ఆ రకమైన విలువలతో రాజకీయాలను కొనసాగించాలనే ప్రయత్నం చేస్తే ప్రజలు హర్షించరు అని ఈ సందర్భంగా మీకు మనవి చేస్తున్నాను.

అంతేగాకుండా, ఈరోజున మనం చూసుకున్నట్లయితే నేను కోరుకున్నది ఒకటే. క్రాప్ ఇన్సూరెన్స్ పథకాన్ని మనం ప్రవేశపెట్టాం. ఈ ఇన్సూరెన్స్‌ను గతంలో పెట్టుబడి మీద ఇచ్చేవాళ్లం. కానీ ఈ ప్రభుత్వం దిగుబడి మీద కూడా క్రాప్ ఇన్సూరెన్స్ ఇవ్వాలనే ఒక ప్రయత్నం చేస్తుంది. ఎందుకంటే ఇన్‌పుట్, అవుట్‌పుట్ రెండింటినీ బ్యాలెన్సింగ్ చేయటానికి, ఎక్కడా కూడా నష్టం జరగకుండా ఉండటానికి, రైతును కాపాడటానికి ప్రయత్నం చేసే భాగంలో ఈ ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగింది.

నేను కోరుకున్నది ఒకటే. ఈనాడు వ్యవసాయ శాఖా మంత్రిగారికి మనవి చేసేదేమంటే, ఈనాడు సాయిల్ ఫెర్టిలిటీని కాపాడేందుకు గ్రామాన్ని ఒక యూనిట్‌గా, మండలాన్ని ఒక యూనిట్‌గా, జిల్లాని ఒక యూనిట్‌గా, రాష్ట్రాన్ని ఒక యూనిట్‌గా తీసుకోండి. ఆ రకంగా ఎక్స్‌టెన్షన్ ప్రోగ్రాం జరుగుతూ ఉండాలి. అదేవిధంగా విత్తన కార్యక్రమంలో కూడా చిరు విత్తన క్షేత్రాల్ని, ప్రతీ నియోజకవర్గంలో ఒక చిరు విత్తన క్షేత్రాన్ని ప్రవేశపెట్టాలని కోరుతున్నాను.

అంతేగాకుండా ప్రతీ నియోజకవర్గంలో లాబ్ టెస్టింగు కేంద్రాలను ప్రవేశపెట్టాలని కోరుతున్నాను. అదేవిధంగా ఈరోజు మీరందరూ కూడా హర్షించేవిధంగా ఈ రాష్ట్రంలో మరీ ముఖ్యంగా మిగతా పరిశ్రమలు ఏవైతో ఉన్నాయో, ఆగ్రో బేస్డ్ ఇండస్ట్రీలను అభివృద్ధి పరిచేదాంట్లో, ఎక్కడా కూడా పక్షపాతం లేకుండా, ప్రతీ జిల్లాలో ఏరకమైన పంటలు ఉన్నాయో, ఆ పంటల ఆధారితమైన పరిశ్రమలను తీసుకొచ్చే విధానం, ప్రత్యేకమైన మండళ్లను ఏర్పాటుచేసి, ప్రగతిని సాధించే విధంగా చూడాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అధ్యక్షా, ఈ సందర్భంలో నాకు చిన్న విషయం గుర్తుకు వస్తుంది. ఎందుకంటే ఇది ఒక్కసారి చెప్పాల్సిన అవసరం ఉంది. ఈ వ్యవసాయ బడ్జెట్‌పై మాట్లాడటానికి అవకాశం

ఇచ్చినందుకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలుపుకుంటూ, శ్రీ శ్రీ గారి మాటలు గుర్తొస్తున్నాయి. ఆ రకంగా రైతు ఉండాలని కోరుకుంటూ, ఈ పద్యాన్ని మీ ముందు ఉంచటానికి ప్రయత్నం చేస్తున్నాను.

పొలాలన్నీ హలాలగును, ఇలా తలంలో హేమం పిండగ
జగానికంతా సౌఖ్యం నిండగ, విరామమెరగక పరిశ్రమించే
బలం ధరిత్రికి బలికాకుండా, కర్షక వీరుల్లారా, కర్షక వీరుల కాయం నిండా
కాలువ గట్టే, ఖర్మ జలానికి, ధర్మ జలానికి ఖరీదు గట్టే పరాబు లేడోయ్

అని చెప్పి ఆ రకంగా ఈ ప్రభుత్వం ఉండాలని చెప్పి కోరుకుంటున్నాను. (ట్రెజరీ బెంచ్ నుంచి చప్పట్లు) రైతును రాజుని చేసేవిధంగా గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడిగారి ఆధ్వర్యంలో ఈ ప్రభుత్వం కొనసాగుతుందని, మనసా వాంఛా నమ్ముతూ ఈ అవకాశం ఇచ్చిన మీకూ హృదయపూర్వకమైన ధన్యవాదాలు తెలుపుకుంటూ మీ దగ్గర్నుంచి సెలవు తీసుకొంటున్నాను.

ఛైర్మన్: విశ్వేశ్వరరెడ్డి గారు.

...

శ్రీ వై. విశ్వేశ్వర రెడ్డి (ఉరవకొండ): గౌరవ అధ్యక్షుల వారు ఈరోజు ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నారంటే, ఈ రాష్ట్రంలో చాలామంది శ్రీ చంద్రబాబునాయుడు గారి మైండ్‌సెట్ మారిందేమోనని అనుకున్నారు. నిజంగానే, ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశ పెడుతున్నారంటే, రాష్ట్రంలో వ్యవసాయరంగం యొక్క ప్రాధాన్యతను ఈ ప్రభుత్వం బాగా గుర్తించిందని చాలామంది అనుకున్నారు. నిజంగా ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలనుకోవడం మంచిదే. కానీ, ఇంతగా నిరాశాజనకమైన, పేలవమైన ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెడతారని నేను కూడా భావించలేదు. (అధికారపక్ష సభ్యులచే అంతరాయం) నిజమే, అంకెలు బాగానే చూపించారు. రూ.6700కోట్లకు పైగా ప్లాన్ బడ్జెట్ చూపించారు. రూ.6370కోట్లు నాన్‌ప్లాన్ బడ్జెట్ చూపారు. రూ.12000కోట్లకు పైగా వ్యవసాయ బడ్జెట్ అంటే, ప్రారంభంలో అంకెలు చెప్పినప్పుడు, మేము కూడా భ్రమలకు లోనయ్యాము. నిజంగా ఏదో అద్భుతం చేస్తారేమో అనుకున్నాము. ఈరోజు లోతుగా పరిశీలిస్తే, మొత్తంగా రూ.13010.30 కోట్లు ప్లాన్, నాన్ ప్లాన్ బడ్జెట్‌లో ఖర్చు పెడితే, మాకు అర్థం కానిదేమంటే, వ్యవసాయ రుణాల మాఫీ కోసం రూ.5000కోట్లు వ్యవసాయ బడ్జెట్‌లో చూపించారు, అదేవిధంగా స్టేట్ జనరల్ బడ్జెట్‌లో కూడా చూపించడం జరిగింది. విద్యుత్ సబ్సిడీ రూపంలో రూ.3188కోట్లు వ్యవసాయ బడ్జెట్‌లో, అదేవిధంగా జనరల్ బడ్జెట్‌లో చూపడం కూడా జరిగింది. గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద ఇచ్చే డబ్బును కూడా 60 శాతం దాకా వ్యవసాయానికి అనుబంధం చేస్తున్నామంటూ, రూ.1386 కోట్లు వ్యవసాయ బడ్జెట్‌లో

చూపించారు, అదేవిధంగా జనరల్ బడ్జెట్‌లో కూడా చూపించారు. ఆవిధంగా దాదాపు రూ.9155 కోట్లు, రుణమాఫీ, విద్యుత్ సబ్సిడీ, కేంద్రం నుండి వచ్చే గ్రామీణ ఉపాధి హామీ పథకం వంటి వాటికే పోతున్నాయి. తీరా, మిగిలింది కేవలం రూ.3435కోట్లు. అంటే మొత్తం బడ్జెట్‌లో మూడు శాతం కూడా లేదు.

వ్యవసాయ రంగం మీద ఆధారపడిన వాళ్ళ గురించి బాగానే చెప్పారు. రాష్ట్రం విడిపోయిన తరువాత 65 శాతం వరకు వ్యవసాయ రంగంపైన ఆధారపడ్డారు. వ్యవసాయ రంగంపై ఆధారపడిన గ్రామీణ ప్రాంత రైతాంగం, వ్యవసాయ కూలీల జీవితాల్లో మార్పు రాకుండా ఆంధ్రరాష్ట్రం ముందుకు పోలేదన్న విషయం మనందరకూ తెలిసినదే. ఈరోజు దాన్ని ఏవిధంగా బయటపడేయాలో మనమందరం కూడా ఆలోచించాల్సిన అవసరముంది. మనలో దాదాపు 60, 70 శాతం మంది సభ్యులు రైతు కుటుంబాల నుండి వచ్చిన వారమే. వ్యవసాయం సంక్షోభంలో ఉందనేది మనమందరం కూడా గుర్తిస్తున్నాం. ఈ ప్రభుత్వం కూడా, శ్వేతపత్రం విడుదల చేసే సందర్భంలో గానీ, బడ్జెట్ సందర్భంలో గానీ, వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందన్న విషయాన్ని గుర్తించింది. చాలా సంతోషం. ఎందుకంటే, నేను గతంలో రైతుసంఘం నాయకుడిగా ఉన్నప్పుడు, శ్రీ చంద్రబాబునాయుడు గారి పరిపాలనలో, ఎప్పుడూ కూడా వ్యవసాయరంగంలో సంక్షోభం ఉందని ఒక్కరోజు కూడా అంగీకరించిన పాపానపోలేదు. కనీసం, పదేళ్ళ మరోపార్టీ పరిపాలన తరువాతైనా వ్యవసాయరంగం సంక్షోభంలో ఉందని గుర్తించినందుకు సంతోషం. కానీ, సంక్షోభ నివారణకు, ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారు. ఈరాష్ట్రంలో వ్యవసాయరంగాన్ని ఏవిధంగా పరుగులెత్తించబోతున్నారు, అనేటువంటిది మనమందరం కూడా ఆలోచించి నిర్ణయించుకోవలసిన అవసరముంది.

'ఈరోజు రైతాంగానికి, వ్యవసాయానికి ఖర్చు పెరిగింది, రాబడి తగ్గింది' అని బడ్జెట్‌లో చెప్పడంజరిగింది. అదేవిధంగా ఉత్పత్తి, ఉత్పాదకత రెండింటినీ పెంచవలసిన అవసరముందనే విషయాన్ని కూడా బడ్జెట్‌లో గుర్తించడం జరిగింది. కానీ, ఈ సందర్భంగా నాకు ఆశ్చర్యం కలిగించిన విషయమేమంటే, మామూలుగా చంద్రబాబునాయుడు గారిని చాలా తెలివైన వారు అంటారు. (అధికారపక్ష సభ్యులచే అంతరాయం). కానీ, పాజిటివ్ తెలివితేటలో, నెగటివ్ తెలివితేటలో, ఏవో ఉన్నాయి మొత్తానికి, నేను కాదని చెప్పడంలేదు. ఐతే, ఈ తెలివి.... అన్నింటిలో శ్రీ రాజశేఖరరెడ్డిగారితో బేరీజు వేసుకున్నారు. కానీ, వ్యవసాయరంగానికి సంబంధించిన దానిలో శ్రీ రాజశేఖరరెడ్డి గారితో బేరీజు వేసుకోవడమంటే ఒక దుస్సాహసమే అధ్యక్షా. (అధికారపక్ష సభ్యులచే అంతరాయం). ఎందుకంటే, శ్రీ రాజశేఖరరెడ్డిగారిని అంగీకరించని వాళ్ళు సైతం, వారిని తీవ్రంగా విమర్శించేటువంటి వాళ్ళు సైతం, శ్రీ రాజశేఖర రెడ్డిగారు అద్భుతాలు సృష్టించారని అంగీకరిస్తున్నారు. ఇవేవో గాలి మాటలు చెప్పడం కాదు. ఏ సర్వేలు తీసుకున్నా కూడా వ్యవసాయరంగంలో ఒక ఫినామినల్ గ్రోత్, రాష్ట్ర చరిత్రలోనే ఒక్క రాజశేఖరరెడ్డిగారి హయాములో చూసిన వ్యవసాయరంగ దిగుబడులు అనేటువంటివి

ఎప్పుడూ కూడా వ్యవసాయరంగంలో చూడలేదు. ఈరోజు లెక్కల ప్రకారం చూసినా కూడా, చంద్రబాబునాయుడు గారి హయాంలో, వ్యవసాయరంగం మరియు వ్యవసాయరంగ అనుబంధ రంగాలలో ఉన్న గ్రోత్‌రేట్‌లు 3.24 గా ఉంటే, శ్రీ రాజశేఖరరెడ్డి గారి హయాములో 6.14గా ఉంది. దాదాపుగా నేషనల్ యావరేజ్‌కు రెట్టింపు వ్యవసాయ అభివృద్ధి సాధ్యమయ్యింది.

(అధికారపక్ష సభ్యులచే అంతరాయం)

అదేవిధంగా వ్యవసాయరంగానికి సంబంధించినటువంటి ఈల్డ్ రేట్స్ తీసుకున్నా కూడా, వ్యవసాయరంగంలో దిగుబడుల రేటు, చంద్రబాబునాయుడు గారి హయాంలో 0.97గా ఉంటే, శ్రీ రాజశేఖరరెడ్డి గారి హయాములో 6.46గా ఉంది. ఏవిధంగా పోల్చుకుంటారు? శ్రీ రాజశేఖరరెడ్డి గారి హయాముకూ, చంద్రబాబునాయుడు గారి హయాముకూ ఆకాశానికీ, భూమికీ ఉన్నంత తేడా ఉంది. పర్‌క్యాపిటా ఇన్‌కమ్‌కు సంబంధించిన లెక్కలు చూసినా కూడా, ఊహించనటువంటి గ్రోత్ డిఫరెన్స్, చంద్రబాబునాయుడు గారికీ, రాజశేఖరరెడ్డి గారికీ ఉంది. ఎట్లా సాధ్యమయ్యింది?

(గౌరవ మంత్రి శ్రీ ప్రత్తిపాటి పుల్లారావుగారు తమకు మాట్లాడే అవకాశం ఇవ్వమని అడిగారు.)

మిస్టర్ చైర్మన్: దయచేసి ఆగండి. వారు మాట్లాడిన తరువాత మీరు మాట్లాడుదురు గాని.

(గౌరవ మంత్రి శ్రీ ప్రత్తిపాటి పుల్లారావుగారు తమకు మాట్లాడే అవకాశం ఇవ్వమని మళ్ళీ అడిగారు.)

మిస్టర్ చైర్మన్: మీరు ఒక్క నిముషం ఆగండి, (శ్రీ వై.విశ్వేశ్వరరెడ్డి గారి మైకు కట్ చేయబడింది.) వ్యవసాయ శాఖ మంత్రి గారు మాట్లాడుతారు.

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు (చిలకలూరిపేట): అధ్యక్షా, విశ్వేశ్వరరెడ్డి గారు రాజశేఖరరెడ్డి గారి హయాములో గ్రోత్‌రేట్ విపరీతంగా పెరిగిందని చెబుతున్నారు. అధ్యక్షా, విపరీతంగా పెరిగింది గ్రోత్‌రేట్ కాదు. అవినీతి పెరిగిపోయింది. అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయింది. శ్రీ రాజశేఖరరెడ్డి గారి దగ్గరి నుంచి 2014 మార్చి వరకు, ఆ పది సంవత్సరాల కాలంలో, ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎప్పుడూ లేనంతగా అవినీతి పెరిగింది. కానీ, వ్యవసాయంలో జి.ఎస్.డి.పి. పెరగలేదు. శ్రీ రాజశేఖరరెడ్డిగారు 'మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే, ఒక్క రైతు ఆత్మహత్య కూడా ఉండదు' అన్నారు. కానీ మీరు అధికారంలో ఉన్న 10 సంవత్సరాల్లో,

అధికారికంగా గానీ, అనధికారికంగా గానీ, సుమారు ఇరవై వేలమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. మరి మీ పరిపాలనలో వ్యవసాయం అంతబాగా అభివృద్ధి చెందితే, ఇరవై వేలమంది రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకున్నట్లు? ఒకసారి ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరముంది. ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవల్సిన అవసరం ఉంది. 2008వ సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం రుణమాఫీ చేస్తామంటే, సంవత్సరానికి రూ.5,000/- ఇస్తే సరిపోతుందని శ్రీ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారు చెప్పారు.

...

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల నుంచి సభకు అంతరాయం)

2008వ సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్తంగా రూ.60,000/- కోట్లు మాత్రమే రుణమాఫీ చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో కేవలం రూ.10,000/- కోట్లు లోపు మాత్రమే. తెలుగు దేశం ప్రభుత్వం రూ.45,000/- స్వచ్ఛందంగా రుణమాఫీ చేసి, దేశ చరిత్రలో శ్రీ నారా చంద్ర బాబు నాయుడు గారు తీసుకున్న నిర్ణయానికి రైతులంతా హర్షిస్తున్నారు.

(అధికారపక్ష సభ్యులు బల్లలు చరిచారు)

మిస్టర్ ఛైర్మన్: మినిస్టర్ గారు మ. గం.1.30 నిమిషాలకు మీరు సమాధానం ఇచ్చే కార్యక్రమం ఉన్నది. ఈ విషయాలన్నీ అప్పుడు చెప్పొచ్చు. దయచేసి గౌరవసభ్యులు శ్రీ విశ్వేశ్వర రెడ్డి ఉపన్యాసాన్ని కొనసాగించాల్సిందిగా కోరుతున్నాను.

(సభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాదోపవాదాలు జరిగాయి)

శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు (చిలకలూరిపేట): అధ్యక్షా, శ్రీ రాజశేఖర రెడ్డి గారి ప్రభుత్వంలో గాని, 2009-2014 వరకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు బాగుంటే రైతులకు ఈనాడు రుణమాఫీ చేయాల్సి వచ్చేది కాదు. వారు తీసుకున్న అస్తవ్యస్త నిర్ణయాల వలన రైతులు అప్పులలో కూరుకుపోయారు. కనుక తెలుగుదేశం ప్రభుత్వం రైతు రుణమాఫీ ప్రకటించాల్సి వచ్చింది.

మిస్టర్ ఛైర్మన్: మినిస్టర్ గారు దయచేసి కుర్చోండి, మీ సమాధానంలో తరువాత చెప్పొచ్చు. శ్రీ విశ్వేశ్వర్ రెడ్డి గారు ఉపన్యాసాన్ని కొనసాగించాల్సిందిగా కోరుతున్నాను.

(సభకు అంతరాయం)

శ్రీ జ్యోతుల నెహ్రూ (జగ్గంపేట)ః అధ్యక్షా, సభను పూర్తిగా వినియోగించుకోవడం కాదు, గౌరవసభ్యులు చేప్పే విషయాలు పూర్తిగా విని దానికి సమాధానం చెప్పాలి.

(అధికార, ప్రతిపక్ష సభ్యులు మాట్లాడడానికి అవకాశమివ్వాలని ఒకరినొకరు వాదులాడుకున్నారు. తద్వారా సభలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది)

మిస్టర్ చైర్మన్ః మినిస్టర్ గారికి తరువాత మాట్లాడవచ్చునని నేను చెప్పాను. శ్రీ విశ్వేశ్వర రెడ్డి గారు ఉపన్యాసాన్ని కొనసాగించండి.

శ్రీ వై.విశ్వేశ్వర రెడ్డి (ఉరవకొండ)ః అధ్యక్షా, నేను చెప్పిన లెక్కలు కాకి లెక్కలు కావు, ప్రతిష్టాత్మకమైన Directorate of Economics and Statistics, Hyderabad వారివి.

(అధికారపక్ష సభ్యుల నుంచి సభకు అంతరాయం)

వ్యవసాయ రంగానికి చెందిన బడ్జెట్‌లో నేను చెప్పదలచుకున్నదేమంటే శ్రీ చంద్రబాబు నాయుడు గారు వ్యవసాయ రంగాన్ని నాశనం చేశాడని చెప్పడం లేదు. వారి ఆలోచన విధానంలో, ప్రభుత్వ విధానంలోని లోపాలను ఎత్తి చూపడం ద్వారా, వాటిని సరిదిద్దుకుంటే శ్రీ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి కంటే వ్యవసాయ రంగంలో రెండింతలు అభివృద్ధి చూపించవచ్చని ఈ సందర్భంగా వారి దృష్టికి తీసుకుని వస్తున్నాను. వ్యవసాయ మంత్రివర్యులు వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టేటప్పుడు వ్యవసాయ వాట జీఎస్‌డీపీలో 54 శాతం నుంచి 49 శాతానికి తగ్గిందని చెబుతారు. సాధారణ బడ్జెట్‌లో వ్యవసాయ రంగం వాటా 17 శాతం చూపించారు. సోషియో ఎకనామిక్ సర్వేలో 23 శాతం చూపించారు. ఒకచోట 49 శాతం, ఇంకొక చోట 17 శాతం వేరొకచోట 23 శాతం చూపించారు. అంటే వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టేటప్పుడు వీరి సీరియస్‌నెస్ ఎంత ఉందో వారి దృష్టికి తీసుకురాదలచుకున్నాను. నేను చెప్పిన విషయంలో శ్రీ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారికి ఏ విధంగా సాధ్యమయింది. సంక్షోభంలో ఉన్న వ్యవసాయ రంగం, రైతాంగం ఆత్మహత్యల గురించి గౌరవసభ్యులు, మంత్రి గారు మాట్లాడారు. మీ (అధికార పార్టీనుద్దేశించి) ప్రభుత్వం రైతు ఆత్మహత్యలను గుర్తించిందా అని అడుగుతున్నాను. రైతులు పిట్టల్లాగా కూలిపోతుంటే ఏ ఆర్‌డీవో, ఏ అధికార అయినా వెళ్ళి పరిశీలించారా? ఆనాడు నేను రైతు నాయకుడిగా ఉన్నాను. అప్పుడు కనీవినీ ఎరుగని సంక్షోభం ఆంధ్రప్రదేశ్‌లో తాండవించింది. వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అనంతపురం జిల్లాకు చెందిన ఒక రైతుగా నేను మాట్లాడుతున్నాను. రైతులు ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నారో పరిశీలన చేయడానికి లండన్, అమెరికా, యూరప్ దేశాల నుంచి బృందాలుగా అనంతపురం జిల్లాకు వచ్చారు. ఆత్మహత్యలకు ఒక కేంద్రంగా అనంతపురం జిల్లా మారిపోయింది. చివరికి రైతులు వారి కిడ్నీలు అమ్ముకునే దారుణ పరిస్థితి వచ్చింది. సభ్యులు

శ్రీ రాజేంద్రప్రసాద్ గారు జయతీ ఘోష్ కమీషన్, జస్టీస్ పీఏ చౌదరి కమీషన్ గురించి ప్రస్తావించారు.

(మైక్ కట్ చేయబడింది)

CHAIRMAN: Please be seated, Chief Whip garu.

శ్రీ కాలవ శ్రీనివాసులు (రాయదుర్గం)ః అధ్యక్షా, విశ్వేశ్వర్ రెడ్డి గారు వ్యవసాయ సంక్షోభం, అనంతపురం జిల్లాలో వ్యవసాయదారుల కష్టాల గురించి మాట్లాడారు. 2004వ సంవత్సరానికి ముందు అనంతపురం జిల్లాలో కరువు తాండవించి అనేక ఇతిబాధలు ప్రజలు అనుభవించిన మాట వాస్తవం. ఆ తరువాత 12 సంవత్సరాలలో 8 సంవత్సరాలు కరవు వచ్చిన సందర్భం లేనేలేదు. శ్రీ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి గారు రైతుల ఆత్మహత్యలను రాజకీయ స్వప్రయోజనాలకు ఎలా వాడుకున్నారో చిన్న ఉదాహరణ చెబుతాను.

అనంతపురం జిల్లాలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్న నెపంతో భిక్షాటన చేసి, బలవంతంగా డబ్బులు వసూలు చేశారు. పురుగుల మందు త్రాగి చనిపోయిన వారిని కూడా రైతు ఆత్మహత్యగా శ్రీమతి సోనియా గాంధీని తీసుకొని వచ్చి చూపించి నిధులు సమకూర్చుకున్నారు. ఆ నిధులను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు పంచారు.

10 సంవత్సరం కాలంలో వ్యవసాయం బ్రహ్మాండంగా ఉందన్నారు. 10 సంవత్సరాల కాంగ్రెస్ పార్టీ వైఫల్యం వల్ల రాష్ట్రంలో 31.7 శాతం నుంచి 24.6 శాతానికి రైతు కుటుంబాలు తగ్గిపోయాయి.

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల నుంచి అభ్యంతరాలు)

వ్యవసాయ కూలీల సంఖ్య 26 శాతం నుంచి 30 శాతానికి పెరిగాయి. నిజంగా శ్రీ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారి పరిపాలన బ్రహ్మాండంగా ఉంటే వేల మంది రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకున్నారు. శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు 2,800 కిలోమీటర్లు పాదయాత్ర చేసేటప్పుడు అడుగడుగునా రైతులు కష్టాలు, కన్నీళ్లు ఎందుకు చెప్పుకున్నారు. మీరే మాకు దిక్కు, మీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రుణ విముక్తుల్ని చేయమని కన్నీళ్లతో వేడుకున్నారు. నిజంగా 10 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో రైతుకు న్యాయం జరిగి ఉంటే శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు పాదయాత్ర చేయాల్సిన అవసరమే రాదు. రైతు రుణమాఫీ ఇవ్వాల్సిన అవసరమే రాదు. తిమ్మిని బమ్మిని చేసి, అబద్ధాన్ని నిజమని నమ్మించి, రైతుల ప్రాణాలు తీసి, అర్ధరాత్రి, అపరాత్రి కరెంటు ఇచ్చి వ్యవసాయ రంగం సంక్షోభానికి కారణమైన శ్రీ

వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారిని మెచ్చుకుంటే అది ఆత్మహత్యా సాదృశ్యం తప్ప మరొకటి కాదు. కాబట్టి నిజాలు మాట్లాడడం నేర్చుకోవాలని వైఎస్సార్ పార్టీ సభ్యులకు హితవు పలుకుతున్నాను.

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల నుంచి సభకు అంతరాయం)

శ్రీ వై. విశ్వేశ్వర్ రెడ్డి (ఉరవకొండ)ః అధ్యక్షా, విలువైన అభ్యంతరాలు ఉంటే నాకు అభ్యంతరం లేదు.

శ్రీ జ్యోతుల నెహ్రు (జగ్గంపేట)ః అధ్యక్షా, సభ్యులు శ్రీ రాజేంద్రప్రసాద్ గారు ఒక గంట మాట్లాడారు. మా పార్టీ సభ్యులు ఎవరూ అభ్యంతరాలు పెట్టలేదు. వారి ఉపన్యాసానికి మేము భంగం కలిగించ లేదు. వ్యవసాయ రంగానికి ఉన్న విధివిధానాలపై మాట్లాడుతున్న శ్రీ వై.విశ్వేశ్వర్ రెడ్డి గారి ఉపన్యాసానికి భంగం కలిగిస్తున్నారు. భంగం కలిగించకుండా నోట్ చేసుకోమనండి. మా సభ్యులు మాట్లాడుతుంటే ఒక ప్రక్క నుంచి ఛీప్ విప్ గారు, మరొక ప్రక్క వ్యవసాయ శాఖామంత్రి గారు మాట్లాడడానికి మైక్ కావాలని చేయి ఎత్తుతారు. వారు వినే ఓపిక లేకపోతే ఎలా.

(సభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాదోపవాదాలు జరిగాయి)

మిస్టర్ ఛైర్మన్ఃవిశ్వేశ్వర్ రెడ్డి గారి ఉపన్యాసం పూర్తి చేయనీయండి, ఎందుకంటే స్పీకర్ గారు సమయం ఇచ్చి వెళ్లారు. విశ్వేశ్వర్ రెడ్డి గారు మాట్లాడండి.

శ్రీ వై.విశ్వేశ్వర్ రెడ్డి(ఉరవకొండ)ః అధ్యక్షా, శ్రీ కాల్వ శ్రీనివాసులు గారు ప్రభుత్వాన్ని కాపాడడం కంటే, అనంతపురం జిల్లా. . . . . .

(సభకు అంతరాయం)

ఆత్మహత్యల గురించి, జస్టిస్ పి.ఎ.చౌదరి కమిటీ గురించి చెప్పారు. జస్టిస్ చౌదరి గారితోబాటు వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్తలైన ఆచార్య కె.ఎ.చౌదరి, ఆచార్య నరసింహారెడ్డి, ఆచార్య వేణుగోపాల్ లాంటివారు, తొమ్మిది వామపక్ష సంఘాలు కలిసి రైతాంగ సంక్షోభం పైన ఒక కమిటీని ఏర్పాటుచేయమని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి వద్దకు వెళ్లారు. రైతుసంఘాల నాయకులు, ప్రముఖ శాస్త్రవేతలు కలిసి వెళ్లి ఈ సంక్షోభాన్ని పరిష్కరించండని, మీరు ఒక్క పైసా వడ్డీ, లేదా మొత్తం రుణం రద్దుచేయకపోయినా ఫర్వాలేదు, కనీసం రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారో, దేశానికి అన్నం పెట్టే రైతులు ఎందుకు ప్రాణాలు కోల్పోతున్నారో ప్రభుత్వం తప్పకుండా

పరిశీలన చేయాలని, ఆత్మహత్యలకు కారణాలు తెలుసుకోవడానికి కమీషన్ వేయమని కోరితే కమీషన్ వేయడానికి చంద్రబాబు నాయుడు గారు నిరాకరించారు. జస్టిస్ పి.ఎ.చౌదరి నాయకత్వంలో కమీషన్ ఏర్పాటైన తరవాత రాష్ట్రమంతా పర్యటించి రిపోర్టు సమర్పించారు. ప్రభుత్వ విధానాలు మార్చుకోమని, విధానాలలో మంచిచెడులను గురించి చెప్పారు. హైకోర్టు రిటైర్డ్ జడ్జి ఆధ్వర్యంలోని కమిషన్ అందించే రిపోర్టును స్వీకరించడానికి కూడా అప్పటి ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు అంగీకరించలేదు. వ్యవసాయ సంక్షోభాన్ని గుర్తించలేదు, రైతాంగ ఆత్మహత్యలనూ గుర్తించలేదు.

వై.ఎస్.రాజశేఖరరెడ్డిగారు ముఖ్యమంత్రి అయిన తరవాత రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలను గుర్తించడం జరిగింది. హెలికాప్టర్ ప్రమాదంలో మరణించడానికి వారం రోజుల ముందు కూడా వీడియో కాన్ఫరెన్స్‌లో రైతుల ఆత్మహత్యలు గుర్తించడంలో అధికారులు జాప్యం ఎందుకు చేశారని, వారం రోజులు ఆలస్యం కావడానికి వివరణ ఇవ్వమని అడిగిన మానవత్వం ఉన్న మహామనిషి రాజశేఖరరెడ్డి గారు. అలాంటి రాజశేఖరరెడ్డి గారు అధికారంలోకి వచ్చిన వెంటనే రైతాంగం ఆత్మహత్యలకు కారణాలు తెలుసుకోవడానికి జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రముఖ మార్క్సిస్టు మేధావి ఆచార్య జయతీ ఘోష్ ఆధ్వర్యంలో కమీషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆ కమీషన్‌లో తమిళనాడు, పశ్చిమబెంగాల్‌కు సంబంధించిన అగ్రశ్రేణి వ్యవసాయ నిపుణులను, శాస్త్రవేత్తలను నియమించారు. ఆ కమీషన్ రాష్ట్రమంతా పర్యటించి రిపోర్టును ప్రభుత్వానికి సమర్పించగా ఆ రిపోర్టులోని సిఫార్సులను అమలుచేసిన దమ్ములున్న నాయకుడు రాజశేఖరరెడ్డిగారు. అది వారికే సాధ్యమైనది. కమీషన్ రిపోర్టులను బుట్టదాఖలా చేశారని మన నాయకులు ఉపన్యాసాలు చెబుతున్నందుకు నేను చెబుతున్నాను.

జయతీ ఘోష్ కమీషన్ రిపోర్టులో భాగంగా వ్యవసాయ సంక్షోభంతోబాటు రోజూ రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాధాన్యత గురించి చెప్పడం జరిగింది. ఈ రాష్ట్రంలో ప్రాంతాల మధ్య తీవ్రమైన వ్యత్యాసాలున్నాయి, ఈ రాష్ట్రంలో 14శాతం భూమికి కూడా సాగునీటిపారుదల సౌకర్యం లేదు. మూడు శాతం కూడా నికరజలాల సౌకర్యం లేదని చెప్పింది. మా ప్రాంతంలో కేవలం 500 మి.మీ. ఇంకొన్ని ప్రాంతాల్లో కేవలం 300మి.మీ. వర్షపాతం మాత్రమే నమోదవుతుంది. ఈ తారతమ్యాలను సరిచేయాల్సిన అవసరాన్ని గుర్తించినందునే రాజశేఖర్ రెడ్డిగారి హయాంలో ఇరిగేషన్‌కు పెద్దపీట వేసి రూ.65వేల కోట్లు కేటాయించి రూ.55కోట్ల రూపాయలు ఖర్చుచేయడం జరిగింది.

(అంతరాయం)

ఈ రోజు మీ ప్రభుత్వం విడుదలచేసిన శ్వేతపత్రంలో గత నాలుగైదేళ్లలో 23లక్షల ఎకరాలకు నీరందించామని మీరు అంగీకరించారు. రాజశేఖరరెడ్డిగారు అధికారంలోకి వచ్చిన తరవాత రెండేళ్లపాటు భూసేకరణకు, టెండర్లు పిలవడానికి పోతే తరవాత మూడు సంవత్సరాలలో 23లక్షల ఎకరాలకు నీరిచ్చిన మొనగాడు ఈ దేశంలో ఎక్కడైనా ఉన్నారా చెప్పమని అడుగుతున్నాను. చంద్రబాబు నాయుడు గారు ఏమి చేశారు? మీ నాయకుడు ఇంకుడు గుంతల సిద్ధాంతం, నీరు–మీరు సిద్ధాంతం చెప్పారు. మా జిల్లాలో వందల కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. పది సంవత్సరాలలో ఏడు సంవత్సరాలు కరవు తాండవించే ప్రాంతంలో, చెరువులకు అయిదేళ్లలో ఒక్క చుక్క నీరు కూడా రాని ప్రాంతంలో నీరు–మీరు, ఇంకుడు గుంటల పథకం పెట్టారు. ఆ పనులను ఎగ్జైంప్లరీగా చెప్పుకున్నారు. ఆ విధంగా మీరు నీరు–మీరు కు నాయకుడిగా చెప్పుకున్నారు. (అంతరాయం) చంద్రబాబునాయుడుగారు ఇంకుడు గుంతలకే నాయకుడు గానీ, ఇందిరాసాగర్‌కు, పులిచింతల ప్రాజెక్ట్‌కు, లేకపోతే మరో ప్రాజెక్టుకు ఎపుడూ కూడా నాయకుడు కాలేదు. పోలవరం ప్రాజెక్ట్ కింద రూ.4000కోట్లు ఖర్చు చేసి కాలువలు తవ్విన రాజశేఖరరెడ్డిగారితో మీరు పోల్చుకోవద్దని నేను కోరుతున్నాను. రాజశేఖరరెడ్డిగారి గురించి చెప్పాలంటే వారు జయతీ ఘోష్ కమీషన్ రిపోర్టులోని సిఫార్సులను అమలుచేశారు. రైతాంగం ఆత్మహత్యలకు ప్రధాన కారణం .....

(అధికారపక్ష సభ్యులు 'రాజశేఖర రెడ్డిగారే' అని అన్నారు)

నేను చెబుతాను. రైతాంగం ఆత్మహత్యలకు ప్రధానమైన కారణాలుగా వ్యవసాయంలో అప్పులతోబాటు పిల్లల చదువుకోసం కూడా అప్పులు చేస్తున్నారని, ప్రైవేట్ వడ్డీ వ్యాపారులనుంచి తీసుకొన్న అప్పులు తీర్చలేక, వడ్డీలు కూడా చెల్లించలేక రైతాంగం ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలియగానే రాజశేఖరరెడ్డిగారు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా ఉచిత విద్య అందించి రైతాంగాన్ని ఆదుకున్నారు. మా అనంతపురం జిల్లాలో సరైన పౌష్టికాహారం అందక రోగాలబారిన పడినవారు ప్రభుత్వాసుపత్రులపై విశ్వాసం కోల్పోయి ఒక్కొక్కరూ హైదరాబాదు లేదా బెంగుళూరు వెళ్లి వైద్యం చేయించుకోవాలంటే ఒక్కొక్కరికి యాభై, అరవై వేలు ఖర్చు చేసి.....

మిస్టర్ ఛైర్మన్: విశ్వేశ్వర్‌రెడ్డిగారూ, డిమాండ్‌పై మాట్లాడండి. వైద్య, ఆరోగ్య రంగంలోకి వెళ్లకండి.

శ్రీ వై.విశ్వేశ్వర్ రెడ్డి (ఉరవకొండ): మీరు అర్థం చేసుకోవాలి. రైతుల ఆత్మహత్యలలో భాగంగా ఆసుపత్రుల ఖర్చులు పెరుగుతున్నాయని జయతీ ఘోష్ కమీషన్ గుర్తించి, రైతులకు వైద్యం చేయించడానికి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సిఫార్సు చేస్తే వారి సిఫార్సు మేరకు రెండెకరాలు, ఎకరా రైతు కూడా కార్పోరేట్ ఆసుపత్రులలో కాలి మీద కాలు వేసుకొని వైద్యం

పొందేలా ఆరోగ్యశ్రీ సౌకర్యాన్ని రాజశేఖరరెడ్డిగారు కల్పించారు. ప్రజలు తాము అనారోగ్యానికి గురైతే వైద్యం చేయించుకోలేక, చదువుకుంటున్న పిల్లలు వాళ్ల అమ్మానాన్నలు తమ పెళ్లిళ్లు చేయలేక ఆలోచిస్తూ మదనపడుతున్నారని జయతీ ఘోష్ రిపోర్టులో పొందుపరిస్తే, అందుకు అనుగుణంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేలాది పెళ్లిళ్లు జరిపించడం ద్వారా రైతుల అప్పులు తగ్గించడానికి రాజశేఖరరెడ్డిగారు ప్రయత్నం చేశారు.

జయతీ ఘోష్ రిపోర్టులో విత్తనాల సరఫరా గురించి కూడా ప్రస్తావించారు. ప్రభుత్వం అందించే విత్తనం చాలా తక్కువగా ఉండడంతో రైతులు ప్రైవేట్ విత్తన కంపెనీలపై ఆధారపడడంతోబాటు నాసిరకమైన కల్తీ విత్తనాలు కూడా రైతాంగం ఆత్మహత్యలకు కారణమని, రైతులు అప్పులు పాలవడానికి అది కూడా ఒక ప్రధాన కారణమని గుర్తించింది. గతంలో వారు అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయ విశ్వవిద్యాలయం సహా ప్రభుత్వ విత్తన సంస్థలన్నింటిని నిర్వీర్యం చేశారు. అపుడు కేవలం 5000 క్వింటాళ్ల పేరెంట్ విత్తనాలు మాత్రమే ఉత్పత్తి చేస్తుండగా, మొత్తం అవసరంలో అది కేవలం తొమ్మిది శాతం మాత్రమే. రాజశేఖరరెడ్డిగారు ముఖ్యమంత్రి అయిన తరవాత సర్టిఫైడ్ సీడ్ సరఫరా పెంచాలన్న విషయాన్ని గమనించిన రాజశేఖరరెడ్డి గారు తాను అధికారంలోకి వచ్చిన తరవాత వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఆంధ్రప్రదేశ్ విత్తన సంస్థకు నిధులు పెంచి రైతులకు అవసరమైన విత్తనాలు ప్రభుత్వరంగంలోనే ఉత్పత్తి చేసేలా వ్యవసాయ విశ్వవిద్యాలయం సహకారంతో ప్రభుత్వాధీనంలో వ్యవసాయ శాఖ, విత్తన సంస్థలను బలోపేతం చేశారు. ఆ విధంగా దాదాపు 43శాతం విత్తనాలను ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇవ్వడం జరిగింది. కానీ ఇపుడు హైబ్రిడ్ విత్తనాలకోసం ప్రైవేట్ విత్తన సంస్థలపైన...

మిస్టర్ చైర్మన్: తొందరగా ముగించండి.

(వైఎస్సార్‌సీపీ సభ్యులు శ్రీ జ్యోతుల నెహ్రూ నుంచి అంతరాయం)

నెహ్రూ గారూ, తొందరగా ముగించమని నేను కోరుతున్నాను. నేను ఏమి చెప్పానో మీరు వినకపోతే ఎలా? తొందరగా ముగించమని కోరుతున్నాను.

శ్రీ వై.విశ్వేశ్వర్ రెడ్డి (ఉరవకొండ): అధ్యక్షా, వ్యవసాయం సంక్షోభంలో పడడానికి కారణం ఆరోజు అధికారంలో ఉన్న చంద్రబాబు నాయుడు గారే. వ్యవసాయ విస్తరణ సేవల గురించి ఇపుడు మాట్లాడుతున్నారు. గతంలో ఏమి చెప్పారో ఒకసారి రికార్డులను పరిశీలించండి. వ్యవసాయశాఖలో 50శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అవన్నీ భర్తీ చేయమని మేం కోరితే నిధులు లేవని ప్రభుత్వం కేవలం ఫెసిలిటేటర్ పాత్ర మాత్రమే నిర్వహిస్తుందని, ప్రైవేట్ ఆగ్రో క్లినిక్‌లు ఏర్పాటుచేయడానికి ఆ రోజు ప్రయత్నం చేశారు.

(గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

...

రాజశేఖర్ రెడ్డి గారు ఆదర్శ రైతు కార్యక్రమాన్ని పెడితే తీసేస్తామంటున్నారు. తెలంగాణలో తెలుగుదేశం శాసన సభ్యులు కృష్ణయ్య గారు ఆదర్శ రైతుల ర్యాలీ నిర్వహించి ఆదర్శ రైతుల కార్యక్రమాన్ని కొనసాగించమని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరితే తెలంగాణ ప్రభుత్వం ఆదర్శ రైతుల సిస్టమ్‌ని కొనసాగించే కార్యక్రమం చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ప్రభుత్వ పెట్టుబడులు తగ్గిపోయాయి. రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎందుకు వ్యవసాయం గట్టెక్కిందంటే రాజశేఖర్ రెడ్డి గారు ప్యాడీ యొక్క ఎంఎస్‌పీకి సంబంధించి.....

MR.SPEAKER: Please conclude.

శ్రీ వై.విశ్వేశ్వర రెడ్డి (ఉరవకొండ)ః సార్, కనీస మద్దతు ధర రూ.380/- ఉంటే ఆ తరువాత 2003-04 కాలానికి రూ.550/- కి పెంచారు. అంటే చంద్రబాబు నాయుడు గారి కాలానికి ముందు, చంద్రబాబు నాయుడు గారి హయాంలో రూ.170/- మాత్రమే వరికి కనీస మద్దతు ధర పెరిగితే రాజశేఖర్ రెడ్డి గారి హయాంలో రూ.350/- నుంచి రూ.450/- లకు కనీస మద్దతు ధర పెరగడం జరిగింది. చంద్రబాబు నాయుడు గారు కేవలం ఎంఎస్‌పీ విషయంలోనే గాదు, ప్రొక్యూర్‌మెంటు విషయంలో కూడా చాలా వెనకబడ్డారు. రాజశేఖర్ రెడ్డి గారి హయాంలో 142 లక్షల టన్నుల వరి ఉత్పత్తి జరిగితే 90 లక్షల టన్నులు ఎఫ్‌సిఐ ద్వారా, 11 లక్షల టన్నుల క్వింటాళ్లు ప్రభుత్వానికి సంబంధించిన సీడ్ కంపెనీల ద్వారా కొనుగోలు చేయడం జరిగింది. అంటే రాజశేఖర్ రెడ్డి గారు 90 శాతం ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేయించి రైతుల యొక్క ఆదాయం పెరగడానికి, వ్యాపారస్తుల మార్కెట్ శక్తుల దయాదాక్షిణ్యాల పైన వ్యవసాయం ఆధారపడకుండా చేయడానికి ఆరోజు ప్రయత్నం చేశారు. రాజశేఖర్ రెడ్డి గారి హయాంలో బ్యాంకులు పెద్దయెత్తున కనీవినీ ఎరుగని రీతిలో రుణ సహాయాన్ని అందించాయి. రైతు కుటుంబంలో భార్య, భర్త, పిల్లలు ప్రతీ ఒక్కరూ పాస్‌బుక్స్ తీసుకుని బ్యాంకు మెట్లెక్కి రుణాలు తీసుకున్నారు. ఒక్క ఎకరా ఉన్న రైతు కూడా బ్యాంకు మెట్లెక్కి రుణాలు తీసుకునే సౌకర్యాన్ని రాజశేఖర్ రెడ్డి గారి హయాంలో పొందారు. 33 లక్షల మంది కొత్త రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వడం ద్వారా ప్రభుత్వం రైతులకి అండగా ఉందని భరోసా ఇచ్చారు. చంద్రబాబు నాయుడు గారి హయాంలో 50,000 కేసులు బనాయించి, స్టార్టర్లను జప్తు చేయించి, మోటర్లను జప్తు చేయించి రైతులను జైళ్లకు పంపితే రాజశేఖర్ రెడ్డి గారు వచ్చిన తరువాత మొత్తం కేసులన్నీ విత్‌డ్రా చేయడమే కాకుండా రూ.1200 కోట్ల విద్యుత్ బకాయిలు రద్దు చేయడంతో బాటు ఉచితంగా లక్షలాది మందికి కరెంటు ఇవ్వడం జరిగింది. తద్వారా పెద్ద యెత్తున వ్యవసాయ కనెక్షన్లు పెరిగాయి. అదేవిధంగా మైక్రో ఇరిగేషన్‌కు

సంబంధించి కూడా మేము గొప్పవాళ్లమని చెప్పుకుంటున్నారు. మీ హయాంలో 2003 వరకు కూడా ఒకటిన్నర లక్షల ఎకరాలు డ్రిప్పు, స్ప్రింకర్ల కింద కవర్ అయితే రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రి అయిన తరువాత మూడు రెట్లు 5 లక్షల ఎకరాల హెక్టార్లకు డ్రిప్పు, స్ప్రింక్లర్లను ఇరిగేషన్‌కు తీసుకు వచ్చారు.

రైతులు ప్రకృతి వైపరీత్యాలకు, మార్కెట్ శక్తుల దయాదాక్షిణ్యాలకు లోనై పంటలు నష్టపోతే ఆత్మహత్యలు చేసుకుంటుంటే వాళ్లను ఆదుకునే వ్యవస్థ లేదు. ఇన్సూరెన్స్ చట్టం రైతుల అవసరాలు తీర్చే చట్టంగా లేదు. ఆరోజు కరువు కాటకాలు వచ్చినా కూడా ఇన్సూరెన్స్‌ని అవసరమైన రీతిలో చంద్రబాబునాయుడు గారు బలోపేతం చేయలేకపోయారు. రాజశేఖర్‌రెడ్డి గారు ముఖ్యమంత్రి అయిన తరువాత భారతదేశంలోనే ఏ రాష్ట్రంలో చేయని విధంగా గ్రామాన్ని యూనిట్‌గా చేసి ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని న్యాయబద్ధంగా రైతులకు అందించడానికి ప్రయత్నం చేయడం జరిగింది. ఆ విధంగా ఎంఎస్‌పీ విషయంలో గానీ, గ్రోత్ రేటు విషయంలో గానీ, తలసరి ఆదాయం విషయంలో గానీ, ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేసే విషయంలో గానీ రైతాంగం యొక్క నష్టాల్లో, కష్టాల్లో పాలు పంచుకోవడంలో గానీ రాజశేఖర్ రెడ్డి గారు మానవీయ కోణాన్ని ప్రదర్శించారు. చంద్రబాబునాయుడు గారికి, రాజశేఖర్ రెడ్డి గారికి ఉన్న తేడా అదేనని నేను ఈ సందర్భంగా చెబుతున్నాను. ఒక వ్యాపారవేత్తలాగా చంద్రబాబు నాయుడు గారు ఆలోచిస్తారు. ఆయన ఒక మంచి వ్యాపారవేత్త. ఆయన వ్యాపార లక్షణాల్లో, ఆయన వ్యాపార విధానాల్లో మానవత్వం ఉండదు. రాజశేఖర్ రెడ్డి గారి విధానాల్లో మానవత్వం పూర్తిగా ఉంటుంది....

శ్రీ కాలవ శ్రీనివాసులు(రాయదుర్గం)ః సార్, నేను ఇక్కడ ఎవర్నీ విమర్శించదలచుకోలేదు. విశ్వేశ్వర రెడ్డి గారు చాలా కాలంగా కమ్యూనిస్టు ఉద్యమాల్లో పని చేశారు. రైతు ఉద్యమాల్లో పని చేశారు. సిపిఐ, సిపిఎమ్ నుంచి వచ్చి వైఎస్ఆర్‌సిపి నుంచి ఎంఎల్ఏగా ఎన్నికయ్యారు. చాలా సంతోషం. కానీ ఇన్నేళ్లు రైతుల సమస్యల మీద పనిచేసిన ఆయన కూడా రాజశేఖర్ రెడ్డి గారి హయాంలో ప్రతీ రోజూ 2000 మంది రైతులు వ్యవసాయాన్ని వదిలిపెట్టి వేరే వ్యాపకాల్లో పోతే, ఆర్థిక సంక్షోభంలో వ్యవసాయం కూరుకుని పోయి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే, ఇన్‌పుట్ సబ్సిడీ ఏ విధంగా, క్రాప్ ఇన్సూరెన్సు ఏ విధంగా తెచ్చివ్వాలో మొట్ట మొదటిసారిగా ఈ రాష్ట్రానికి చూపించిన నాయకుడు చంద్రబాబు నాయుడు గారు. అట్లాంటి నాయకుణ్ణి విమర్శించి, రాజశేఖర్ రెడ్డి గారిని పొగడటానికి ఒక్కటంటే ఒక్కటైన ప్రధాన ప్రతిపక్ష పార్టీగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ.... (మైకు కట్ చేయబడింది)

శ్రీ వై.విశ్వేశ్వరరెడ్డి (ఉరవకుండ)ః థ్యాంక్యూ శ్రీనివాస రెడ్డి గారూ.... శ్రీనివాస్ గారిని నేను అభినందిస్తున్నాను. ఎందుకంటే శ్రీనివాస్‌గారు ఈ స్థాయికి ఎదగడానికి కారణం

చంద్రబాబు నాయుడు గారే. రాజకీయాల్లో నైతిక విలువలు నశించిన ఈ రోజుల్లో ఆ మాత్రం లాయల్టీ ఉండటాన్ని నేను అభినందిస్తున్నాను. కానీ ఈ సందర్భంగా నేను కోరేది ఒక్కటే. విధానాలే ప్రధానమైనవి. బడ్జెట్‌లో రూ.5000 కోట్లు రుణ మాఫీ గురించి చెప్పాను. రూ.3500 కోట్లు విద్యుత్ సబ్సిడీ గురించి చెప్పాను. రూ.1300 కోట్లు ఎన్ఆర్ఇజిఎస్ గురించి చెప్పాను. అదే కాకుండా సెంటర్ నుంచి వచ్చే నిధులన్నీ వీటన్నింటి ద్వారా చూపించారు. అందుకనే వీళ్లు ఖర్చు పెట్టే డబ్బుపైన ఈ రాష్ట్రంలో ఉన్న వ్యవసాయ విధానమంతా మారిపోతుందని నేను చెప్పడం లేదు. ఈ రాష్ట్రంలోని వ్యవసాయదారులకు మంచి రోజులు వస్తాయని నేను చెప్పడం లేదు. ఇక్కడ విధానాలే ప్రధానమైనవి. ఎప్పుడు ఆత్మహత్యలు ప్రారంభమైనాయి. ఈ దేశంలో నూతన ఆర్థిక విధానాలు, స్ట్రక్చరల్ అడ్జస్ట్‌మెంటు ప్రోగ్రామ్స్, W.T.O. ఇవన్నీ వచ్చిన తరువాత ప్రారంభమైనాయి. మనం సోమరులైనందువలన వ్యవసాయంలో నష్టపోవడం లేదు. కేవలం కరువు వలన నష్టపోవడం లేదు. అంతర్జాతీయంగా వచ్చిన మార్పులు, W.T.O. లాంటి ఆర్గనైజేషన్స్, వరల్డ్ బ్యాంకు లాంటి డిక్టేట్ చేసే ఆర్గనైజేషన్స్ వీటన్నింటి ప్రభావం మన పైన ఉంది. సెనగలపైన దిగుబడి సుంకం తగ్గిస్తే మన రైతులు అమ్ముకోవడానికి లేదు. సెరికల్చర్ పైన అంటే చైనా సిల్కు పైన దిగుమతి సుంకం తగ్గిస్తే ఇక్కడున్న సెరీ కల్చర్ రైతులు నష్టపోతున్నారు. ఆయిల్ సీడ్స్ పైన దిగుమతి సుంకాన్ని తగ్గిస్తే వ్యవసాయం చేసే రైతులంతా నష్టపోతున్నారు. అందుకనే ఈరోజు అంతర్జాతీయంగా వస్తున్న సవాళ్లను ఎదుర్కోవడానికి రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వాలు వ్యవసాయానికి మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని గుర్తించాలని ఈ సందర్భంగా నేను వినయపూర్వకంగా విజ్ఞప్తి చేస్తున్నాను.

ధరల విషయంలో రాజశేఖర్ రెడ్డి గారు చేసింది చాలా సాహసోపేతమైన నిర్ణయం. మన్‌శాంటో లాంటి కంపెనీలను ఎదుర్కోవడం అంత సులభమైన విషయం కాదు. వాళ్లతో సుప్రీం కోర్టు వరకు వెళ్లి కేవలం రూ.750/-లకు ఆరోజు మన్‌శాంటోకు సంబంధించిన కాటన్‌సీడ్ ధరలు తగ్గించే ప్రయత్నం చేశారు. ఇవన్నీ ఎందుకు సాధ్యమైందంటే రాజశేఖర్ రెడ్డి గారు ఆ కమీషన్‌ల యొక్క రిపోర్టులను చదివారు. వాటిని అమలు చేశారు. ఈరోజు స్వామినాథన్ కమీషన్ గురించి చాలా విషయాలు చంద్రబాబు నాయుడు గారు చెప్పారు. చంద్రబాబు నాయుడు గారికి వైఎస్ఆర్ హయాంలో వేసిన రాంచెన్నారెడ్డి కమీషన్ రిపోర్టు నచ్చకపోవచ్చు. పి.ఏ.చౌదరి కమీషన్ రిపోర్టు నచ్చకపోవచ్చు. జయతీఘోష్ కమీషన్ నివేదిక నచ్చకపోవచ్చు. కానీ స్వామినాథన్ కమీషన్ ప్రొడక్షన్ గురించి, ప్రొడక్టివిటీ గురించి చెబుతూ రైతు ఖర్చుకి సరైన ఆదాయాన్ని పొందుతూ రైతు నవ్వుతూ ఉంటే ప్రొడక్షన్, ప్రొడక్టివిటీ అవంతట అవే పెరుగుతాయని చెప్పారు. రైతు పెట్టే ఖర్చుకు అదనంగా 50 శాతం కనీస మద్దతు ధరని ఇవ్వగలిగే పరిస్థితిని మనం తీసుకురాకుండా రైతాంగం యొక్క పరిస్థితి మారదని చెప్పారు. మీ ఎన్నికల మేనిఫెస్టోలో ఏమి చెప్పారు. వ్యవసాయ రంగ ధరల స్థిరీకరణ కోసం రూ.5000 కోట్ల నిధిని కేటాయిస్తామని చెప్పారు.

MR.SPEAKER: Please conclude.

శ్రీ వై.విశ్వేశ్వరరెడ్డి (ఉరవకొండ)ః ఈ బడ్జెట్‌లో ధరల స్థిరీకరణకు సంబంధించి ఒక్క రూపాయైనా కేటాయించారా అని అడుగుతున్నాను. మీరు రైతుకు కనీస మద్దతు ధరని న్యాయంగా ఏ విధంగా ఇస్తారని అడుగుతున్నాను. ఆ విషయం బడ్జెట్‌లో రిఫ్లెక్ట్ కావడం లేదని నా బాధను వ్యక్తం చేస్తున్నాను. చివరగా నేను ఒక్కటే చెబుతున్నాను. నేను ముగించే ముందు ఈ రాష్ట్రంలో డిస్పారిటీస్‌ని రద్దు చేయవలసిన అవసరం ఉంది. ఈ బడ్జెట్‌లో ముప్పై లక్షల రైతుల గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఈ రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న చిన్న, సన్నకారు రైతుల గురించి బడ్జెట్‌లో మాట వరుసకు కూడా ప్రస్తావన లేదు. చంద్రబాబు నాయుడు గారి హయాంలో క్లింటన్ గారు హైదరాబాద్‌కు వచ్చినప్పుడు రోడ్డులో ఉన్న బిక్షగాళ్లనంతా అరెస్టు చేసి హైదరాబాద్ నగరం సుందరంగా ఉందని బిక్షగాళ్లు లేని నగరంగా చూపెట్టే ప్రయత్నం చేశారు. మీరు ఆ విధంగా ఈ బడ్జెట్ ద్వారా ఈ రాష్ట్రంలో చిన్న, సన్నకారు రైతులు లేరని చూపెట్టదలచుకున్నారా, కౌలు రైతులకు బాధలు లేవని చూపెట్టదలచుకున్నారా అని అడుగుతున్నాను. వాటన్నింటినీ సరైన రీతిలో అటెండ్ కావాలని చెబుతున్నాను. చివరిగా అనంతపురం జిల్లా రైతుగా నేను చెప్పేదేమంటే అనంతపురం జిల్లా పది సంవత్సరాల్లో ఏడెనిమిది సంవత్సరాలు కరువుకు గురయ్యే ప్రాంతం. మా నియోజక వర్గంలోని ఒక మండలంలోనే కేవలం 350 మిల్లీమీటర్ల వర్షపాతం కురుస్తుంది. మా జిల్లాలో మూడు శాతం మాత్రమే అస్యూర్డ్ నీటి సదుపాయం ఉంది. మా జిల్లాలో భూగర్భ జలాలు అత్యంత దారుణంగా ఉన్నాయి. మాలాంటి జిల్లాలకు ఈ బడ్జెట్‌లో ఏమిస్తున్నారు? మా జిల్లాలో 12 సీట్లను చంద్రబాబు నాయుడు గారి మీద విశ్వాసం ఉంచి గెలిపించారు. హిందూపురం నుంచి గతంలో ఎన్‌టి రామారావు గారిని, హరికృష్ణ గారిని, ఇప్పుడు బాలకృష్ణ గారిని అందర్నీ గెలిపించడం ద్వారా మీకు అక్కడి ప్రజలు విశ్వాసం చూపిస్తున్నారు. ఆ జిల్లా పట్ల మీరు ఎలాంటి వైఖరి తీసుకుంటారని అడుగుతున్నాను. ఒక్క ఉదాహరణ చెబుతాను. హంద్రీనీవాకు రూ.5200 కోట్లు ఇప్పటి వరకూ ఖర్చు పెడితే రూ.4200 కోట్లు ఒక్క రాజశేఖర్ రెడ్డి గారి హయాంలోనే ఖర్చు పెట్టడం జరిగింది. రూ.250 కోట్లు ఇస్తే కర్నూలు, అనంతపూర్ జిల్లాలో 4 లక్షల ఎకరాలకు నీళ్లివ్వొచ్చు. మీ లక్ష కోట్ల రూపాయల బడ్జెట్‌లో మా జిల్లాకు ఇవ్వడానికి రూ.300 కోట్లు ఇవ్వడానికి మనసు లేదా అని ఈ సందర్భంగా అడుగుతున్నాను.

MR.SPEAKER: Please conclude.

శ్రీ వై.విశ్వేశ్వర రెడ్డి (ఉరవకొండ)ః సార్, ఈ మధ్య కాలంలోనే కేంద్రం నుంచి అయ్యప్పన్ కమిటీ వచ్చింది. అంతర్జాతీయంగా ప్రసిద్ధి గాంచిన శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు, పెద్ద పెద్ద సైంటిస్టులు వీళ్లందరితో కమిటీ వేసి అనంతపురం జిల్లాలో వ్యవసాయాన్ని ఏవిధంగా గట్టెక్కించాలని గత కేంద్ర ప్రభుత్వం కొంత ప్రయత్నం చేసింది. వాళ్లు వేసిన కమిటీ రూ.76,176 కోట్లతో ఒక ప్రాజెక్టుని ఈ రాష్ట్రం ముందుంచింది. దానికి డబ్బంతా కేంద్రమే

భరిస్తామని చెప్పింది. ప్రణాళికా సంఘం ఆమోదించింది. ఎన్నికలు వచ్చి ఆగిపోతే తాత్కాలికంగా రూ.100 కోట్లు ఇవ్వడం జరిగింది. కేంద్ర ప్రభుత్వాన్ని మీరు ఒప్పించండి. మీరు గవర్నమెంటులో ఉన్నారు, రాష్ట్రంలో కూడా బిజెపి ఉంది. మీరు ఒప్పించి అలాంటి స్కీములను అనంతపూర్ జిల్లా లాంటి జిల్లాలకు తీసుకు రావడం ద్వారా రాబోయే కాలంలో రియలిస్టిక్‌గా ఆలోచించండి. వ్యవసాయానికి సంబంధించి దేశంలో రాజశేఖర్ రెడ్డి గారి విధానాలే మోడల్. (మైకు కట్ చేయబడింది)

(ఈ సందర్భంలో విశ్వేశర రెడ్డి గారికి మైకు ఇవ్వాలని వైఎస్ఆర్‌సీపీ సభ్యులు కోరారు)

MR.SPEAKER: Please conclude.

శ్రీ వై.విశ్వేశ్వర రెడ్డి (ఉరవకొండ)ః సార్, నేను ముగిస్తాను. సార్, ఆరోజు రామారావు గారు గొప్ప మానవతా హృదయంతో బహిరంగ మార్కెట్‌లో కిలో బియ్యం రూ.5/- ఉన్నప్పుడు రెండు రూపాయల కిలో బియ్యం పథకాన్ని అందిస్తే అదొక మంచి స్కీమని, మంచిని ఆహ్వానించే మనస్తత్వం ఉంది కాబట్టే రాజశేఖర్ రెడ్డి గారు రూ.18/- బహిరంగ మార్కెట్‌లో ఉన్నప్పుడు రెండు రూపాయల కిలో బియ్యం ఇచ్చారు. అదే విధంగా వ్యవసాయంలో కూడా రాజశేఖర్ రెడ్డి గారి విధానాల్లో ఉన్న ఆదర్శం ఈరోజు అందరూ అంగీకరించాలి. మీరు కూడా రాబోయే కాలంలో రాజశేఖర్ రెడ్డి గారి విధానాల నుంచి వైదొలగకుండా అమలు చేస్తే ఈ రాష్ట్ర రైతాంగానికి మంచి జరుగుతుంది.

శ్రీమతి పీతల సుజాత (చింతలపూడి)ః అధ్యక్షా, గౌరవ సభ్యులు మాట్లాడింది చూస్తే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది. వారు గత వైఎస్ఆర్ గారి ప్రభుత్వాన్ని చాలా పొగుడుతున్నారు. ఈరోజున గత పది సంవత్సరాల్లో వేలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోవడానికి కారణం వైఎస్ఆర్ గారు కాదా? ఎస్ఇజెడ్‌ల పేరు చెప్పి రైతుల పొలాలను ఆక్రమించుకుని వాళ్ల కుటుంబ సభ్యులకు కంపెనీ పేర్లు పెట్టి దోచుకున్నది ఎవరు సార్? కాంగ్రెస్ ప్రభుత్వం, వైఎస్ఆర్ గారు కాదా? అదే విధంగా ఇరిగేషన్ ప్రాజెక్టులకు మొబిలైజేషన్ అడ్వాన్సుల కింద కాంట్రాక్టర్లకు వేల కోట్ల రూపాయలు ఇచ్చి రైతులు ఆత్మహత్యలు చేసుకునేలా చేసింది ఎవరు సార్? కాంగ్రెస్ పార్టీ - వైఎస్ఆర్ గారు కాదా? ఈరోజున వాళ్లు వాళ్లిష్టమొచ్చినట్లుగా మాట్లాడుతున్నారు. సార్, చంద్రబాబు నాయుడు గారికి తెలివితేటలు ఎక్కువ. ఎందుకంటే ఏ రూపంలోనైనా సరే కేంద్రం నుంచి గ్రాంట్లు అడిగి పేదలకు న్యాయం చేయాలనే విషయంలో తెలివితేటలు ఎక్కువ ఉన్నాయి. దోచుకునే విషయంలో చంద్రబాబు నాయుడు గారికి తెలివితేటలు లేవు. అది వాళ్లు గమనించాలని తెలియచేస్తున్నాను. ఆరోగ్యశ్రీ ద్వారా కార్పోరేట్లకు డబ్బులన్నీ దోచి పెట్టింది కాంగ్రెస్ పార్టీ - రాజశేఖర్ రెడ్డి గారు. ఆ విషయాన్ని సభ్యులంతా గుర్తుంచుకుంటే మంచిది.

శ్రీ పి.శ్రీనివాసులురెడ్డి (కోవూరు)ః థ్యాంక్యూ సార్. వ్యవసాయ బడ్జెట్ మీద మాట్లాడే అవకాశం కల్పించిన మీకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను. ఈరోజు ఈ అంశం మీద గౌరవ సభ్యులు చాలా మంది మాట్లాడారు.

మిస్టర్ స్పీకర్ః మీకు పది నిమిషాల సమయం ఉంది.

శ్రీ పి.శ్రీనివాసులురెడ్డి (కోవూరు)ః ఇప్పుడే మాట్లాడిన గౌరవ సభ్యులు శ్రీ విశ్వేశ్వర రెడ్డి గారు అనేక విషయాల గురించి ఈ సభలో ప్రస్తావించడం జరిగింది. నేను మీద్వారా గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను. 2004వ సంవత్సరంలో ఆనాడు శాసన సభ్యుడిగా ఎన్నికై, కాంగ్రెస్ పార్టీలో రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 5 సంవత్సరాల పాటు ఆయనతో కలిసి పనిచేసిన నేను, ఆయన యొక్క గొప్పను గానీ, ఆయన పని విధానాన్ని గానీ, ఆయన రైతాంగానికి చేసిన మేలు గురించి గానీ చెప్పాలి. మీరు బయట ఏదో కార్మిక నాయకుడిగా ఉండి, వివిధ పార్టీల్లో పనిచేసి ఈరోజు వైఎస్ఆర్సీపీ తరఫున టిక్కెట్ పొంది, మీరు గెలుపొంది, ఎందుకు పార్టీ మారారో ప్రజలకు చెప్పుకోలేక ఈరోజు అనేక రకాలుగా రాజశేఖర్ రెడ్డి గారిని పొగుడుతున్న పరిస్థితిని బయట ఉన్న మీ నియోజక వర్గ ప్రజలు గమనిస్తున్నారన్న విషయాన్ని మరువ వద్దని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, గత దశాబ్ద కాలంగా రైతుల యొక్క దుస్థితి ఏ విధంగా ఉందో గౌరవ సభ్యులను ఆలోచన చేయమని మనవి చేస్తున్నాను. కరెంటు సరఫరా సరిగా జరిగిందా ఒక్కసారి గుండె మీద చేయి వేసుకుని చెప్పాలని కోరుతున్నాను. ఏడు గంటల పాటు కరెంటు ఇస్తామని చెప్పి రైతాంగాన్ని మోసం చేసి, ఉచిత కరెంటు పేరిట ఎంతో మంది రైతుల ప్రాణాన్ని పణంగా పెట్టిన విషయం వాస్తవం కాదా ఒక్కసారి ఆలోచించాలని కోరుతున్నాను. కల్తీ విత్తనాలు, కల్తీ ఎరువులు ఒక వైపు, మరోవైపు గిట్టుబాటు ధర లేక నిలువ చేసుకునే గోడౌన్లు లేక గత పది సంవత్సరాలుగా వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసిన విషయాన్ని గమనించాలి. ఈ సభలో 80 శాతం మంది సభ్యులు వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తులు. కాబట్టి వ్యవసాయం మీద తప్పుడు మాటలతో, తప్పుడు విధానాలతో ఈ రాష్ట్ర రైతాంగాన్ని దయచేసి మాయ మాటలతో అన్యాయం చేయవద్దని గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను.

...

కాబట్టి వ్యవసాయం మీద తప్పుడు మాటలతో తప్పుడు విధానాలతో ఈ రాష్ట్ర రైతాంగాన్ని మాయ మాటలతో అన్యాయం చేసిన విషయాన్ని గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను. ఈరోజు పెద్ద పెద్ద మాటలను మాట్లాడుతున్నారు, 2004వ సంవత్సరంలో వైఎస్ రాజశేఖరరెడ్డి గారు ముఖ్యమంత్రి అయిన తర్వాత జలయజ్ఞం పేరిట కార్యక్రమాలను చేపట్టి, దానిని జలయజ్ఞంగా మార్చి ఈ రాష్ట్ర ప్రజానీకాన్ని, రైతాంగాన్ని దోపిడి చేసిన విషయం వాస్తవం కాదా అని అడుగుతున్నాను. కోట్లాది రూపాయలను ఖర్చు పెట్టారు, మెబిలైజేషన్

అడ్వాన్సులను ఇచ్చారు, మీ కడుపులను నింపుకున్నారు. ఈ రాష్ట్రాన్ని దగా చేసారు తప్ప ఏ విధంగా కూడా రైతుల యొక్క ప్రయోజనాలను కాపాడలేదనే విషయాన్ని గౌరవ సభ్యులు గమనించవలసిందిగా కోరుతున్నారు. దేశానికి అన్నం పెట్టిన అన్నపూర్ణ లాంటి ఈ రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల రైతులు పంట విరామాన్ని ప్రకటించారంటే ఇంతకంటే ధారుణమైన సంఘటన ఈ భారతదేశంలో మరెక్కడైనా జరిగిందాఅని అడుగుతున్నాను. అదే రాజశేఖరరెడ్డి గారు వ్యవసాయం గురించి శ్రద్ధ తీసుకొని ఉంటే, స్వామినాధన్ కమిటీ సిఫార్సులను అమలు చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేదా అని అడుగుతున్నాను.

(అంతరాయం)

విశ్వేశ్వరెడ్డి గారు మీరు చెప్పండి.. రైతులు పంట విరామాన్ని ప్రకటించారంటే, రైతులుగా, రైతు కుంటుంబాల నుండి వచ్చిన ప్రతినిధులుగా మనందరికీ సిగ్గుచేటు కాదా అని అడుగుతున్నాను. రైతులు బాగుంటేనే గ్రామాలు బాగుంటాయి, గ్రామాలు బాగుంటేనే సమాజం బాగుంటుంది. రైతులకు భద్రత ఉంటేనే ఆహార భద్రత కార్యక్రమం విజయవంతమవుతుంది. అందరికీ సహాయం చేసేది వ్యవసాయం. వ్యవసాయం అనే మాటలోనే సహాయం ఉంది. ఈ రైతులు అనే వ్యక్తులకు ఒక ప్రక్కన ప్రకృతి వైపరిత్యాలు, ఏనాడు కూడా రైతులు విత్తకుండా ఫలితాన్ని ఆశించలేదు. రాష్ట్రంలో ఉన్న ఏ రైతుకైనా యాచించే విధానం ఉండదు. అన్నదాతలైన రైతులకు నిరంతరంగా అనేక రకాల ఇబ్బందులు పడే పరిస్థితిని తీసుకొచ్చింది గత ప్రభుత్వం కాదా అని అడుగుతున్నాను. రైతు కుటుంబాల సంఖ్య గురించి ఒక్కసారి ఆలోచన చేస్తే 37.7 శాతం నుండి 24.6 శాతానికి పడిపోయిన విషయం వాస్తవం కాదా? ప్రతి రోజు రెండు వేల మంది రైతులు వ్యవసాయాన్ని ఒదిలేసి ఇతర పనులను వెతుక్కుంటున్న విషయం వాస్తవం కాదా, ఒక్కసారి ఆలోచన చేయాల్సిందిగా మనవి చేస్తున్నాను. అదే విధంగా 1950వ సంవత్సరంలో 55 శాతంగా ఉన్న జీడీపీని 14 శాతానికి తీసుకొచ్చారు. అందుకు గత 10 సంవత్సరాల రాజశేఖరరెడ్డిగారి పరిపాలన కారణం కదా, పరిపాలన బాగుంటే ఎందుకు జీడీపీ రేటు పడిపోయిందో చెప్పాల్సిందిగా కోరుతున్నాను.

(అంతరాయం)

చెప్పాల్సిన బాధ్యత మీకు లేదా అని అడుగుతున్నాను. (వైఎస్ఆర్సిపి సభ్యులను ఉద్దేశించి) నీకేమి తెలుసు నీవు కూర్చో.. నీవు కూర్చోవయ్యా.. నీవు నిన్న మొన్నటి దాకా అమెరికాలో తిరిగి వచ్చావు, వ్యవసాయం గురించి నీకేమి తెలుసు, వ్యవసాయం గురించి, వ్యవసాయంలో ఉండే కష్టసుఖాల గురించి, రైతు కష్టసుఖాల గురించి, రైతుల బాధల గురించి మీకేమి తెలుసండీ. మీ నాయకుడు విదేశాల్లో చదువుకొని వచ్చాడు. వ్యవసాయం గురించి తెలియదు. రైతుల

కష్టసుఖాలు తెలియవు. ఈరోజు మీరు కూడా రైతుల గురించి మాట్లాడుతున్నారంటే ఇది అవమానకరమైన విషయమని ఈ సందర్భంలో నేను మనవిచేస్తున్నాను.

(అంతరాయం)

శ్రీ జి.శ్రీకాంత్‌రెడ్డి (రాయచోటి)ః (మైక్ లేకుండా) క్లారిఫికేషన్ ఇస్తాం సార్.

శ్రీ పి.శ్రీనివాసులు రెడ్డి (కోవూరు)ః అధ్యక్షా, ఎలాంటి పంటలనైనా సాగు చేసే దానికి విభిన్నమైన పరిస్థితులు మన రాష్ట్రంలో ఉన్నాయి. ఈరోజు ఆహార ధాన్యాల ఉత్పత్తి వార్షిక రేటు 4.5 శాతం నుండి 1.3 శాతానికి పడిపోయిన విషయం వాస్తవం కాదా అని అడుగుతున్నాను. మీకు, కాంగ్రెస్ పార్టీకి ఏమి సంబంధం ఉందని అడుగుతున్నాను. మాట్లాడితే మీరు పైకి లేస్తారు. (వైఎస్ఆర్‌సిపి సభ్యులను ఉద్దేశించి) మాట్లాడితే మీరు ముందుకు వస్తారు. గత ప్రభుత్వానికి మీకు ఏమిటి సంబంధం? మీ పార్టీని స్థాపించింది ఎప్పుడు? మీ పార్టీ అధికారంలోకి వచ్చింది ఎప్పుడు? ప్రతి దానికి మీరు ఎదురొస్తున్నారే.. శ్రీకాంత్‌రెడ్డి గారూ.. మీరు నాతో కూడా కలిసి పని చేశారు.

(అంతరాయం)

ఈరోజు దేశ ప్రజలందరి ఆకలిని తీర్చాలంటే 2020 సంవత్సరం నాటికి 30 కోట్ల టన్నుల ఆహార ధాన్యాల అవసరం ఉంది. అదే విధంగా 13 కోట్ల లక్షల బియ్యం, 11 కోట్ల లక్షల గోదుమలు, 144 శాతం పప్పు ధాన్యాలు, 240 శాతం నూనె గింజలను అదనంగా పండించాల్సిన అవసరం ఉంది. అందుచేత తమరి ద్వారా ప్రభుత్వానికి నేను మనవి చేసేదేమంటే, మెట్ట భూముల్లో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చినప్పుడే దేశంలో ఉండే పేదరిక సమస్య పరిష్కారమవుతుంది. అదే విధంగా ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్ధతు ధర ఆయా పంటల ఉత్పత్తి ధర కన్నా 10 శాతం నుంచి 30 శాతం తక్కువగా ఉంది. క్వింటా ధాన్యం ఉత్పత్తి వ్యయం రూ.2100 ఉంటే కనీస మద్ధతు ధర రూ.1400 ఉంది. మధ్యలో ఉన్న దళారీల కమీషన్ పోను రైతు చేతికి కేవలం రూ.1000 దక్కుతుంది. అదే విధంగా పత్తి, మిరప, చెరకు, పొగాకు, వేరుసెనగ, మొక్క జొన్న తదితర పంటలను సాగు చేసే రైతాంగం మొత్తం మద్ధతు ధర లభించక అప్పుల్లో కూరుకుపోయిన పరిస్థితిని తమరి ద్వారా సభ దృష్టికి తీసుకొస్తున్నాను. అదే విధంగా వ్యవసాయ పరిశోధనా రంగాలు గత పది సంవత్సరాల కాలంలో నిర్లక్ష్యం చేయబడ్డాయి. పరిశోధనకు అవసరమైన నిధులను కేటాయించకపోవడం, రైతులకు క్రొత్త పరిజ్ఞానం అందుబాటులోకి రాకపోవడం వల్ల రైతులు ధారుణంగా నష్టపోయిన విషయాన్ని గౌరవ సభ్యులు గమనించాల్సిందిగా తమరి ద్వారా కోరుతున్నాను.

(అంతరాయం)

బాస్కర్‌రెడ్డన్నా.. అక్కడ తిరుమలలో దోచుకున్నారు చాలలేదు, మళ్లా జలయజ్ఞం చేశారు దాంట్లో కూడా దోచుకున్నారు. రోజు సభలో ఈ విధంగా గోల చేస్తే ఎట్లన్నా..

MR.SPEAKER: Please continue. Confine yourself to the subject.

శ్రీ పి. శ్రీనివాసులు రెడ్డి (కోవూరు)ః అధ్యక్షా, ఒక్కసారి జలయజ్ఞాన్ని పరిశీలించినట్లయితే, ఇటు వ్యవసాయాన్ని అటు అనుబంధంగా వచ్చే ఇతర రంగాలనైనా సరే, గతంలో జలయజ్ఞాన్ని ధనయజ్ఞంగా మార్చురు. విపత్తు సమయంలో సహాయం చేయలేదు. బీమా పరిహారాన్ని అందించలేదు. పండించిన పంటలకు ధరను చెల్లించే పరిస్థితి లేదు. రైతులు అప్పులపాలై ఆవేదనతో కాడిని క్రింద పడేస్తున్నా, గత ప్రభుత్వంలో పని చేసిన పాలకులకు చిత్తశుద్ధి లోపించడం వలన, రైతాంగాన్ని వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసిన విషయాన్ని సభ్యులు గమనించాల్సిన అవసరం ఉంది. విత్తనాలు, ఎరువులు, పంట రుణాల పంపిణీని అస్తవ్యస్తం చేశారు. విత్తనాలు దొరకక రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. పోలీసు స్టేషన్లలో ఎరువుల పంపిణీ చేశారు. ఇది వాస్తవం కాదా? ఎరువుల కోసం రైతులు వెళ్లితే వారి మీద లాఠీ చార్జ్ చేయించారు. మద్ధతు ధర లేక ధాన్యాన్ని రైతులు తగులబెడుతుంటే ఆనాటి ప్రభుత్వానికి సిగ్గుఎగ్గులేదా అని అడుగుతున్నాను.

(అంతరాయం)

ఈరోజున మాట్లాడుతున్నారు. ఏమిటయ్యా రైతాంగానికి మీరు చేసింది. (వైఆర్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులను ఉద్దేశించి) రైతుల సమస్యలను ఏమి పరిష్కరించారని అడుగుతున్నాను. పావలా వడ్డీ అన్నారు, పావలా వడ్డీని ఎక్కడ ఇచ్చారు? రైతులు అప్పుల ఊబిలో చిక్కుకొని సర్వనాశనమైపోయి, రైతు కుటుంబాలు ఆత్మహత్యలు చేసుకున్న పరిస్థితులు ఉన్నాయి. పావలా వడ్డీ అనేది పరమ బూటకమైన కార్యక్రమం తప్ప, ఏ రైతు సోదరుడు కూడా ప్రయోజనం పొందలేదనే విషయాన్ని తమరి ద్వారా సభ దృష్టికి తీసుకొస్తున్నాను. ఇప్పుడు విశ్వేశ్వరరెడ్డి గారు మాట్లాడుతున్నారు. గత 10 సంవత్సరాల కాలంలో ఎరువుల ధరలను 14 సార్లు పెంచిన విషయం వాస్తవం కాదా అని అడుగుతున్నాను. 2004వ సంవత్సరానికి ముందు డీఏపీ ధర రూ.400 ఉంటే దానిని రూ.1300 లకు పెంచారు. ఇది వాస్తవం కాదా, రైతులకు మీరు అన్యాయం చేయలేదా, వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేశారనే విషయాన్ని తమరి ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

ఆహారశుద్ధి విధానానికి రూ.3,000.00 కోట్ల బడ్జెట్ కేటాయించినా ఆనాటి పాలకుల నిర్లక్ష్యం వల్ల అది నిరూపయోగమైపోయింది. ఫుడ్ పార్క్‌లు, రైతు బజార్లు కేవలం కాగితాలకే

పరిమితమైపోయాయి. చివరకు స్వామినాథన్ కమిటీ సిఫారస్‌లను కూడా ఆనాటి పాలకులు బుట్టదాఖలు చేసినటువంటి చరిత్ర ఉంది. ఆనాడు రైతుల మరణాల గురించి మరల చెప్పాల్సిన పనిలేదు.

అధ్యక్షా, నేను గతంలో కూడా 2004-05వ సంవత్సరపు వ్యవసాయ బడ్జెట్ పైన సభలో మాట్లాడడం జరిగింది. నాకంటే ముందు బి.జె.పి.కి చెందిన గౌరవ శాసనసభ్యులు, శ్రీ జి.కిషన్ రెడ్డి గారు వ్యవసాయ బడ్జెట్ పైన ప్రసంగించడం జరిగింది. అయితే, కిషన్‌రెడ్డి గారు రైతు సమస్యల గురించి ప్రస్తావన చేసిన సందర్భంలో కొంత ఆవేదన చెందడం జరిగింది. రాజశేఖరరెడ్డి గారి ప్రభుత్వం రైతులకు మేలు చేస్తుంటే, కిషన్ రెడ్డి గారేమో రైతు సమస్యల గురించి సభలో ప్రస్తావిస్తున్నారని నేను ఆశ్చర్యానికి గురైనాను. కిషన్ రెడ్డి గారి వాదనకు మేం కౌంటర్ ఇవ్వడం జరిగింది. కానీ ఆనాడు రైతాంగానికి ఇచ్చిన ఏ వాగ్ధానం కూడా నెరవేరలేదనే విషయాన్ని గట్టిగా సభకు చెబుతున్నాను. నెల్లూరు జిల్లాలోని డెల్టా రైతాంగానికి ఆసరాగా ఉంటుందని సంగం బ్యారేజీకి ఆనాటి రాజశేఖరరెడ్డి గారు శంఖుస్థాపన చేశారు. 2006వ సంవత్సరంలో సంగం బ్యారేజీకి శంఖుస్థాపన చేస్తే, 2014, ఈనాటి వరకు రూ.85.00 కోట్లు ఖర్చు చేశారు, కానీ బ్యారేజీ పనులు ఇప్పటికీ ఎక్కడికక్కడే నిధుల లేమితో నిల్చిపోయినాయి. పెన్నాడెల్టా ఆధునీకీకరణ పేరుతో రూ.560.00 కోట్లు వారి జేబుల్లో నింపుకుని కాంట్రాక్టర్లకు పూర్తి స్వేచ్ఛనిచ్చి ప్రజాధనాన్ని దోపిడి చేసిన విషయం వాస్తవం కాదా? గౌరవ సభ్యులు ఒకసారి అన్ని విషయాలను మననం చేసుకోవాల్సిన అవసరముంది. నెల్లూరు బ్యారేజీ కడతామని చెప్పి రూ.185.00 కోట్ల ఎస్టిమేషన్ వేయగా పనులు ప్రారంభించినప్పటికి, ఇప్పటికీ అది పూర్తికానటువంటి విషయం వాస్తవం కాదా?

అధ్యక్షా, రైతులు పెద్దయెత్తున గత ప్రభుత్వ హయాంలో అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకుంటే వారి కుటుంబాలను ఆదుకునే ప్రయత్నం చేయలేదు. ఆనాడు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పి ఎక్కడా సక్రమంగా కరెంటు సప్లై చేయలేదు. నెల రోజుల క్రితం ప్రియతమ ముఖ్యమంత్రి గారైన శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు "పొలం పిలుస్తోంది రా" అనే కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఆ కార్యక్రమం సందర్భంగా నేను కొన్ని గ్రామాల్లో పాల్గొన్న సమయంలో చాలా మంది రైతులు సంతోషాన్ని వ్యక్తపరుస్తూ, మా తరపున గౌరవ ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు తెలియజేయమని గ్రామాల్లో రైతులు నాకు చెప్పడం జరిగింది. గత రెండు నెలలుగా విద్యుత్ సరఫరా సక్రమంగా ఉంటోందని, రైతు రుణ మాఫీ వల్ల దిగులు తీరిందని, కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉన్నట్టుగా వారి మాటల్లో నాకు అర్థమైంది.

అధ్యక్షా, గత ప్రభుత్వంలో చివరి బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ఆనాటి వ్యవసాయ శాఖా మంత్రి గారైన శ్రీ కన్నా లక్ష్మినారాయణ గారు వ్యవసాయ బడ్జెట్ అని మొదట సభలో చదివి, తరువాత వ్యవసాయ కార్యాచరణ అని పేరు మార్చి తరువాత ఊరికే గాలికి

వదిలిపెట్టడం జరిగింది. కానీ ఈరోజు మొట్టమొదటిసారి భారత దేశ చరిత్రలో రాష్ట్ర విభజనానంతరం కొత్తగా ఏర్పడిన మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వ్యవసాయ బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టినటువంటి ఘనత, వ్యవసాయశాఖామాత్యులైన శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు గారికి, అదే విధంగా మన ప్రియతమ గౌరవ ముఖ్యమంత్రిగారైన శ్రీ నారా చంద్రబాబునాయుడు గారికి దక్కుతుందని నేను సవినయంగా ఈ సందర్భంగా తెలియజేస్తూ, బడ్జెట్‌కు సంబంధించిన వ్యవసాయ పద్దుపైన మాట్లాడే అవకాశం ఇచ్చిన మీకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ వరుపుల సుబ్బారావు (ప్రత్తిపాడు): అధ్యక్షా, మొట్టమొదట బడ్జెట్‌కు సంబంధించిన వ్యవసాయ పద్దుపైన మాట్లాడే అవకాశం కల్పించిన మీకు నమస్కారాలు తెలియజేస్తున్నాను. సభలో ఉన్న గౌరవ సభ్యుల్లో చాలా మంది వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన వాళ్లని నేను భావిస్తున్నాను. సొంతంగా వ్యవసాయం చేయకపోయినా సరే కౌలుకు పొలాన్ని తీసుకుని వ్యవసాయం చేసే కుటుంబం నుంచి వచ్చిన సభ్యులే నూటికి తొంభై మంది ఉంటారని నేను అనుకుంటున్నాను. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అందిస్తున్న ప్రొత్సాహానికి గౌరవ సభ్యులందరూ తప్పకుండా సహకరించాలి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయబడ్జెట్ పైన ప్రతిపక్షపార్టీ సభ్యుల సలహాలను, సూచనలను తప్పక ప్రభుత్వం తీసుకోవాల్సిన అవసరముంది. అధికారపక్షమైన, ప్రతిపక్షమైనా సభలో ఏం మాట్లాడినా సరే చివరకు రైతులకు మేలు చేయాలనేదే ప్రధాన ద్యేయంగా ఉంటుంది.

అధ్యక్షా, ప్రస్తుతం బడ్జెట్‌కు సంబంధించిన వ్యవసాయ పద్దు పైన సభలో చర్చ జరుగుతోంది. ప్రజానీకం దృష్టి మనపైన ఉంది. చర్చకు సంబంధించిన అంశాలను క్షుణ్ణంగా రైతులు పరిశీలిస్తున్నారు. కాబట్టి ప్రతిపక్ష సభ్యులు మాట్లాడే సమయంలో అధికారపక్ష సభ్యులు ఆటంకం కల్గించకుండా ఉండాల్సిన అవసరముంది. మా ప్రసంగంలో ఏదైనా పొరపాటుంటే తప్పకుండా ప్రసంగం పూర్తి అయిన తరువాత మీరు ఆయా అంశాలపైన స్పందించండి. అందులో ఎటువంటి తప్పు లేదు.

అధ్యక్షా, గతంలో శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ప్రతిపక్షనాయకుడిగా ఉన్న కాలంలో ఈ రాష్ట్రంలో 2010వ సంవత్సరం నుంచి 2013వ సంవత్సరం వరకు గల మధ్య కాలంలో రాష్ట్రానికి ఏడు తుఫాన్లు సంభవించాయి. తద్వారా రైతాంగం తీవ్రంగా నష్టపోవడం జరిగింది. ఆ సమయంలో రైతాంగానికి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఒక భరోసా కల్పించిన సంగతిని ఒకసారి సభకు తెలియజేయాలని అనుకుంటున్నాను. రైతుల దగ్గరకు ప్రతిపక్షనాయకుడి హోదాలో వెళ్లి, ఉచిత కరెంటు ఇస్తామని, రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను మాఫీ చేస్తామనేటటువంటి పలు వాగ్ధానాలను ఆ సందర్భంగా చేయడం జరిగింది. ఆనాడు రాజశేఖరరెడ్డి గారి ప్రభుత్వం రైతాంగం పట్ల అనుసరించిన విధానాలనే ఈ

ప్రభుత్వం అవలంభించకపోతే రైతులు వ్యవసాయ చేసే పరిస్థితి నుంచి తప్పుకునే అవకాశం ఉంది. ఆనాడు రాజశేఖరరెడ్డి గారి హయాంలో రైతులకు మేలు జరగకుండా ఉండింటే, ఈనాడు వ్యవసాయ కుటుంబాలు కట్టుబట్టలతో వీధిన పడే పరిస్థితి దాపురించేది.

అధ్యక్షా, రైతాంగానికి పలు విధాలుగా శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు భరోసా ఇచ్చారు, కానీ వ్యవసాయ బడ్జెట్‌లో అందుకు తగ్గట్టుగా కార్యాచరణ గానీ, బడ్జెట్ కేటాయింపులు గానీ జరగలేదు. రైతులు చాలా ఆత్రతతో ఎదురుచూస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా, ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని జగ్గంపేట మండలం పూర్తిగా మెట్టప్రాంతం. దయచేసి మా ప్రాంతాన్ని సందర్శించవల్సిందిగా అధికారపక్షాన్ని కోరుతున్నాను. "పాలం పిలుస్తుందో, పాలం రమ్మంటుందో, పాలం పొమ్మంటుందో" మీకే తెలుస్తుంది. నిజంగా మీకే వాస్తవ పరిస్థితి తెలుస్తుంది. మాప్రాంతానికి సాగునీరు లేదు, విద్యుత్ సరఫరా సక్రమంగా లేదు. మాప్రాంత రైతాంగం కష్టాలను సభ దృష్టికి తీసుకువచ్చే ప్రయత్నాన్ని నేను చేస్తున్నాను. మా బాధ ఆలకించాల్సిన అవసరం ప్రభుత్వానికుంది. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందనే నమ్మకంతో రాష్ట్రం యావత్తు రైతాంగం ఎదురుచూస్తున్నారు.

అధ్యక్షా, తూర్పుగోదావరి జిల్లా సహకార బ్యాంకు పరిధిలో రూ.14,050.00 కోట్లకు పైగా రుణ మాఫీ చేయాల్సి ఉండగా, ఈనాటి వరకు ఏ ఒక్క రైతుకు రుణ మాఫీ సదుపాయం కల్గలేదు. అరటితోట వేసుకున్న రైతుకు లేదు, ఉద్యానవన పంట వేసుకున్న రైతుకు రుణమాఫీ వర్తించలేదు. సన్నకారు, చిన్నకారు రైతులకు కూడా రుణమాఫీ జరగలేదు. రైతులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. వ్యవసాయ బడ్జెట్‌లో కేటాయింపులు సక్రమంగా లేవు. రైతాంగాన్ని ఆదుకోవాల్సిన అవసరం ప్రభుత్వానికుంది. రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయంగా ఉండాల్సిన అవసరముంది. వ్యవసాయ విధానంలో నూతన ఒరవడిని తీసుకురావల్సిన అవసరం ప్రభుత్వానికుంది. గత ప్రభుత్వ విధానాలను ఎండగట్టడానికే కాలం వెల్లబుచ్చేకంటే, ప్రజలిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రైతాంగాన్ని అన్ని విధాల ఆదుకునే ప్రయత్నాన్ని ప్రభుత్వం చేయాలి.

...

ఈ రోజు ప్రజలు, అన్నీ విధాలుగా మమ్మల్ని ప్రభుత్వం ఆదుకుంటుందని అధికారం మీకు ఇచ్చారు. మిమ్మల్ని గెలిపించారు కాబట్టి వారు మీకిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేయండి. రైతు భవిష్యత్‌లో మేలైన వ్యవసాయం చేసుకోడానికి, రైతులను ఆదుకొనే ప్రయత్నం చెయ్యండి. ప్రతిదానికి మేము మాట్లాడుతుండగా అడ్డుకునే ప్రయత్నం చేయకండి. ఈ రోజు ఉన్న పరిస్థితి ఏంటంటే, కొత్త రాష్ట్రంలో మనం అన్నీ సమకూర్చుకోవాలి. మీరు ఆలోచనతో మాట్లాడుతున్నారో, ఆవేశంతో మాట్లాడుతున్నారో తెలియదు కానీ, ప్రతీదానిపై మేం రుణాలు మాఫీ చేస్తాం, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తాం, మూడు సెంట్లు భూమి ఇస్తాం, ఇళ్లు కట్టించేస్తాం, ప్రతీ సోదరినీ ఆదుకుంటాం అంటున్నారు. ఇవన్నీ మనం చేసుకోవాలంటే అందరి సహకారం

అవసరం. రాష్ట్రంలో ఈ రోజు మనం కూర్చోడానికి కుర్చీ లేదు. కొత్త రాష్ట్రంగా విజయవాడ మార్చేస్తాం అంటున్నారు. ఈరోజున్న వ్యవసాయ రంగం చూసుకుంటే అధోగతి ఉంది. వ్యవసాయం ఆదర్శంగా తీసుకునే దుస్థితి ఎక్కడా కూడా పూర్తిగా లేదు.

ఏ ప్రాంతంలో ఏవిధంగా వ్యవసాయం చేస్తున్నారు. రైతులు ఏ విధంగా పంటలు పండిస్తున్నారో వ్యవసాయ శాఖా మంత్రిగారు ఒక సారి ఆలోచన చేయమని చెబుతున్నాను. 11 నుండి 18 సార్లు అతివృష్టి, అనావృష్టి భారిన మన రైతులు పడ్డారని మన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు స్వయంగా చెప్పారు. దయచేసి అన్న మాట ప్రకారం రైతులకు మేలు చేయాలి, ఏ విధంగా ఆదుకోవాలనే ఆలోచనా భావంతో మనం పనిచేయాలి. గత ప్రభుత్వం మంచి పని చేశారు అని ఒక మాటంటే దానిని మీరు అడ్డుకొంటున్నారు. మనందరం కలసి రాష్ట్రాన్ని ముందుకు తీసుకు వెళ్లాలి. ప్రజల అవసరానికి అనుగుణంగా మనం పని చేయాలి. కాకపోతే ఒక ప్రతిపక్ష పార్టీగా మేము చెబుతాము. సమస్యల్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలి. ప్రజల అవసరాలకు అనుగుణంగా మేము పనిచెయ్యాలి. మీరన్న మాట నెరవేర్చండి అన్నాము. అన్ని విధాలుగా మాకు చెప్పే అవకాశం ఉంటుంది. దానిని ఒక మంచిగా తీసుకొని ఏ ఆశతో రైతులుంటారో ఆ ఆశలు అడియాశలు కాకుండా భవిష్యత్‌లో రైతులు వ్యవసాయం చేసుకోడానికి ఆశక్తి కలిగే విధంగా, రైతు సంతోషించే విధంగా, మీరు పనిచేయాలని కోరుకుంటూ నాకు ఈ అవకాశం కల్పించి స్పీకర్ గారికి మరొక్క సారి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ : రామానాయుడు గారు.

శ్రీ ఎన్. రామానాయుడు (పాలకొల్లు): గౌరవనీయులు అధ్యక్షులు గారికీ, సభా నాయకులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. మనందరికీ తెలుసు రాష్ట్ర విభజన జరిగిన నేపథ్యంలో ఈరోజు ఈ ప్రభుత్వానికి అనేక ధ్యేయాలు, లక్ష్యాలు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా ప్రభుత్వాన్ని నిర్మాణం చేసుకోవాలి, రాష్ట్రాన్ని నిర్మాణం చేసుకోవాలి, ప్రగతిని నిర్మాణం చేసుకోవాలి. ప్రగతితోపాటుగా ఇచ్చిన హామీలు ఏవైతే ఉన్నాయో వాటన్నింటిని నిలబెట్టుకోవాలి. ఇటువంటి పరిస్థితుల్లో ఏర్పడిన నవ్యాంధ్రప్రదేశ్‌ను ప్రధానంగా చూసినట్లైతే ఈ నవ్యాంధ్రప్రదేశ్ ప్రాణం వ్యవసాయం. రూపం చూస్తే పరిశ్రమలు, నడకా, నాయకత్వం చూస్తే శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారే అని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఈనాటి నవ్యాంధ్రప్రదేశ్‌కు ప్రాణం అయిన వ్యవసాయాన్ని శ్రీ చంద్రబాబునాయుడు గారు గుర్తిండం వలన రైతుల కష్టాలను తొలగించాలనే ఉద్దేశ్యంతోనే వారు అధికారంలోకి వచ్చిన వెంటనే, ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రుణమాఫీపై మొట్టమొదటి సంతకం చేశారు. రేపు మన ప్రాంతానికి వచ్చేటువంటి పోలవరం ధార ఏదైతే ఉందో అది మా ప్రాంతానికి ఒక ప్రాణధార, గంగా ధార. పోలవరం ప్రాజెక్టుకు భవిష్యత్‌లో

ఎటువంటి ఇబ్బంది తలెత్తకూడదు అనే ఉద్దేశంతో ఏవైతే 7 ముంపు మండలాలున్నాయో వాటన్నింటినీ ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ చేస్తూ తీసుకొచ్చిన ఆర్డినెన్స్ వెనుక ఉన్న చంద్రబాబు నాయుడు గారి కృషికి మా ప్రాంత రైతాంగం ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాము.

అభివృద్ధి విషయంలో వారు 7 మిషన్స్ తీసుకు వచ్చి, అందులో మొదటిది ప్రాథమిక అభివృద్ధి రంగం మిషన్ ద్వారా వ్యవసాయానికి ప్రాధాన్యత ఇచ్చే విషయంలో కానీ, ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసే విషయంలో కాని, ఎందుకంటే ఎప్పటినుండో రైతు సంఘాలు కోరిన విధంగా ఉపాధి హామి పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయడంలోనూ, వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించడంలో కానీ, అనేక విషయాల్లో వ్యవసాయాన్ని సంరక్షించుకోవాలనే భావనతో ముందుకు వస్తున్న చంద్రబాబు నాయుడుగారికి రైతాంగం అంతా బాసటగా నిలుస్తామని ఈ సందర్భంగా తెలియజేసుకుంటున్నాను.

గత కాంగ్రెస్ ప్రభుత్వాల పాలకులు వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తామన్నారు, వ్యవసాయాన్ని పండుగ చేస్తామన్నారు. కానీ రైతుల పేర్లు చెప్పి ఈ కాంగ్రెస్ నాయకులు పండుగ చేసుకున్నారు. కోట్లాది రూపాయలు దోచుకోవడమే కాదు, జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం చేసి, రాబందుల కంటే, ఎందుకంటే రాబందులే నయం, రాబందులు కుళ్లిన మాంసం ముట్టుకోవు. కానీ ఈ కాంగ్రెస్ నాయకులు గుడిని, గుడిలో ఉన్న లింగాన్ని మింగేసే రకం. ఈ రాష్ట్రంలో ఎక్కడా రాబందులు కూడా కనిపించని పరిస్థితి ఈ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చూస్తున్నాం. గత పది సంవత్సరాల పరిపాలనా కాలంలో ఏ గ్రామానికి వెళ్లినా, వ్యవసాయం చేయడానికి ముందుకు రాని పరిస్థితులున్నాయి. కనీసం కౌలు దారుడు కూడా భూమిని కౌలుకు తీసుకోడానికి ముందుకు రాలేని పరిస్థితి గ్రామాల్లో ఉంది. ఎందుకంటే రైతు ఒక ఎకరం పొలం పంట పండిస్తే అతనికి మిగిలేది గట్లు వెంబడి పెరిగేటి పచ్చగడ్డో , లేదా వరి నూర్పిడి తరువాత వచ్చే ఎండుగడ్డో తప్పా, అతను ఇంటికి తీసుకెళ్లేది ఏమి కూడా పంటలో లేనటువంటి పరిస్థితి గతంలో చూశాం.

(ఈ సందర్భంలో స్పీకర్ గారు బెల్ వినిపించారు.)

అటువంటి పరిస్థితుల్లో క్రాప్ హాలిడే. ఇంతకు మునుపు విశ్వేశ్వరరెడ్డి గారు కాంగ్రెస్ పాలన గురించి గొప్పగా చెబుతున్నారు. క్రాప్ హాలిడే నిజంగా ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మొదటి సారిగా పంట పండించలేము. పంట పండిస్తే నష్టపోతున్నాము, పంట పండించ కుండా ఉంటే ఆ నష్టమైనా మిగులుతుందనే ఉద్దేశ్యంతో పంట పండించడం తప్ప మరొకటి తెలియని రైతు కాడిని వదిలేసిన పరిస్థితి, దుస్థితి మా తూర్పుగోదావరి జిల్లాలో,

90వేల ఎకరాలు. మా పశ్చిమ గోదావరి జిల్లాలో 25వేల ఎకరాలు క్రాప్ హాలిడే తీసుకున్న దుస్థితి ఈ కాంగ్రెస్ పాలనలో మనందరం చూశాం. ఒక్క క్రాప్ హాలిడే కాదు, మిల్క్ ప్రొక్యూర్‌మెంట్ హాలిడే అన్ని రకాలుగా పంట విరామాల ప్రభుత్వంగా మారిపోయిన పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వంలో మనందరం చూశాం.

(ఈ దశలో గౌరవ సభానాయకులు వచ్చి తమ స్థానంలో కూర్చున్నారు.)

మిస్టర్ స్పీకర్ : ప్లీజ్ కంక్లూడ్.

శ్రీ ఎన్.రామానాయుడు (పాలకొల్లు): రైతాంగానికి సంబంధించిన విషయం కాబట్టి దయ ఉంచి, కొంత సమయం ఇవ్వాల్సిందిగా మిమ్మల్ని కోరుతునాం. ఇటువంటి స్థితిలో రైతుల్ని ఆదుకోవాలి. వ్యవసాయాన్ని రక్షించుకోవాలనే ఉద్దేశ్యంతో చంద్రబాబు నాయుడు గారు రుణమాఫీ ప్రకటన చేస్తే , మీరు చేసే విమర్శలు ఏవైతే ఉన్నయో, అవి కొత్తగా శాసనసభకు ఎన్నికై సభకు వచ్చిన మా లాంటి సభ్యులకు చాలా బాధ కలిగిస్తున్నాయని చెబుతున్నాం. ఎందుకంటే ప్రతిపక్షాలంటే మాకు గౌరవం ఉంది. కానీ మీరు చేసే ప్రతి పని కూడా మమ్మల్ని ఆలోచింప చేసేదిగా ఉండాలి. అబద్దాలు, అసత్యాలు చెప్పే సంస్కృతి మాకు లేదు. ఈవేళ రైతాంగం గురించి, ఈరోజే కాదు, ఆరోజు బాబ్లీ ప్రాజెక్ట్ కోసం పోలీసుల లాటీలను ఎదురించినటువంటి పరిస్థితి, పంట నష్ట పరిహారం కోసం నిరవదిక నిరాహార దీక్ష ద్వారా తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టిన చరిత్ర కలిగిన నాయకులు మా నారా చంద్రబాబు నాయుడు గారు అనే విషయాన్ని గౌరవ ప్రతిపక్ష సభ్యులు గుర్తించాలని కూడా ఈ సందర్భంగా మీ అందరికీ తెలియజేస్తున్నాను.

అదే విధంగా ఇటువంటి పరిస్థితుల్లో రుణమాఫీపై పదే, పదే విమర్శిస్తున్నారు. గతంలో రెండు సార్లు రుణమాఫీ జరిగితే అది కేంద్రమే చేసింది. ఈరోజు దేశం మొత్తంలోనే మొట్టమొదటి సారిగా ఈ రాష్ట్ర ప్రభుత్వం రుణ మాఫీలో తీసుకున్న విషయంలో కానీ రుణమాఫీలో కూడా చెల్లించిన, చెల్లించని వారికి కూడా రుణ మాఫీ వర్తించే విషయంలో రైతాంగం అంతా పూర్తి స్థాయిలో విశ్వాసాన్ని ఈ తెలుగుదేశం పార్టీపై ఉంచారని కూడా ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. మనది వ్యవసాయక సంబంధిత రాష్ట్రం. మనకున్న చిన్న చిన్న వనరులను ప్రధాన ఆదాయంగా మార్చుకోవల్సిన అవసరం ఉందని కూడా ఈ సందర్భంగా గౌరవ వ్యవసాయ శాఖ మంత్రుల దృష్టికి తీసుకు వస్తున్నాను. ప్రత్యేకించి పూల నర్శరీలతో విలసిల్లే కోనసీమ ప్రాంతం ఏదైతే ఉందో అది ఈ దేశానికే ఒక ప్రధానమైన ఆదాయంగా మార్చుకోవల్సిన అవసరం ఉంది.

...

అదేవిధంగా మనందరికీ తెలుసు. గోదావరి ముఖద్వారం వద్ద గోదావరి మంచినీరు, సముద్రపు ఉప్పు నీరు రెండూ కలిసే మిశ్రమం దగ్గర పుట్టి, పెరిగిన పులస చేప రుచి ఇవాళ ప్రపంచం అంతటికీ తెలుసు. అటువంటి పులస చేపను ఉత్పత్తి చేసి, ఎగుమతి చేసే స్థాయికి మనందరం ప్రయత్నం చేయాలని మీ దృష్టికి తీసుకొస్తున్నాను.

అదేవిధంగా మన రాష్ట్రం వ్యవసాయక రాష్ట్రం కాబట్టి, వ్యవసాయాధారిత పరిశ్రమలు, కుటీర పరిశ్రమలుగానో, భారీ పరిశ్రమలుగానో కాకుండా మధ్యతరహా పరిశ్రమలను అభివృద్ధి చేయాలి. దీనికొరకు ఇంటర్మీడియట్ టెక్నాలజీని మనం ప్రవేశపెట్టి, విద్యార్థులకు బేసిక్ నాలెడ్జ్ లేకపోయినా, 20 సంవత్సరాలు నిండిన ప్రతీ యువతీ యువకులకు ఈ ఇంటర్మీడియట్ టెక్నాలజీని అభివృద్ధి పరచడం ద్వారా, ఏదైనా అతివృష్టి, అనావృష్టి వచ్చినపుడు పంటలను ఏవిధంగా రక్షించుకోవచ్చు, అదేవిధంగా తక్కువ పెట్టుబడులతో దిగుమతిని ఏవిధంగా పెంచుకోవచ్చు అన్న నాలెడ్జ్‌ని అధ్యయన కేంద్రాల ద్వారా మనం ఏర్పాటుచేయాలి. ఉత్పత్తి ఎంత ముఖ్యమో దాని ద్వారా ఉప ఉత్పత్తులు కూడా అంతే ముఖ్యం. బై ప్రొడక్ట్స్ కూడా అంతే అవసరం. ఉదాహరణకు మలేషియా, ఇండోనేషియా దేశాల్లో చూస్తే అక్కడ ప్రధాన ఆదాయం కొబ్బరి. కోకోనట్ ఆయిల్, కోకోనట్ మిల్క్, కోకోనట్ పౌడర్ లాంటి బై ప్రొడక్ట్స్‌ను తయారుచేస్తున్నారు. కానీ మన ఆంధ్రప్రదేశ్‌లో చూసినట్లయితే కోకోనట్‌ని కేవలం ఆయిల్‌గా టెంపుల్స్‌లో మాత్రమే ఉపయోగిస్తున్నాం. అందువల్ల ఈ ఇంటర్మీడియట్ టెక్నాలజీని ప్రవేశపెట్టడం ద్వారా, కొబ్బరి నుంచి కూడా పీచు, టెంకు వంటి ఉప ఉత్పత్తులను సాధించుకోటానికి అవకాశం ఉంటుంది కాబట్టి, దయచేసి ఇటువంటి వాటిని కూడా ప్రవేశపెట్టాలని గౌరవ మంత్రిగారిని ఈ సందర్భంగా కోరుతున్నాను.

మిస్టర్ స్పీకర్: రాజాగారు.

శ్రీ డి. రాజా (తుని): అధ్యక్షా, మొట్టమొదటిసారిగా నాకు ఈ సభలో మాట్లాడటానికి అవకాశం ఇచ్చినందుకు మా పార్టీ నాయకుడు శ్రీ వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిగారికి, మా తుని నియోజకవర్గ ప్రజలకు, మీకు కూడా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. వ్యవసాయ శాఖ తొలిసారి ప్రవేశపెట్టిన బడ్జెట్ పేరులో తప్ప, ప్రత్యేకతను చాటుకోలేకపోయింది. ఎన్నికల్లో ఈ అంశంపై ఊదరగొట్టిన గౌరవ ముఖ్యమంత్రిగారు, వ్యవసాయశాఖా మంత్రి రైతు సంక్షేమ ప్రయోజనాలను కాపాడే విధంగా రూపకల్పన చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న హామీలకు, వ్యవసాయ శాఖ ప్రత్యేక బడ్జెట్‌లో వెల్లడించిన అంశాలకు ఏమాత్రం పొంతన లేదు. వ్యవసాయం సుద్ద దండగ అని ఎద్దేవ చేసిన గౌరవ ముఖ్యమంత్రిగారు మరొకసారి రైతులను మోసం చేసి, గద్దెనెక్కారని తమ దృష్టికి తీసుకొస్తున్నాను. (అధికార పార్టీ సభ్యుల నుంచి అభ్యంతరం) ముఖ్యంగా ఒకే మాటను సూటిగా ప్రశ్నిస్తున్నాను. రైతుల రుణ మాఫీని ఎప్పుడునుంచి, ఏ తేదీ నుంచి

మొదలుపెడతారు? (అధికార పార్టీ సభ్యుల నుంచి అభ్యంతరం) తెలుగుదేశం పార్టీ వాళ్లకి అలవాటైపోయింది. ఒకే అబద్దాన్ని పదే పదే చెబితే ప్రజలు నమ్ముతారనే ఒక ఓవర్ కాన్ఫిడెన్స్‌తో వెళ్లిపోతున్నారు గాని, రుణ మాఫీపై ఒక ఖచ్చితమైన తేదీని వాళ్లు ప్రకటించలేకపోతున్నారని తెలియజేస్తున్నాను.

గౌరవ వ్యవసాయమంత్రిగారి బడ్జెట్ ఏవిధంగా ఉందంటే, చీకటి పడ్డ తర్వాత ఆకాశంలో నక్షత్రాలను చూపించి, ఆ వెలుగులో పండగ చేసుకోండి రైతుల్లారా అన్నట్లు ఉంది తప్పితే, బడ్జెట్ ఒక ఒరవడి, పద్ధతిలో ఉన్నట్టు నాకైతే అనిపించటం లేదు.

ముఖ్యంగా సాధారణ బడ్జెట్‌లో వ్యవసాయానికి సంబంధించి అన్ని రకాల కేటాయింపులు, జమా ఖర్చులు గౌరవ ఆర్థిక మంత్రి తెలుపగా, వ్యవసాయ శాఖా మంత్రి ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఉప్పు లేని కూర మాదిరిగా చప్పగా ఉంది.

2014-15 సంవత్సరానికి రూ.13,150 కోట్లు వ్యవసాయ శాఖకు కేటాయించినట్టు చూపించారు. దీనిలో ప్రణాళిక వ్యయం కింద రూ.6,738.44 కోట్లుగా, ప్రణాళికేతర వ్యయం కింద రూ.6,373.95 కోట్లుగా చూపించారు. విద్యుత్ సబ్సిడీ కింద రూ.3,188 కోట్లుగా చూపించారు. వ్యవసాయరంగానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేస్తున్నట్లు పేర్కొంటూ, ఆ మేరకు కేంద్ర ప్రభుత్వం నిధుల కింద రూ.1380.30 కోట్లు కేటాయించారు. దీనితోపాటు రుణ మాఫీకి రూ.5,000 కోట్లు బడ్జెట్‌లో ఇవ్వడం జరిగింది. ఈవిధంగా రుణమాఫి, విద్యుత్ సబ్సిడీ, ఉపాధి హామి నిధులు మినహాయిస్తే, వ్యవసాయ రంగానికి రూ.3,535 కోట్లు మాత్రమే కేటాయించినట్లు లెక్కలు చెబుతున్నాయి. తద్వారా అంకెల గారెడీ, ఆత్మ స్తుతి తప్ప ప్రత్యక్షంగా రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం చేసే చర్యలు వ్యవసాయశాఖ బడ్జెట్‌లో కనిపించలేదు.

రుణాల మాఫీకి సంబంధించి ఎస్ఎల్‌బిసి రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ చెప్పిన లెక్కల ప్రకారం రుణ మాఫీకి రూ.87,617 కోట్లు అవసరం ఉండగా, బడ్జెట్‌లో కేవలం రూ.5,000 కోట్లు కేటాయించడం ఎంతవరకు సమంజసం? తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన జి.ఒ. ప్రకారం 2013వ సంవత్సరం, డిసెంబరు 31 తేదీ వరకు తీసుకున్న రుణాలకు మాత్రమే రుణ మాఫీ వర్తిస్తుందని స్పష్టంగా చెప్పారు. ఎన్నికల సమయంలో రుణాలను పూర్తిగా రద్దు చేస్తామని, అప్పు తీసుకున్న ప్రతీ రైతుకు న్యాయం చేస్తామని ప్రకటించారు. దీనికి భిన్నంగా, పలు ఆంక్షలతో కుటుంబంలో ఒకరికి మాత్రమే రుణాన్ని రద్దు చేస్తామని, రూ. 1.50 లక్షల వరకు రుణ మాఫీని పరిమితం చేయడం సమ్మతనీయం కాదని మరొక్కసారి మనవి చేస్తున్నాను.

అదేవిధంగా రుణాల మాఫీ కాల పరిమితిని 2014వ సంవత్సరం వరకు పెంచాలని కోరుతున్నాను. అదేవిధంగా డా.వై.ఎస్.రాజశేఖరరెడ్డిగారు ఉన్న కాలంలో రైతులకు ఐదు వేళ్లు నోటిలోకి వెళ్లేవి. ఇప్పుడున్న పరిస్థితిలో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడిగారి ప్రభుత్వంలో ఐదు వేళ్లు నోటిలోకి వెళ్లే మాట అటుంచి, రైతులు కరెంటు బిల్లులు కట్టలేక జైలులోకి వెళ్లే పరిస్థితి వచ్చింది. ఇందాక గౌరవ సభ్యులు మాట్లాడుతూ మేం ఈమధ్య హాయిగా భార్య పక్కన పడుకొని రాత్రుళ్లు నిద్రపోతున్నామని చెప్పడం జరిగింది. కానీ, అప్పుడు శ్రీ నారా చంద్రబాబునాయుడిగారి ప్రభుత్వంలో రైతులను భార్యా, పిల్లల పక్కన పడుకున్న వాళ్లని తీసుకుని, జీపుల్లో ఎక్కించి, పోలీసుల మాదిరిగా విద్యుత్ ఉద్యోగులు తీసుకెళ్లేవారని మీకు సవివరంగా తెలియజేసుకుంటూ, నాకు ఈ అవకాశమిచ్చిన మీకు నమస్కారాలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకొంటున్నాను.

మిస్టర్ స్పీకర్ఃవర్మగారూ.

శ్రీ ఎస్.వి.ఎస్.ఎన్.వర్మ (పిఠాపురం)ఃఅధ్యక్షా, మీకు, గౌరవ ముఖ్యమంత్రిగారికి నమస్కారాలు. ఇందాక రైతులంతా నిర్వీర్యమైపోయారని చెప్పడం జరిగింది. డా.వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డిగారి పరిపాలనలో మా జిల్లాలకు సంబంధించి రైతులంతా కూలీలయ్యారు. వ్యవసాయ భూములు (స్పెషల్ ఎకనామిక్ జోన్) ఎస్ఇజెడ్‌లు అయ్యాయి. ఎవరివో కాదు, వారి (ప్రతిపక్ష సభ్యులు శ్రీ డి. రాజాను ఉద్దేశించి) ఇంటిపక్కన ఉన్న స్నేహితులవి. ONGC అని పేరు చూపించి, ఆ భూములు ONGC కి ఇస్తే, మీకు లక్షల్లో జీతాలు వస్తాయని చెప్పి, ONGC, నవరత్నాలు కంపెనీ ఒకటి... దానికి ఆయిల్ పడుతుందనే ఫిజిబిలిటీ రిపోర్టు ఇచ్చిన తర్వాత, ఎంత గ్రేటో చూడండి. వాళ్ల గ్రోత్ ఇందులో కాదు, సెంట్రల్‌కి వెళ్లి ONGC Chairman తో మళ్లీ ఇక్కడ ఆయిల్ పడదు అని లెటర్‌ను రాయించుకుని తెచ్చారు. లెటరు తెచ్చి, ఆ 7,000 ఎకరాలను ఇండివిడ్యుయల్ వ్యక్తి కె.వి.రావు పేరున రిజిస్ట్రేషన్ చేయించిన ఘనత డా.వై.ఎస్‌రాజశేఖర్‌రెడ్డిగారిదే. దానివలన ఎంతమంది రైతులు రోడ్డున పడ్డారంటే..

ఇంకో విషయం ఏమంటే, ఏలేరు ఆయుకట్టు కింద, పిబిసి ఆయుకట్టు కింద ఎవరైతే రైతులు భూములు ఇవ్వలేదో, వాళ్లందరికీ 2007వ సంవత్సరంలో ఒక జి.ఒ.ను ఇష్యూ చేసి, ఇరిగేషన్ అధికారులకు చెప్పి, వ్యవసాయానికి నీళ్లు ఆపి మరీ, పోలీసులు లాఠీలతో కొట్టి మరీ వాళ్ల భూములను లాక్కొన్న ఘనత డా.వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డిగారిదే. వీళ్లా రైతులను ఆదుకొనేది? ఒకసారి చెప్పమనండి. వీళ్లు రాజశేఖర్‌రెడ్డిగారూ, రాజశేఖర్‌రెడ్డిగారూ అని మా జిల్లాలో తోలుబొమ్మలాట ఆడతారు. తందాన తాన తందాన తాన అంటారు. సభలో మాట్లాడితే రాజశేఖర్‌రెడ్డిగారూ, రాజశేఖర్‌రెడ్డిగారూ అంటారు. ఏంటి అధ్యక్షా? పదివేల ఎకరాల రైతుల

భూములు.. అక్కడ సుబ్బారావు అనే ఒక రైతు ఉన్నాడు. అతనికి ముగ్గురు ఆడపిల్లలు. ఆరు ఎకరాల భూమికి నీరు ఆపేసి, బలవంతంగా భూమిని తీసుకున్నారు.

డా.వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డిగారు చనిపోయేసరికి అప్పు ఎంత ఉంది అనేది చెప్పటం లేదు. దోచుకున్న డబ్బు ఎంత ఉందనేది చెప్పటం లేదు. అప్పు చెప్పడం మానేసి, గ్రోత్ రేటు ఎంత ఉంది? ఇది ఎంత ఉంది అని అడగటం కరెక్ట్ కాదు. గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు అధికారంలోకి వచ్చి 80 రోజులే అయింది. మరి వ్యవసాయానికి ఈ 80 రోజుల్లో ఏం అన్యాయం అయిపోయింది. అసలు రైతులకు రుణ మాఫీ ఎందుకు ఇవ్వాల్సి వచ్చిందంటే...

...

2004లో మేము కాలువలు త్రవ్వుతామని చెప్పి, మరొకవైపు ఆరోగ్యశ్రీ అని చెప్పి, ఆరోగ్యశ్రీని కార్పొరేట్ హాస్పిటల్స్‌కు ఇచ్చి, రైతుల భూములను ఎస్.ఈ.జెడ్.కోసం తీసుకున్న ఘనత వై.ఎస్.రాజశేఖర రెడ్డి గారిది. (వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులచే అంతరాయం) ఒక్క నిముషం అగండి. చెప్తాను వినండి. విన్న తరువాత మాట్లాడండి. (వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులచే అంతరాయం) కూర్చోండి. చెప్తున్నా వినండి. మీరు మాట్లాడినంత సేపూ మేము విన్నాం కదా. మా మిత్రులు సుబ్బారావు గారు చెప్పారు, మెట్ట వ్యవసాయానికి చుక్క నీరు కూడా లేదని... (శ్రీ జ్యోతుల నెహ్రూ గారు మైకు ఇవ్వవలసినదిగా కోరసాగారు).

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులచే అంతరాయం)

MR. SPEAKER: Nehru garu, what do you want?

(శ్రీ జ్యోతుల నెహ్రూ గారు మైకు ఇవ్వవలసినదిగా కోరసాగారు).

MR. SPEAKER: Varma garu, please conclude.

శ్రీ ఎస్.వి.ఎస్.ఎన్.వర్మ(పిఠాపురం)ః అధ్యక్షా, నీరు ఇచ్చింది ఎవరు? పుష్కర ఎత్తిపోతల పథకం ఇచ్చిందెవరు? మా నియోజకవర్గంలో గొల్లప్రోలు మండలంలో ఎన్నో వేల ఎకరాలకు నీరందించేందుకు, చంద్రబాబునాయుడు గారు పుష్కర ఎత్తిపోతల పథకం అప్పుడే ఇచ్చారు. మరి అటువంటి చోట, ఇవాళ చుక్కనీరు లేకుండా చేసింది ఎవరంటే రాజశేఖర రెడ్డి గారే.

(శ్రీ జ్యోతుల నెహ్రూ గారు మైకు ఇవ్వవలసినదిగా కోరసాగారు)

(Interruptions)

MR. SPEAKER: Kindly be seated. Varma garu, please conclude.

శ్రీ ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ (పిఠాపురం)ః నేను సవాలు విసురుతున్నాను అధ్యక్షా. తూర్పు గోదావరి జిల్లాలో ఒక్క ఎకరా ఆయకట్టుకి రాజశేఖరరెడ్డి గారు నీరు ఇచ్చినట్లైతే, మీముందు నేను ముక్కు నేలకు రాసుకుంటాను అధ్యక్షా. (వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులచే అంతరాయం) మమ్మల్ని అన్నారు కాబట్టి చెప్తున్నాం, మమ్మల్ని మాట్లాడనివ్వండి. (మైకు ఆపు చేయబడింది.)

(శ్రీ జ్యోతుల నెహ్రూ గారు ఈ విషయమై మాట్లాడేందుకు మైకు కావలసినదిగా కోరసాగారు)

మిస్టర్ స్పీకర్ః వర్మ గారు, మీరు ఒక్క నిముషం ఆగండి. నెహ్రూ గారు, మీరు మాట్లాడండి.

శ్రీ జ్యోతుల నెహ్రూ (జగ్గంపేట)ః మిత్రులు శ్రీ వర్మ గారు చాలా ఆవేశపూరితమైన ఉపన్యాసం ఇస్తున్నారు. వారు కొత్తవారు కాబట్టి, పెద్దగా పరిగణనలోనికి తీసుకోవలసిన అవసరం లేదు. కానీ, శ్రీ రాజశేఖర రెడ్డి గారి హయాములో ఒక్క ఎకరాకు నీళ్ళిస్తే, నేలకు ముక్కు రాసుకుంటాననడం సరికాదు. తొందరపడొద్దు. ఎందుకంటే, రాజశేఖర రెడ్డి గారు ముఖ్యమంత్రి అయిన తరువాతే ఈ పుష్కర ఎత్తిపోతల పథకానికి రూ.600కోట్లు నిధులివ్వడం జరిగింది. వాటితోనే ఈ పథకాన్ని పూర్తిచేయడం జరిగింది. అదేవిధంగా, మా నియోజకవర్గానికి సంబంధించి, గోకవరం మండలంలో 24వేల ఎకరాలు ముసురుమిల్లు రిజర్వాయర్ ద్వారా, రెండు పంటలు పండించుకునేటువంటి పరిస్థితి ఉంది. శ్రీ రాజశేఖర రెడ్డి గారు ప్రారంభించినటువంటి పథకం అది. (మైకు ఆపు చేయబడింది)

మిస్టర్ స్పీకర్ః ఓ.కే. సూర్యారావు గారు.

(అధికార, ప్రతిపక్ష సభ్యుల వాగ్వాదములచే సభకు అంతరాయం కలుగసాగింది)

శ్రీ గొల్లపల్లి సూర్యారావు (రాజోలు)ః స్పీకర్ సర్, ప్రతిపక్షంలో ఉన్నటువంటి మా సోదరులు ఏమి మాట్లాడినా, ఏ విషయాలు చెప్పినా వినడానికి మేము సిద్ధంగా ఉన్నాం. అలాగే ఏ నాట్యం చేసినా, మేము చూడడానికి సిద్ధంగా ఉన్నాము. ఎలాంటి, హావభావాలు ప్రకటించినా మేము చూడడానికి సిద్ధంగానే ఉన్నాము.

మిస్టర్ స్పీకర్ః ఓ.కే. ఓ.కే., ప్లీజ్.

శ్రీ గొల్లపల్లి సూర్యారావు (రాజోలు)ః అధ్యక్షా, ప్రక్కనున్న వాళ్ళు చేసే వ్యాఖ్యలు, మైకుల్లోకిరావట్లేదు. వాళ్ళకు కూడా వర్తించేలా నేను మాట్లాడుతున్నాను. ఎలా నాట్యం చేసినా ఫరవాలేదు, ఏరకంగా, ఏ క్షణాన, ఎలాంటిది ఎక్స్‌పోజ్ చేసి మాకు ఇచ్చినా మేము భయపడం, బాధపడం, మేము వాటిని ఆస్వాదిస్తాం.

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులచే అంతరాయం)

శ్రీమతి ఆర్.కే.రోజా (నగరి)ః (మైకు లేకుండా) అలా మాట్లాడడం మీకు సభ్యతగా వుందా?

మిస్టర్ స్పీకర్ః సూర్యారావు గారు, ప్లీజ్ కంక్లూడ్.

శ్రీ గొల్లపల్లి సూర్యారావు (రాజోలు)ః అధ్యక్షా, మీకు చాలా వినబడట్లేదు, మీ నోటీసులోకి రావడం లేదు. వాళ్ళందర్నీ మేము గమనిస్తున్నాం. రాజశేఖరరెడ్డి గారి గురించి ఇక్కడ ఎవరూ కూడా ఒక్కమాట కూడా ప్రస్తావించట్లేదు. ఈరోజు శ్రీ రాజశేఖర రెడ్డి గారు మరణించిన రోజు. కనీసం ఎక్కడైనా, వాళ్ళ ముఖాల్లో గానీ, వాళ్ళ హావభావాల్లో గానీ, ఏమైనా కాస్త బాధ, ఏ ఒక్క వ్యక్తిలోనూ కనబడం లేదు.

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులచే అంతరాయం)

అధ్యక్షా, 2009వ సంవత్సరం, సెప్టెంబరు 2వ తేదీన, ఈ సమయానికి, యావత్ తెలుగుజాతి అంతా ఉత్కంఠతతో, ఆందోళనతో, ప్రజలందరూ.. ఏమయ్యింది, ఏమయ్యింది అని చూస్తున్న క్షణాలు..., అలాంటి సమయంలో, వీళ్ళ నాయకుడు, యువజన శ్రామిక రైతు పార్టీ నాయకుడు, సంతకాలు, కుర్చీ కోసం సంతకాలు....

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులచే తీవ్ర అంతరాయం)

కుర్చీ కోసం సంతకాల సేకరణలో ఉన్నటువంటి వారసులు అధ్యక్షా, వీళ్ళందరూ. ఆ నాయకుడి వారసులు. ప్రతీ మాటా అబద్దాలే. అబద్దాలు చెబుతున్నారు. అధ్యక్షా, ఎస్.ఈ.జెడ్.ల పేరుతో....తూర్పుగోదావరి జిల్లాలో, తుని నియోజకవర్గంలో రైతులు పడుతున్నటువంటి ఆందోళన...,

మిస్టర్ స్పీకర్ః సూర్యారావు గారు, ప్లీజ్ కంక్లూడ్. దయచేసి కూర్చోండి.

శ్రీ గొల్లపల్లి సూర్యారావు (రాజోలు)ః అధ్యక్షా, అందుచేత దయచేసి వాళ్ళని ఏమైనా మాట్లాడమనండి. మంత్రి గారు సమాధానం చెప్తారు. ముఖమంత్రిగారు కూడా సభలో ఉన్నారు. (మైకు కట్ చేయబడింది).

MR. SPEAKER: Yes. Varma garu, please conclude.

శ్రీ ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ (పిఠాపురం)ః ధన్యవాదాలు అధ్యక్షా. గౌరవ సభ్యులు జ్యోతుల నెహ్రూ గారు పుష్కర ఎత్తిపోతల పథకం గురించి మాట్లాడారు. వారూ, వారికి శిష్యుడిగా నేనూ, ఇద్దరం కలసి శ్రీ చంద్రబాబునాయుడు గారి వద్దకు ఈ పుష్కర ఎత్తిపోతల పథకానికి సంబంధించి తిరిగాము. ఆరోజు ప్రభుత్వాన్ని రద్దు చేసే ముందు, చంద్రబాబునాయుడు గారు పుష్కర ఎత్తిపోతల పథకానికి, ఆనాటి అంచనా విలువ ఐన రూ.196కోట్లును శాంక్షన్ చేశారు. తెలుగుదేశం పార్టీకి పుట్టిన బిడ్డ పుష్కర ఎత్తిపోతల పథకం. తరువాత రాజశేఖర రెడ్డి గారి హయాములో, వీళ్ళకి కమీషన్లు ఉంటాయి కాదా, ఆ బడ్జెట్ పెరిగి అంతకు చేరింది. అంతే కాకుండా, దేవుడి రాజ్యంలో సుమారు 2004 నుండి 2009 వరకు 2859 మంది రైతులు చనిపోయారు. ఎంత అన్యాయం సార్ ఇది. ఎంత ఘోరం సార్ ఇది.

(వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులచే తీవ్ర అంతరాయం)

MR. SPEAKER: Please be seated. Varma garu, please conclude.

(Interruptions)

శ్రీ ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ (పిఠాపురం)ః సార్, ఆయన ఎప్పుడూ మాట్లాడతారు. నాకు ఎక్కువ అవకాశం రాదు సార్. అరగంట టైమ్ వాళ్ళే తీసుకున్నారు.

(Interruptions)

మిస్టర్ స్పీకర్ః సరే మాట్లాడండి. త్వరగా ముగించండి.

శ్రీ ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ (పిఠాపురం)ః థ్యాంక్యూ సార్. పుష్కర ఎత్తిపోతల పథకం మంజూరు చేయడం ద్వారా, తూర్పుగోదావరి జిల్లా మెట్ట రైతాంగాన్ని చంద్రబాబునాయుడు గారు ఆదుకోవడం జరిగింది. రేపు రాబోయే రోజుల్లో పోలవరం వస్తే, పుష్కరను ప్రక్కన బెట్టి పోలవరాన్ని లింకు చేస్తే, ప్రభుత్వానికి వందల కోట్ల ఆదాయం వస్తుందని, ఆవిధంగా అనాడే పుష్కర కాలువకు డిజైన్ చేయించి, చంద్రబాబునాయుడు గారు ఆరోజు పుష్కర కాలువను త్రవ్వించారు.

రాజశేఖర రెడ్డిగారు వచ్చాక, కాలువ ప్రక్కన కాలువ, కాలువ ప్రక్కన కాలువ... దానివల్ల రైతుల భూములు వేలాది ఎకరాలు పోయి, రైతు కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఎస్.ఈ.జెడ్.లకు భూములనిచ్చిన రైతులేమో, వారి పిల్లలను పనులకు పంపిస్తున్నారు. పోలవరం కాలువకు భూములిచ్చిన రైతులేమో, ఎక్కడకో వెళ్ళి బిల్డింగుల దగ్గర పనిచేసుకుంటున్నారు. మొన్న హైదరాబాద్‌లో నలుగురు రైతులు కనబడ్డారు. ఏం? మీరు ఇక్కడున్నారని అడిగితే, కాలవల్లో మా భూములు పోయాయి, అక్కడ బ్రతకలేక ఇక్కడకు వచ్చామన్నారు. ఇటువంటి రాక్షస పరిపాలన, రాజశేఖరరెడ్డి గారి టైమ్‌లో చేసి, దోచుకుతిన్నారు. ప్రభుత్వానికి వేలకోట్ల భారం పడింది. మరి, ఇవన్నీ వదిలేసి, రాజశేఖర రెడ్డి గారు, రాజశేఖర రెడ్డి గారు అంటారు. ఏం చేశారు సార్, రాజశేఖర రెడ్డిగారు మా జిల్లాలో.

కాంగ్రెస్ పార్టీకీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకీ తేడా కూడా... తెలివిలేకుండా మాట్లాడుతున్నారు సార్ వాళ్ళు, కాంగ్రెస్ ప్రభుత్వం, వైఎస్సార్ ప్రభుత్వం కలిసి ఎన్నికల్లో పోటీ చేసిందా? ఎవ్వరికీ అర్థం కావట్లేదు. ఎంచేతంటే, కాంగ్రెస్ ప్రభుత్వంలో రాజశేఖర రెడ్డి గారు ఉన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం అది. తెలుగుదేశం ప్రభుత్వం ఉందంటే, చంద్రబాబునాయుడుగారు ఉన్నారు, తెలుగుదేశం పార్టీ అది.

రైతు మీ హయాములో దెబ్బతిన్నాడు. ఆరోజున్న కష్టాలకి రైతు రోడ్డుమీదకు వచ్చాడు. మరి, ఆనాడు ఆవిధంగా రైతులను దోచారు. ఈరోజు చంద్రబాబుగారి పరిపాలన వచ్చి 80 రోజులవుతోంది. ఈ 80 రోజుల్లో రైతులకు ఎక్కడా నష్టం జరగలేదు. మేము రైతుకు లాభసాటిగా ఉండేవిధంగా చర్యలు తీసుకుంటాం. రైతుని ఆర్థికంగా నిలబెడతాం. రాబోయే రోజుల్లో రైతుల రుణమాఫీ ద్వారా రైతుని ఆదుకుంటాం. మీరూ రండి. రైతుని లాభసాటిగా చేద్దాం. రైతుని ధనవంతుణ్ణి చేద్దాం. రైతుకు గిట్టుబాటు ధర లభించేట్టు చేద్దాం, అని కోరుకుంటూ, ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

MR. SPEAKER: The House is now adjourned to meet again at 9.00 A.M tomorrow.

(The House then adjourned at 2.09 P.M, to meet again at 9-00 AM on Wednesday, the 3rd of September 2014.)